


అమరావతి గురించి వైఎస్ జగన్ చేస్తున్న వ్యాఖ్యలు బాధ్యతారాహిత్యమైనవి. ప్రపంచ స్థాయి రాజధాని నిర్మాణాన్ని గత వైసీపీ ప్రభుత్వం ఐదేళ్ల పాటు అడ్డుకుంది. అభివృద్ధి పనులు నిలిపివేసి వేలాది కుటుంబాలను ఇబ్బందులకు గురిచేసిన వారు ఇప్పుడు రాజధాని అభివృద్ధిపై మాట్లాడటం ఆశ్చర్యకరం.

**ఆలపాటి రాజేంద్రప్రసాద్, ఎమ్మెల్సీ**



బుధవారం 03.06.2026

INK OF TRUTH

# జర్నలిస్ట్ ఫైల్

తెలుగు దినపత్రిక

సంపుటి - 34 సంచిక - 42 www.journalistfile.com పేజీలు 8 వెల : రూ.5.00

# ప్రతి ఓటు కీలకం.. ఎస్ఐఆర్‌పై అప్రమత్తంగా ఉండండి

- ప్రతీ ఓటు మ్యాపింగ్ చేయాలి... అర్హులైన ప్రతీ ఒక్కరూ ఓటర్ల జాబితాలో ఉండాలి
- కూటమి పార్టీలను సమన్వయం చేసుకుంటూ ఎస్.ఐ.ఆర్ పై యాక్షన్ ప్లాన్
- ఎస్.ఐ.ఆర్ పై రాష్ట్ర స్థాయి నుంచి మండల స్థాయి వరకు శిక్షణ
- రెండేళ్ల పాలనపై ఈ నెల 25 నుంచి 45 రోజుల పాటు సైకిళ్లపై ఇంటింటి ప్రచారం
- ఓటర్ల జాబితాపైనా గొడ్డలి పార్టీ విషయంలో అప్రమత్తత అవసరం
- నాకు అనుచరులు వద్దు... పార్టీకి నాయకులు కావాలి



**అమరావతి(జర్నలిస్ట్ ఫైల్) :** ఓటర్ల జాబితాకు సంబంధించి కేంద్ర ఎన్నికల సంఘం చేపట్టే స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్(ఎస్.ఐ.ఆర్) ప్రక్రియపై ప్రతీ ఒక్కరూ అవగాహన కల్పించుకోవాలని.. అప్రమత్తంగా ఉండాలని టీడీపీ అధినేత, ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు సూచించారు. టీడీపీ కేంద్ర కార్యాలయంలో మంగళవారం ఎస్.ఐ.ఆర్ పై జరిగిన రాష్ట్ర స్థాయి వర్క్ షాప్‌కు సీఎం చంద్రబాబు హాజరయ్యారు. ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, జోనల్ కో-ఆర్డినేటర్లు, రాష్ట్ర పార్టీ ప్రధాన కార్యదర్శులు, పార్టీ పరిశీలకులు, బీఎల్ఏలు ఈ రాష్ట్ర స్థాయి వర్క్ షాప్‌లో పాల్గొన్నారు. వీరికి సీఎం చంద్రబాబు దిశా నిర్దేశం చేశారు. ఎన్నికల్లో ఓటర్ల జాబితాలను ఆధారం చేసుకుని వ్యూహాలు, ప్రణాళికలు సిద్ధం చేసుకోవాల్సి ఉంటుందని గుర్తు చేశారు. దీన్ని దృష్టిలో పెట్టుకుని ఎస్.ఐ.ఆర్ ప్రక్రియపై రాష్ట్రస్థాయి నేతలు మొదలుకుని.. గ్రామస్థాయి వరకు మిగతా 2లో...

## భూమికి బలం.. రైతుకు లాభం



- రూ.62.20 కోట్ల సబ్సిడీతో పచ్చిరొట్ట విత్తనాల పంపిణీ
- భూసార పరిరక్షణకు కూటమి ప్రభుత్వ ప్రాధాన్యం
- రైతులకు పెట్టుబడి భారం తగ్గించి అధిక దిగుబడులే లక్ష్యం
- పచ్చిరొట్ట సాగుతో నేల సారం పెంపు, రసాయన ఎరువుల వినియోగం తగ్గింపు
- వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు

**అమరావతి(జర్నలిస్ట్ ఫైల్) :** రైతు సంక్షేమం, భూసార పరిరక్షణ, సుస్థిర వ్యవసాయాభివృద్ధికి కట్టుబడి ఉన్న రాష్ట్ర ప్రభుత్వం ఖరీఫ్--2026 సీజన్‌లో పచ్చిరొట్ట పంటల సాగును విస్తృతంగా ప్రోత్సహిస్తున్నట్లు రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు తెలిపారు. మిగతా 2లో...

## ఓపీఎస్ అమలుతో వేలాది ఉద్యోగులకు లబ్ధి

2003 డీఎస్సీ అభ్యర్థులకు ఓపీఎస్ వర్తింపు..11 వేల మందికి ప్రయోజనం

- పదవి విరమణ ఉద్యోగులకు ప్రయోజనం
- కూటమి ప్రభుత్వం కీలక నిర్ణయం
- ఎమ్మెల్సీ ఆలపాటి రాజేంద్రప్రసాద్



**గుంటూరు(జర్నలిస్ట్ ఫైల్) :** ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు నేతృత్వంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఉద్యోగులు, ఉపాధ్యాయుల సంక్షేమం, ఉపాధి కల్పనపై ప్రత్యేక దృష్టి సారించిందని పట్టభద్రుల ఎమ్మెల్సీ ఆలపాటి రాజేంద్రప్రసాద్ అన్నారు. మంగళవారం జిల్లా తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు.

ఉపాధ్యాయ సంఘాలు గత వైసీపీ ప్రభుత్వ హయాంలో 2003 డీఎస్సీ అభ్యర్థులకు సీపీఎస్ రద్దు చేసి ఓపీఎస్ అమలు చేయాలని దీర్ఘకాలం పోరాటం చేశాయని గుర్తు చేశారు. ప్రస్తుతం చంద్రబాబు నాయుడు నేతృత్వంలోని కూటమి ప్రభుత్వం ఆధ్వర్యంలో 2003 డీఎస్సీ అభ్యర్థులకు ఓపీఎస్ అమలుతో కృష్ణా, గుంటూరు జిల్లాలకు చెందిన సుమారు 11 వేల మంది ఉద్యోగులు లబ్ధి పొందనున్నారని తెలిపారు. అదేవిధంగా పదవీ విరమణ పొందిన ఉద్యోగులతో పాటు వేలాది మంది ఉద్యోగులకు ప్రయోజనం చేకూరుతుందని పేర్కొన్నారు.

ఓపీఎస్ కింద లబ్ధి పొందుతున్న ఉద్యోగులతో త్వరలో భారీ బహిరంగ సభ నిర్వహించేందుకు సన్నాహాలు చేస్తున్నట్లు వెల్లడించారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను కూటమి ప్రభుత్వం అమలు చేస్తోందని, ఈ నిర్ణయంతో రాష్ట్రంలోని లక్షలాది ఉపాధ్యాయ కుటుంబాలు ఆనందంగా ఉన్నాయని చెప్పారు.

అమరావతి రాజధాని అంశంపై మాట్లాడుతూ, ఇటీవల వైసీపీ అధ్యక్షుడు జగన్‌మోహన్ రెడ్డిని కలిసిన వారిలో నిజమైన రాజధాని రైతులు లేరని, 8 లో..

## తెలంగాణలోనూ జనసేన పోటీ



**హైదరాబాద్ (జర్నలిస్ట్ ఫైల్) :** తెలంగాణలో జనసేన పార్టీ ఉంటుందని ఆ పార్టీ అధినేత, ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ ప్రకటించారు. తెలంగాణలో పోటీ చేస్తామని ఆయన కుండ బద్దలు కొట్టారు. మంగళవారం జూబ్లీహిల్స్‌లోని జనసేన పార్టీ కార్యాలయంలో ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ మాట్లాడుతూ.. దేశంలో తెలంగాణ అంతర్భాగమని స్పష్టం చేశారు. తెలంగాణను వ్యతిరేకించిన వారే.. పదవుల్లో ఉన్నారని.. ఎమ్మెల్యేలు అయ్యారని పవన్ కల్యాణ్ వివరించారు.

**తాటాకు చప్పుళ్లకు.. :** తెలంగాణ అంటే గౌరవం ఉంది కనుకే కొండగట్టు ఆలయానికి కోట్ల రూపాయిలు విరాళంగా ఇచ్చామన్నారు పవన్ కల్యాణ్. మీ తాటాకు చప్పుళ్లకు జనసేన పార్టీ భయపడదన్నారు. భయపడేవాడినే అయితే పార్టీ పెడతానా? అని ప్రశ్నించారు. తెలంగాణకు ద్రోహం జరిగితే మొట్టమొదట గొంతులేపేది జనసేన పార్టీనే అని స్పష్టం చేశారు. ఏం చేసినా ఓట్ల కోసం కాదు.. తనకు తెలంగాణపై ప్రేమ, మమకారం ఉన్నాయన్నారు. గుంటూరులో టీఆర్ఎస్ కార్యాలయం పెడితే స్వాగతించామని ఏపీ డిప్యూటీ సీఎం గుర్తు చేశారు. మిగతా 3లో...

## తుంగభద్రకు నూతన కవచం



**అమరావతి(జర్నలిస్ట్ ఫైల్) :** తుంగభద్ర ప్రాజెక్టులో 70 ఏళ్ల నాటి పాత గేట్ల స్థానంలో కొత్త గేట్లను ఏర్పాటు చేయడం ద్వారా దేశంలోనే అరుదైన రికార్డు నెలకొల్పామని జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు తెలిపారు. అమరావతి సచివాలయంలో తుంగభద్ర బోర్డు చైర్మన్ ఎస్.ఎన్. పాండే, కార్యదర్శి ఓ. ఆర్.కె. రెడ్డితో మంత్రి మంగళవారం సమావేశమయ్యారు.

ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ, కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన అనంతరం కొట్టుకుపోయిన తుంగభద్ర డ్యాం 19వ గేటు స్థానంలో భారీ వరదల మధ్యే స్టాప్ లాగ్ గేట్‌ను ఏర్పాటు చేసి 80 టీఎంసీల నీటిని కాపాడగలిగామని చెప్పారు. దీంతో రాయలసీమ ప్రాంతానికి సాగు, తాగునీటి అవసరాలు తీర్చడం సాధ్యమైందన్నారు.

తుంగభద్ర డ్యాం గేట్లు ప్రమాదకర స్థితిలో ఉన్నాయని నిపుణులు హెచ్చరించినప్పటికీ గత ఐదేళ్లలో వైసీపీ ప్రభుత్వం నిర్లక్ష్యం చేసిందని విమర్శించారు. రాయలసీమ కరువు ప్రాంతానికి జీవనాధారమైన తుంగభద్ర ప్రాజెక్టు ప్రాధాన్యతను గుర్తించిన ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఆదేశాల మేరకు కేవలం ఆరు నెలల్లోనే కొత్త గేట్ల ఏర్పాటును పూర్తి చేశామన్నారు.

నిపుణుడు కన్నయ్యనాయుడు సూచనల మేరకు రూ.51 కోట్ల వ్యయంతో పాత గేట్లను తొలగించి 33 కొత్త గేట్లను ఒకే సీజన్‌లో ఏర్పాటు చేయడం దేశ చరిత్రలోనే రికార్డుగా నిలిచిందని మంత్రి పేర్కొన్నారు. మిగతా 2లో...

## 'పవర్ ఆఫ్ సైకిల్' చాటుదాం



**అమరావతి(జర్నలిస్ట్ ఫైల్) :** చిన్న పామైనా పెద్ద కర్రతో కొట్టాలనే సామెత తరహాలో గొడ్డలి పార్టీ విషయంలో నిరంతరం అప్రమత్తంగా ఉండాలని ముఖ్యమంత్రి చంద్రబాబు సూచించారు. లేకుంటే విషం చిమ్ముతూనే ఉంటుందని ప్రతి ఒక్కరూ గుర్తించాలన్నారు. తాను ఎన్నో పోరాటాలు చేశానని కానీ నీచులతో ఎప్పుడూ పోరాటాలు చేయలేదని అన్నారు. పార్టీ పెట్టినప్పటి నుంచి హిందూపురం, కుప్పం సహా ఇంకొన్ని నియోజకవర్గాల్లో గెలుస్తూనే ఉన్నాం.. ఇలాంటి నియోజకవర్గాల సంఖ్య పెరగాలని సూచించారు. కొత్తగా ఎమ్మెల్యేలు అయిన వారు వన్ టైమ్ ఎమ్మెల్యేలుగా మిగిలిపోకూడదని మళ్లీ మళ్లీ గెలవాలని సీఎం దిశానిర్దేశం చేవారు. అభివృద్ధి, సుపరిపాలన ద్వారానే ఓట్లు పడతాయన్నారు.

ఎన్నికల్లో హామీ ఇచ్చి మొదటి సంతకం పెట్టి మెగా డీఎస్సీ నిర్వహించామని సీఎం గుర్తుచేశారు. మెగా డీఎస్సీ జరగకూడదని 241 కేసులు వేసి అడ్డుకున్నారని, కానీ వాటిని ఎదుర్కొని అత్యంత పారదర్శకంగా డీఎస్సీ నిర్వహించి నియామకాలు పూర్తి చేశామన్నారు. పారదర్శకంగా నిర్వహించిన డీఎస్సీపై తప్పుడు ప్రచారం చేస్తున్నారని ఆరోపించారు. గట్టిగా కౌంటర్లు ఇస్తే ఇప్పుడు తోకముడిచారని అన్నారు.

గైర్హాజరుపై ఆగ్రహం: ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ (సర్) సమయంలో ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని టీడీపీ ఎమ్మెల్యేలకు ఆ పార్టీ జాతీయ అధ్యక్షుడు, సీఎం చంద్రబాబు దిశానిర్దేశం చేశారు. జనసేన, భాజపాతో కలిసి సమన్వయం చేసుకొని 'సర్'ని పర్యవేక్షించాలన్నారు. - 3లో...

## పుష్కరాలకు అఖండ సిద్ధత



- సాంస్కృతిక వైభవం ఉట్టిపడేలా గోదావరి పుష్కరాలు
- ఆధ్యాత్మిక పర్యాటకానికి అత్యధిక ప్రాధాన్యం
- పుణ్య స్నానాలకు 10 కోట్ల మంది వస్తారని అంచనాలు
- 6 జిల్లాల్లో కొత్తగా 237 ఘాట్లు నిర్మించాలని ప్రతిపాదనలు
- త్వరలో పుష్కర లోగో విడుదల - విస్తృతంగా ప్రచారం

**అమరావతి(జర్నలిస్ట్ ఫైల్) :** వచ్చే ఏడాది గోదావరి పుష్కరాల్లో ఆంధ్రప్రదేశ్ సాంస్కృతిక, చారిత్రక వైభవం ఉట్టిపడేలా... మరింత ఆకర్షణీయంగా నిర్వహించాలని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అధికారులను ఆదేశించారు. గోదావరి సమీప ప్రాంతాల్లో ఎన్నో పుణ్యక్షేత్రాలు కొలువై ఉన్నందున పుష్కరాల్లో ఆధ్యాత్మిక పర్యాటకానికి అత్యధిక ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు. పుష్కరాలకు వచ్చే భక్తులతో ఆర్థిక కార్యకలాపాలు పెరగాలన్నారు. అత్యంత ప్రతిష్టాత్మకంగా గోదావరి పుష్కరాలను నిర్వహించేందుకు అన్ని శాఖలూ సమన్వయంతో పనిచేయాలని సీఎం స్పష్టం చేశారు. గోదావరి పుష్కరాలు-2027 నిర్వహణపై మంత్రుల కమిటీ, వివిధ శాఖల అధికారులతో సచివాలయంలో మంగళవారం ముఖ్యమంత్రి సమీక్ష నిర్వహించారు. అఖండ గోదావరి అభివృద్ధి ప్రాజెక్టుపై సమీక్షలో మిగతా 2లో...

## డిజిటల్ ఎకానమీకి ఏపీ కీలక గమ్యం



**అమరావతి(జర్నలిస్ట్ ఫైల్) :** భవిష్యత్తు డిజిటల్ ఎకానమీకి ఆంధ్రప్రదేశ్ కీలక గమ్యస్థానంగా ఎదుగుతోంది రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు విశ్వాసం వ్యక్తం చేశారు. డిజిటల్ హబ్‌గా విశాఖపట్నం వేగంగా అభివృద్ధి చెందుతోందన్నారు. మంగళవారం రాజధాని అమరావతిలో ఆసియా-పసిఫిక్‌లో ప్రముఖ హైపర్‌స్కేల్ డిజిటల్ ఇన్‌ఫ్రా సంస్థ ఎయిర్‌ట్రంక్ వ్యవస్థాపకుడు మిగతా 2లో...

ఇళ్లు, ఇళ్ల స్థలాల క్రమబద్ధీకరణకు

## గ్రీన్ సిగ్నల్!

- జిల్లాల్లో పరిష్కారం కాని ఇళ్ల సమస్యలను కెబినెట్‌కు తీసుకురండి
- గృహనిర్మాణ శాఖలో పెండింగ్ బిల్లుల చెల్లింపులపై దృష్టి పెట్టండి
- ఆర్టీజీఎస్ సమీక్షలో ముఖ్యమంత్రి చంద్రబాబు

2 లో

# ఓపీఎస్ అమలుతో వేలాది ఉద్యోగులకు లబ్ధి



(మొదటి పేజీ తరువాయి)

వారంతా వైసీపీ కార్యకర్తలేనని ఆరోపించారు. అమరావతి కోసం రాజధాని రైతులు గతంలో చేసిన ఉద్యమాలను ప్రజలు గుర్తుంచుకున్నారని అన్నారు. ప్రపంచం మెచ్చే రాజధానిగా అమరావతి అభివృద్ధి చెందడాన్ని ఎవరూ అడ్డుకోలేరని వ్యాఖ్యానించారు.

మాజీ ఎమ్మెల్సీ ఏఎస్ రామకృష్ణ మాట్లాడుతూ, 2019 ఎన్నికల్లో సీపీఎస్ రద్దు చేసి ఓపీఎస్ అమలు చేస్తామని వైసీపీ ఇచ్చిన హామీని అమలు చేయలేదని విమర్శించారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత 11 వేల మంది ఉద్యోగులకు ఓపీఎస్ ప్రయోజనాలు అందేలా చర్యలు చేపట్టిందన్నారు. ఎన్నికల హామీగా లేకపోయినా ఉద్యోగుల ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకుని నిర్ణయం తీసుకున్న ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుకు కృతజ్ఞతలు తెలిపారు.

డీఎస్సీ నియామకాలపై కొంతకాలంగా జరుగుతున్న విమర్శలను ప్రస్తావిస్తూ, డీఎస్సీలో ఎలాంటి అవకతవకలు జరగలేదని విద్యాశాఖ అధికారులు ఇప్పటికే స్పష్టం చేశారని పేర్కొన్నారు. గత ఐదేళ్లలో వైసీపీ ప్రభుత్వం ఒక్క ఉపాధ్యాయ పోస్టును కూడా భర్తీ చేయలేకపోయిందని విమర్శించారు.

ఈ సమావేశంలో రాష్ట్ర ఉపాధ్యాయ సంఘ నాయకుడు మోపిదేవి శివశంకరరావు తదితరులు పాల్గొన్నారు.

# భూమికి బలం.. రైతుకు లాభం

(మొదటి పేజీ తరువాయి)

ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు నాయకత్వంలోని కూటమి ప్రభుత్వం వ్యవసాయాన్ని మరింత లాభసాటిగా తీర్చిదిద్దే లక్ష్యంతో రైతులకు అవసరమైన మద్దతు అందిస్తోందని పేర్కొన్నారు. పచ్చిరొట్ట పంటల సాగును ప్రోత్సహించేందుకు ప్రభుత్వం రూ. 62.20 కోట్ల సబ్సిడీని కేటాయించినట్లు మంత్రి వెల్లడించారు. ఈ పథకం కింద రాష్ట్రవ్యాప్తంగా 91,918 క్వింటాళ్ల విత్తనాలను జిల్లాలకు కేటాయించగా, అందులో జీలుగ 50,311 క్వింటాళు ,, జనుము 21,291 క్వింటాళ్లు, పిల్లి పెసర 20,316 క్వింటాళ్లు ఉన్నాయని తెలిపారు. ఇప్పటికే 40,459 క్వింటాళ్ల విత్తనాలను జిల్లాలకు సరఫరా చేయగా, 19,667 మంది రైతులకు 5,687 క్వింటాళ్ల విత్తనాలను పంపిణీ చేసి రూ. 4.76 కోట్ల సబ్సిడీ ప్రయోజనాన్ని అందించినట్లు చెప్పారు.

పచ్చిరొట్ట పంటలు నేల ఆరోగ్యాన్ని మెరుగుపరచడంలో కీలక పాత్ర పోషిస్తాయని మంత్రి వివరించారు. ఈ పంటలను భూమిలో కలపడం ద్వారా సేంద్రియ కార్బన్ శాతం పెరగడంతో పాటు నత్రజని నిల్వలు అధికమవుతాయని తెలిపారు. దీనివల్ల రసాయన ఎరువులపై ఆధారపడటం తగ్గి, రైతుల సాగు వ్యయం నియంత్రణలో ఉండటమే కాకుండా భూముల ఉత్పాదకత కూడా గణనీయంగా పెరుగుతుందని పేర్కొన్నారు. సహజ, సేంద్రియ వ్యవసాయ విధానాల పట్ల రైతుల్లో ఆసక్తి పెరుగుతున్న నేపథ్యంలో పచ్చిరొట్ట సాగుకు ప్రభుత్వం ప్రత్యేక ప్రోత్సాహం అందిస్తోందన్నారు. గ్రామ స్థాయిలో వ్యవసాయ శాఖ అధికారులు రైతులకు అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తూ ఈ పంటల ప్రాముఖ్యతను వివరిస్తున్నారని చెప్పారు. ప్రభుత్వ ప్రోత్సాహానికి రైతుల నుంచి మంచి స్పందన లభిస్తోందని తెలిపారు.

కృష్ణా, గుంటూరు, అన్నమయ్య, వైఎస్సార్ కడప, ఏలూరు, బాపట్ల, విజయనగరం, శ్రీకాకుళం తదితర జిల్లాల్లో ఈ కార్యక్రమం ద్వారా వేలాది మంది రైతులు ఇప్పటికే లబ్ధి పొందినట్లు మంత్రి వెల్లడించారు. రైతుల అవసరాలకు అనుగుణంగా విత్తనాల సరఫరాను మరింత పెంచి పంపిణీ ప్రక్రియను వేగవంతం చేయాలని అధికారులకు ఆదేశాలు జారీ చేసినట్లు తెలిపారు.

## హైకోర్టు న్యాయమూర్తుల నివాస సముదాయాలు, శాశ్వత హైకోర్టు భవనాల భద్రతపై ఉన్నతస్థాయి సమీక్ష



**తుళ్లూరు (జర్నలిస్ట్ ఫైల్) :** అమరావతి రాజధాని ప్రాంతంలో నిర్మాణంలో ఉన్న హైకోర్టు న్యాయమూర్తుల నివాస సముదాయాలు (జడ్జెస్ విల్లాస్), శాశ్వత హైకోర్టు భవనాల భద్రతా ఏర్పాట్లపై మంగళవారం ఉన్నతస్థాయి సమీక్ష సమావేశం నిర్వహించారు. వెలగపూడిలోని నూతన డీఎస్పీ కార్యాలయంలో జరిగిన ఈ సమావేశంలో గుంటూరు రేంజ్ ఐజీ సర్వశ్రేష్ఠ త్రిపాఠి, జిల్లా ఎస్పీ వకుల్ జిందాల్ పాల్గొని భద్రతా అంశాలపై అధికారులకు దిశానిర్దేశం చేశారు.

నేలపాడు రెవెన్యూ పరిధిలో నిర్మాణంలో ఉన్న హైకోర్టు న్యాయమూర్తుల నివాస సముదాయాలు, శాశ్వత హైకోర్టు భవనాల వద్ద అత్యున్నత స్థాయి భద్రత కల్పించేందుకు చేపట్టాల్సిన చర్యలపై సమావేశంలో విస్తృతంగా చర్చించారు. న్యాయమూర్తుల నివాస సముదాయాలకు బహుళస్థాయి భద్రతా వ్యవస్థ ఏర్పాటు, వీవీఐపీ, వీఐపీ నివాసాల వద్ద 24 గంటల భద్రతా సిబ్బంది మోహరింపు, ప్రధాన ప్రవేశ ద్వారాలు, అంతర్గత రహదారులు, పరిసర ప్రాంతాల్లో ఆధునిక సీసీటీవీ నిఘా వ్యవస్థ ఏర్పాటు వంటి అంశాలపై కార్యాచరణ ప్రణాళికను సమీక్షించారు.

సందర్శకుల ప్రవేశానికి కట్టుదిట్టమైన తనిఖీ విధానాలు అమలు చేయడం, అత్యవసర పరిస్థితుల నిర్వహణ కోసం ప్రత్యేక క్విక్ రెస్పాన్స్ టీమ్‌లను ఏర్పాటు చేయడం, వీవీఐపీ, వీఐపీ రూట్లలో ట్రాఫిక్ నియంత్రణ, భద్రతా తనిఖీలను మరింత బలోపేతం చేయడంపై చర్చించారు. అలాగే ఇంటెలిజెన్స్ సమాచార సేకరణ, యాంటీ-సాబోటేజ్ తనిఖీలు, డామినేషన్ పెట్రోలింగ్, కంట్రోల్ రూమ్‌తో సమన్వయ వ్యవస్థలను మరింత సమర్థవంతంగా నిర్వహించేందుకు సూచనలు చేశారు.

సమావేశం అనంతరం పోలీసు, ఇంటెలిజెన్స్, భద్రతా విభాగాలు, ఎస్పీఎఫ్ అధికారులు కలిసి నిర్మాణంలో ఉన్న హైకోర్టు న్యాయమూర్తుల నివాస సముదాయాలు, శాశ్వత హైకోర్టు భవనాలను సందర్శించి భద్రతా ఏర్పాట్లను పరిశీలించారు. నిర్మాణ పురోగతి, భద్రతా మౌలిక సదుపాయాల ఏర్పాటు, భవిష్యత్తు అవసరాలు, సిబ్బంది మోహరింపు వంటి అంశాలను సమీక్షించి సంబంధిత అధికారులకు తగిన సూచనలు జారీ చేశారు.

హైకోర్టు న్యాయమూర్తుల నివాస సముదాయాలు, శాశ్వత హైకోర్టు భవనాల భద్రతకు అత్యున్నత ప్రాధాన్యత ఇస్తూ సమగ్ర భద్రతా వ్యవస్థను అమలు చేయడానికి అన్ని విభాగాలు సమన్వయంతో పనిచేయాలని ఉన్నతాధికారులు ఆదేశించారు.

ఈ సమావేశంలో ఐఎస్‌డబ్ల్యూ ఎస్పీ ఆరిఫ్ హాఫీజ్, ఎస్పీఎఫ్ ఎస్పీ ఎం. శంకరరావు, అదనపు ఎస్పీలు, డీఎస్పీలు, సీఐలు మరియు ఇతర అధికారులు పాల్గొన్నారు.

# ప్రతి ఓటు కీలకం.. ఎస్ఐఆర్‌పై అప్రమత్తంగా ఉండండి

(మొదటి పేజీ తరువాయి)

ప్రతిఒక్కరూ అవగాహన పెంచుకోవడమే కాకుండా.. పూర్తి స్థాయిలో అప్రమత్తంగా ఉండాలని స్పష్టం చేశారు. ఈ సందర్భంగా టీడీపీ అధినేత చంద్రబాబు మాట్లాడుతూ..."మహానాడును వర్చువల్‌గా అద్భుతంగా నిర్వహించుకున్నాం. రెండు రోజుల మహానాడుకు 24.50 లక్షల మంది హాజరయ్యారు. వర్చువల్‌గా మహానాడు ఈ స్థాయిలో నిర్వహించుకోవడం సాధ్యమా అనే అనుమానాలను పటాపంచలు చేస్తూ... సక్సెస్ చేసుకోగలిగాం. ఇప్పుడు పార్టీ యంత్రాంగంపై అతి పెద్ద కీలక బాధ్యత ఉంది. ఇప్పుడు రాష్ట్ర వ్యాప్తంగా ఎస్.ఐ.ఆర్ ప్రక్రియ మొదలవుతోంది. ప్రతీ 20-25 ఏళ్లకోసారి స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ జరుగుతుంది. 2002 ఓటర్ల జాబితాను పరిగణనలోకి తీసుకుని ఎస్.ఐ.ఆర్ ప్రక్రియను చేపడుతున్నారు. జులై 14వ తేదీలోగా రెండుసార్లు ఓట్ల మ్యాపింగ్ చేస్తారు. ఈ రెండు సార్లు మ్యాపింగ్ జరిగేలోగా ఓట్ల చేరికలు పరిపూర్ణంగా పూర్తి కావాలి. అవసరమైతే మూడోసారి కూడా ఇళ్లకు వెళ్లి ఓట్ల పరిశీలన జరపాలి. బీఎల్ఓలతో పాటు.. మన పార్టీకి చెందిన బీఎల్ఏలు కూడా వెళ్లాలి. ఎస్.ఐ.ఆర్ ను అందరూ సీరియస్‌గా తీసుకోవాలి... ఎలాంటి నిర్లక్ష్యమూ ఉండకూడదు. ఓట్లు నమోదు చేసుకోవడం ఓటర్ల బాధ్యత. ఓట్ల చేరికలపై ప్రజలకు అవగాహన కల్పించడం రాజకీయ పార్టీగా మన ప్రాథమిక బాధ్యత. ఏ ఎన్నికలకైనా ఓటర్ల జాబితా అనేది చాలా కీలకం. ఓటర్ల జాబితా ఆధారంగానే ఎన్నికల్లో వ్యూహాలు అమలు చేయగలం... ప్రణాళికలు సిద్ధం చేసుకుంటాం. పార్టీ బలంగా ఉంటే... ప్రభుత్వం మరింత బలంగా ఉంటుంది. ఎస్.ఐ.ఆర్ పై ప్రతీ రోజూ మానిటర్ చేస్తాం. మన ఓట్లు ఉన్నాయా..? లేవా..? అనేది నిరంతరం చూసుకోవాలి. ఏపీకి చెందిన స్థానికులు వివిధ రకాల కారణాలతో ఇతర ప్రాంతాలకు వెళ్లారు. వారి ఓట్ల విషయంలో జాగ్రత్తలు తీసుకోవాలి. వివిధ ప్రాంతాల్లో ఉన్న వాళ్లు పెద్ద ఎత్తున వచ్చి ఓట్లేయడం వల్లే మొన్నటి ఎన్నికల్లో కూటమికి 164 సీట్లు వచ్చాయి."అని చంద్రబాబు స్పష్టం చేశారు.



**కూటమి పార్టీల సమన్వయం ముఖ్యం :** "ఎస్.ఐ.ఆర్ ప్రక్రియ పర్యవేక్షణలో కూటమి పార్టీలను కూడా సమన్వయం చేసుకుని వెళ్లాలి. ఎన్నికలప్పుడే మిత్రపక్షాలతో కలుస్తాం... మిగిలిన రోజుల్లో పట్టించుకోం అంటే కుదరదు. ప్రభుత్వంలోనే కాదు.. అన్ని కార్యక్రమాల్లోనూ జనసేన, బీజేపీలతో సమన్వయం చేసుకోవాలి. నా రాజకీయ చరిత్రలో 2024 ఎన్నికల్లో సాధించినటు వంటి ఘన విజయం ఎప్పుడూ చూడలేదు. కొత్త వారికి టిక్కెట్లు ఇచ్చినా.. కూటమి పార్టీ అభ్యర్థి అనగానే ప్రజలు, కార్యకర్తలు ఓటేశారు. పార్టీల మధ్య సమన్వయానికి ఎస్.ఐ.ఆర్ మొదటి టెస్ట్. చాలా మంది అనుచరులను కోరుకుంటారు... కానీ నేను నాయకులను కోరుకుంటాను. సమర్థవంతమైన నాయకత్వం ఉంటే పార్టీకి బలం పెరుగుతుంది. 2024 ఎన్నికల ముందు పట్టభద్రుల ఎమ్మెల్సీలు గెలిచాం. పూర్తిస్థాయిలో గ్రౌండ్ వర్క్.. టెక్నికల్ వర్క్ చేసి అద్భుత విజయాన్ని నాటి ఎమ్మెల్సీ ఎన్నికల్లో చూపించాం. గ్రాడ్యుయేట్ల ఎన్నికల్లో ఒకప్పుడు పోటీ చేసేవాళ్లం కాదు. కానీ నాడు ఆ ఎన్నికల్లో పోటీ చేశాం.. గెలిచాం.. అదీ మన నెట్ వర్క్ గొప్పదనం. ఎస్.ఐ.ఆర్ విషయంలోనూ అదే స్థాయిలో కష్టపడి పని చేయాలి. పార్టీలో వివిధ కీలక అంశాలపై చర్చలు జరగాలి.. కార్యకర్తలు చర్చల్లో భాగస్వామ్యం కావాలి. అధికార ఫలితాలు కార్యకర్తలకు అందించాలి. క్షేత్రస్థాయిలో కొన్నిచోట్ల మిత్రపక్షాలు ఉండకపోవచ్చు. అయినా వారిని కూడా కలుపుకుని వెళ్లాలి. 2024 ఎన్నికలకంటే ఎక్కువగా మిత్రపక్షాలతో పని చేయాలి. మిత్రధర్మాన్ని ప్రతి నేతా, ప్రతి కార్యకర్తా పాటించాల్సిందే. ఎస్.ఐ.ఆర్ పై మూడు పార్టీలతో త్వరలో కో-ఆర్డినేషన్ కమిటీ కూడా వేస్తాం. దీనికి సంబంధించి త్వరలో ఓ ఎన్డీఏ సమావేశం నిర్వహించుకుంటాం."అని టీడీపీ అధినేత వెల్లడించారు.

**సైకిల్ పవర్ చూపుదాం... ప్రజలకు చేరువవుదాం :** "జూన్ 25 నుంచి ఆగస్టు 10 వరకు ఇంటింటి ప్రచారం చేపట్టాలి. రెండేళ్లల్లో ప్రభుత్వం చేపట్టిన సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను వివరించాలి. 45 రోజుల్లో ఇంటింటి ప్రచారం చేపట్టాలి... పెద్ద ఎత్తున ప్రజల్లోకి వెళ్లాలి. ఈ ఇంటింటి ప్రచారంలో నేను కూడా పాల్గొంటాను. సైకిళ్ల మీద వెళ్లి ప్రజలను కలవాలి. వీలుంటే ఈ-సైకిళ్లపై ప్రచారం చేపట్టాలి. నేను కూడా సైకిల్ మీదే ప్రచారం చేస్తాను. ప్రధానిగా మోదీ 12 ఏళ్లు పూర్తి చేసుకున్నారు.. నేను నాలుగోసారి సీఎంగా ఉన్నాను. ఈ అంశాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లాలి. వీటితో పాటు కేంద్ర-రాష్ట్ర ప్రభుత్వాలు సాధించిన ప్రగతిపై పెద్ద ఎత్తున ప్రచారం చేపట్టాలి. టీడీపీ అందరికి చెందిన పార్టీ... తెలుగు వాళ్ల పార్టీ. ప్రతీ వర్గాన్ని మనం ఓన్ చేసుకోవాలి. సోషల్ రీ-ఇంజనీరింగ్‌తో పదవులు, సీట్ల కేటాయింపులు చేశాం. నామినేటెడ్ పదవుల్లోనూ.. పార్టీ పదవుల్లోనూ సోషల్ రీ-ఇంజనీరింగ్ చేపడుతున్నాం. కార్యకర్తల సాధికారత గురించి ఆలోచించాలి... కార్యకర్తల సంక్షేమం కోసం ప్రత్యేక విభాగాన్ని టీడీపీ తప్ప ఏ పార్టీ పెట్టలేదు. చనిపోయిన కార్యకర్తల కుటుంబాలను ఆదుకుంటున్నాం. చనిపోయిన కార్యకర్తలకు రూ. 5 లక్షల ప్రమాద బీమా ఇస్తున్నాం... పిల్లల చదువుకు ప్రత్యేకంగా స్కూల్ ఏర్పాటు చేశాం. కార్యకర్తల పిల్లలకు నైపుణ్య శిక్షణ ఇచ్చి మంచి ఉద్యోగాలకు సిఫార్సులు చేస్తున్నాం. కార్యకర్తల ఆర్థిక సాధికారత కోసం ఎథికల్ ఎకనమిక్ ఎంపవర్మెంట్ పేరుతో కార్యక్రమం నిర్వహిస్తున్నాం. ప్రతీ కార్యకర్త ఆరోగ్యంగా ఉండడానికి ఎంతైనా ఖర్చు చేస్తాం. మన కార్యకర్తలను ఆదుకునేందుకు పార్టీ చర్యలు తీసుకుంటుంది... అలాగే ప్రతీ నాయకుడు ఇదే విధంగా ఆలోచన చేయాలి. మనకు తెలిసి కానీ తెలియకుండా కానీ తప్పులు జరగకూడదు.. అన్ని విధాలా జాగ్రత్తలు తీసుకోవాలి. గత ప్రభుత్వంలో విధ్వంసమైన వ్యవస్థలను గాడిలో పెడుతున్నాం. ఈజ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్ నుంచి స్పీడ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్‌తో పోయిన బ్రాండ్ ను మళ్లీ తెచ్చాం. పోలవరం ప్రాజెక్టు ఆగిపోతుందని అందరూ భయపడ్డారు.. కానీ మళ్లీ ప్రాజెక్టును ట్రాక్‌లో పెట్టాం. సంక్షేమం అందిస్తున్నాం... అభివృద్ధిని పరుగులు పెట్టిస్తున్నాం. ఈ నెల 21వ తేదీన యోగా డేను అమరావతిలో 25 వేల మందితో నిర్వహిస్తాం. యోగా మన జీవన విధానంలో భాగం కావాలి."అని సీఎం చంద్రబాబు స్పష్టం చేశారు.

**వన్ టైమ్ ఎమ్మెల్యేలుగా మిగలొద్దు :** "చిన్న పామైనా పెద్ద కర్రతో కొట్టాలి... గొడ్డలి పార్టీ విషయంలో నిరంతరం అప్రమత్తంగా ఉండాలి. ఎన్నికల్లో హామీ ఇచ్చి.. మొదటి సంతకం పెట్టి మెగా డీఎస్సీ నిర్వహించాం. మెగా డీఎస్సీ జరగకూడదని 241 కేసులు వేసి అడ్డుకున్నారు. కానీ వాటిని ఎదుర్కొని అత్యంత పారదర్శకంగా డీఎస్సీ నిర్వహించి.. నియామకాలు పూర్తి చేశాం. పారదర్శకంగా నిర్వహించిన డీఎస్సీపై తప్పుడు ప్రచారం చేస్తున్నారు. గట్టిగా కౌంటర్లు ఇస్తే.. ఇప్పుడు తోకముడిచారు. నంద్యాలలో ఓ వైసీపీ కార్యకర్తే వైఎస్ విగ్రహం తల తీసేశారు.. పోలీసులు నిమిషాల్లో పట్టుకున్నారు. వైసీపీ కార్యకర్తను గుర్తించకుంటే టీడీపీపై నెపం నెట్టేవారు. వివేకా హత్య అనేది ఓ కేస్ స్టడీ. చిన్నపామునైనా పెద్ద కర్రతో కొట్టాలి... లేకుంటే విషం చిమ్ముతుంది... దీన్ని ప్రతీ ఒక్కరూ నిరంతరం గుర్తు పెట్టుకోవాలి. గొడ్డలి పార్టీతో నిరంతరం అప్రమత్తంగా ఉండాలి.

నేను ఎన్నో పోరాటాలు చేశాను.. కానీ నీచులతో ఎప్పుడూ పోరాటాలు చేయలేదు. పార్టీ పెట్టినప్పటి నుంచి హిందూపురం, కుప్పం సహా ఇంకొన్ని నియోజకవర్గాల్లో టీడీపీ గెలుస్తూనే ఉంది... ఇలాంటి నియోజకవర్గాల సంఖ్య పెరగాలి. కొత్తగా ఎమ్మెల్యేలు అయిన వారు వన్ టైమ్ ఎమ్మెల్యేలుగా మిగిలిపోకూడదు... మళ్లీ మళ్లీ గెలవాలి. అభివృద్ధి, సుపరిపాలన ద్వారా ఓట్లు పడతాయి. ప్రజా ప్రతినిధుల వ్యవహార శైలి ద్వారా ఓట్లు పెరుగుతాయి.. తగ్గుతాయి. ప్రజల కోసం పని చేసినా నోరు అదుపులో పెట్టుకోకుంటే నష్టమే జరుగుతుంది. కార్యకర్త మొదలుకుని నాయకుడి వరకు ప్రతి ఒక్కరికీ క్యారెక్టర్, ట్రస్ట్ అనేది చాలా ముఖ్యం."అని టీడీపీ అధినేత చంద్రబాబు స్పష్టం చేశారు.

# పుష్కరాలకు అఖండ సిద్ధత

(మొదటి పేజీ తరువాయి)

ముఖ్యమంత్రి సమగ్రంగా చర్చించారు. గోదావరి పుష్కరాల కన్నా ముందే పోలవరం ప్రాజెక్టును పూర్తి చేసి జాతికి అంకితం చేస్తామని సమీక్షలో సీఎం వెల్లడించారు. దీంతో పోలవరం ప్రాజెక్టుకు కూడా సందర్శకులు వచ్చే అవకాశం ఉంటుందన్నారు. ధవళేశ్వరం నుంచి పోలవరం ప్రాజెక్టు వరకు రహదారిని అఖండ గోదావరిగా అభివృద్ధి చేయాలన్నారు. కేవలం పుష్కరాలను మాత్రమే దృష్టిలో పెట్టుకుని పనులు పరిమితం చేయకుండా, ఇప్పుడు చేసే అభివృద్ధి కార్యక్రమాలు, మౌలిక వసతుల కల్పన గోదావరి పరివాహక ప్రాంతానికి ఆస్తిగా మారాలన్నారు. పుష్కరాల నిర్వహణతో రాజమహేంద్రవరం మహా నగరంగా అభివృద్ధి చెందాలని సీఎం చెప్పారు.

**పుష్కరాలకు కేంద్ర సాయం కోరండి :** హైవే ట్రాఫిక్ మేనేజ్మెంట్, రైల్వే ట్రాఫిక్, గ్రామీణ ప్రాంతాల నుంచి వచ్చే వాహనాల రద్దీపైనా దృష్టి పెట్టాలని సీఎం చెప్పారు. భక్తుల సౌకర్యార్థం, ఎవరికీ ఎలాంటి గందరగోళం లేకుండా పుష్కర ఘాట్లకు నెంబరింగ్ ఇవ్వాలని అధికారులకు సూచించారు. జాతీయ, రాష్ట్ర రహదారుల అనుసంధానం, విశాఖ నుంచి విజయవాడ వరకూ రైలు సర్వీసులు పెంచడం జరగాలని సీఎం నిర్దేశించారు. ప్రత్యేక రైళ్ల గురించి అశ్వినీ వైష్ణవ్‌కు లేఖ రాయడంతో పాటు, గోదావరి పుష్కరాలకు కేంద్ర సాయాన్ని కోరాలన్నారు. పర్యాటకుల సౌకర్యం కోసం కుంభమేళా తరహాలో టెంట్ సిటీలను, హోం స్టేలు ఏర్పాటు చేసే అంశాన్ని పరిశీలించాలన్నారు. గోదావరి పుష్కరాలను అభివృద్ధికి అద్భుతమైన అవకాశంగా చూడాలన్నారు. ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ ఇటీవల పుష్కర పనుల పరిశీలనకు క్షేత్రస్థాయిలో పర్యటించిన సమయంలో చేసిన సూచనల్ని పరిగణనలోకి తీసుకోవాలని సీఎం స్పష్టం చేశారు.



**గోదావరి గట్టు బ్యూటిఫికేషన్ :** పోలవరం ప్రాజెక్టుకు ఇరువైపులా రహదారులు నిర్మించడంతో పాటు, గోదావరి గట్టు బ్యూటిఫికేషన్ చేయాలని సీఎం సూచించారు. రాజమహేంద్రవరంలోని వీరేశలింగం పంతులు ఇంటిని కూడా తీర్చిదిద్దాలని చెప్పారు. ప్రముఖ్య ఆధ్యాత్మిక గురువులు, పీఠాధిపతులు, రాజకీయవేత్తలు, సినిమా సెలబ్రిటీలను కూడా గోదావరి పుష్కరాలకు ఆహ్వానించాలన్నారు. జూన్ 24న యాక్షన్ ప్లాన్‌తో రావాలని, అప్పటి నుంచి పుష్కరాలకు కౌంట్ డౌన్ మొదలవుతుందని సీఎం చెప్పారు. ఏపీ స్పేస్ అప్లికేషన్ సెంటర్, ఆర్టీజీ, టీటీడీ సంయుక్తంగా రద్దీ నిర్వహణ ప్రక్రియను చేపట్టాలన్నారు. అఖండ గోదావరి పుష్కరాలు 2027 వెబ్‌సైట్‌ను ప్రారంభించాలని చెప్పారు. అలాగే గోదావరికి అఖండ హారతి, కృష్ణా నదికి పవిత్ర హారతి రెండూ నిరాటంకంగా జరగాలని సీఎం చంద్రబాబు అన్నారు.

**రూ.211 కోట్ల విలువైన 132 పనులకు అనుమతి :** పోలవరం, ఏలూరు, తూర్పుగోదావరి, పశ్చిమ గోదావరి, కోనసీమ, కాకినాడ మొత్తం 6 జిల్లాల్లో 525 ఘాట్లను పుష్కరాల కోసం సిద్ధం చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. ప్రస్తుతం ఉన్న 288 ఘాట్లతో సహా కొత్తగా 237 ఘాట్లను నిర్మించాలని ప్రతిపాదనలు అధికారులు సిద్ధం చేశారు. ప్రస్తుతం 4.5 కిలోమీటర్ల మేర పొడవైన పుష్కర ఘాట్లను 9.9 కిలోమీటర్ల మేర పెంచాలని నిర్ణయించారు. పోలవరం జిల్లా గుండాలలో మొదటి ఘాట్... కోనసీమ జిల్లా అంతర్వేది, బలుసుతిప్ప, కాకినాడలోని గోవాలంక, పశ్చిమగోదావరిలోని నర్సాపురంలో చివరి ఘాట్ నిర్మించ తలపెట్టారు. ఈసారి పుష్కరాల్లో పుణ్య స్నానాల కోసం 9.95 కోట్ల మంది భక్తులు వస్తారని అంచనా. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో 1991లో 1.2 కోట్ల మంది భక్తుల పుష్కర స్నానాలు చేయగా, 2003లో 5 కోట్ల మంది, 2015లో నవ్యాంధ్ర ప్రదేశ్‌లో 4.86 కోట్ల మంది భక్తుల పుష్కర స్నానాలు చేశారు. గత పుష్కరాల్లో ఒక్క రోజులో అత్యధికంగా 58.26 లక్షల మంది భక్తుల పుష్కర స్నానం చేయగా, ఈసారి ఒక్కరోజులో 1 కోటి మంది పుణ్య స్నానాలు ఆచరిస్తారని అంచనా వేస్తున్నారు. ఇప్పటికే రూ. 211.97 కోట్లకు సంబంధించి 132 పనులకు ప్రభుత్వం అనుమతులు మంజూరు చేసింది. సమీక్షకు మంత్రులు ఆనం రామనారాయణ రెడ్డి, పయ్యావుల కేశవ్, పి.నారాయణ, అనిత, అనగాని సత్యప్రసాద్, గొట్టిపాటి రవికుమార్, బీసీ జనార్ధన్ రెడ్డి, సత్యకుమార్ యాదవ్, నిమ్మల రామానాయుడు, మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి, వాసంశెట్టి సుభాష్, సీఎస్ జి.సాయి ప్రసాద్, డీజీపీ హరీష్ కుమార్ గుప్తా, దేవదాయ, వైద్యారోగ్యం, రవాణా, పర్యాటక, పురపాలక, పంచాయితీరాజ్, ఆర్థిక, జలవనరులు, పోలీసు శాఖల ఉన్నతాధికారులు హాజరయ్యారు.

## డిజిటల్ ఎకానమీకి ఏపీ కీలక గమ్యం



(మొదటి పేజీ తరువాయి)

రాబిన్ ఖుదాతో సమావేశమైనట్లు సీఎం చంద్రబాబు తెలిపారు. Choose Speed Choose AP నినాదంతో పెట్టుబడుల ఆకర్షణకు ప్రభుత్వం చర్యలు చేపట్టిందని ఆయనకు వివరించినట్లు తెలిపారు.

విశాఖపట్నంలో 2 గిగావాట్ల హైపర్‌స్కేల్ డేటా సెంటర్ క్యాంపస్ ఏర్పాటుపై రాబిన్ ఖుదాతో సంప్రదింపులు జరిపినట్లు సీఎం చంద్రబాబు చెప్పారు. ఏఐ, క్లౌడ్, నెక్స్ట్ జనరేషన్ టెక్నాలజీలకు విశాఖ కేంద్రంగా మారనుందన్నారు. ప్రపంచ స్థాయి డిజిటల్ ఎకోసిస్టమ్ నిర్మాణమే లక్ష్యమని సీఎం చంద్రబాబు వివరించారు. క్లీన్ ఎనర్జీ, కనెక్టివిటీ, నైపుణ్య యువతతో ఏపీకి ప్రత్యేక గుర్తింపు వచ్చిందన్నారు. డిజిటల్ మౌలిక వసతుల అభివృద్ధిపై విస్తృత స్థాయిలో చర్చలు జరిగాయని సీఎం చంద్రబాబు వివరించారు.

యువతకు ఉపాధి అవకాశాల సృష్టిపై ప్రత్యేక దృష్టి సారించినట్లు రాబిన్ ఖుదాకు సీఎం చంద్రబాబు తెలిపారు. స్కిల్ డెవలప్‌మెంట్‌లో భాగస్వామ్య అవకాశాలపై సుదీర్ఘంగా చర్చించామన్నారు. పర్యావరణ హిత, సమగ్ర అభివృద్ధిపై దృష్టి సారించినట్లు చెప్పారు. అభివృద్ధి చెందుతున్న టెక్నాలజీతో ఆంధ్రప్రదేశ్‌ను అగ్రస్థానంలో నిలపాలని లక్ష్యంగా నిర్దేశించుకున్నట్లు రాబిన్ ఖుదాకు సీఎం చంద్రబాబు స్పష్టం చేశారు. భవిష్యత్ అవసరాలకు అనుగుణంగా డిజిటల్ ఆర్థిక వ్యవస్థ నిర్మాణంపై రాబిన్ ఖుదాతో చర్చించినట్లు సీఎం చంద్రబాబు తెలిపారు. ఈ మేరకు తన ఎక్స్ ఖాతా వేదికగా సీఎం చంద్రబాబు వివరించారు.

## తుంగభద్రకు నూతన కవచం

(మొదటి పేజీ తరువాయి)

ఈ నెలాఖరులో ఆంధ్రప్రదేశ్, కర్ణాటక రాష్ట్రాల ముఖ్యమంత్రులు తుంగభద్ర డ్యాం కొత్త గేట్లను ప్రారంభించనున్నట్లు వెల్లడించారు.

తుంగభద్ర ప్రాజెక్టు ద్వారా ఆంధ్రప్రదేశ్‌లో సుమారు 7.20 లక్షల ఎకరాల ఆయకట్టుకు సాగునీరు అందుతోందని మంత్రి నిమ్మల రామానాయుడు తెలిపారు.

# ఇళ్లు, ఇళ్ల స్థలాల క్రమబద్ధీకరణకు గ్రీన్ సిగ్నల్!

**అమరావతి(జర్నలిస్ట్ ఫైల్) :** జిల్లాల్లో సుదీర్ఘకాలంగా పెండింగులో ఉన్న ఇళ్లు, ఇళ్ల స్థలాల క్రమబద్ధీకరణకు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు గ్రీన్ సిగ్నల్ ఇచ్చారు. జిల్లా స్థాయిలో ఎంత వరకు చేయగలరో చేయాలని... జిల్లా స్థాయిలో క్రమబద్ధీకరణ కుదరన పక్షంలో కెబినెట్‌కు తీసుకు రావాలని సీఎం ఆదేశించారు. ఈ మేరకు జిల్లా కలెక్టర్ల నుంచి సమాచారాన్ని తీసుకోవాలని సూచించారు. మంగళవారం ఆర్టీజీ సెంటర్ నుంచి వివిధ శాఖల పనితీరుపై సీఎం చంద్రబాబు సమీక్షించారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి మట్లాడుతూ..."రాష్ట్రంలో వివిధ జిల్లాల్లో ఇళ్లు, ఇళ్ల స్థలాల క్రమబద్ధీకరణ సమస్య చాలా కాలంగా పెండింగులో ఉంది. ఏదో ఒక రకమైన సాకు చూపి వాటిని పెండింగులో పెట్టేస్తున్నారు. దీనికి ఫుల్ స్టాప్ పెట్టాలి. ప్రతీ జిల్లాలో క్రమబద్ధీకరించాల్సిన ఇళ్లు, ఇళ్ల స్థలాల జాబితాను సిద్ధం చేయాలి. ఈ మేరకు జిల్లా కలెక్టర్ల నుంచి సమాచారాన్ని తీసుకోండి. క్రమబద్ధీకరణకు సంబంధించి జిల్లాల స్థాయిలో ఎంత వరకు చేయగలిగితే... ఆ మేరకు చేసేయాలి. అక్కడ సమస్య పరిష్కారం కాకుంటే... కేబినెట్లో పెట్టి వాటి క్రమబద్ధీకరణకు నిర్ణయం తీసుకుంటాం. ఎటువంటి వివాదాల్లేకుండా క్రమబద్ధీకరించ దగ్గ స్థలాలను ప్రతీ కేబినెట్టుకు తీసుకురావాలి. అప్పటికీ పూర్తి కానివి ఏమైనా ఉంటే... ఆ సమస్యను ఏ విధంగా పరిష్కారించాలో ఆలోచన చేద్దాం. ఇక గృహ నిర్మాణ శాఖలో పెండింగులో ఉన్న బిల్లుల చెల్లింపు ప్రక్రియను కూడా మొదలు పెట్టాలి.



ఈ మేరకు గృహ నిర్మాణం-ఆర్థిక శాఖలు సమన్వయం చేసుకోవాలి."అని సీఎం చంద్రబాబు ఆదేశించారు.

**రాజవొమ్మంగి సీడీపీఓ ఆత్మహత్య కారకులపై కఠిన చర్యలు :** "ఇసుక అక్రమాలు అస్సలు జరగడానికి వీల్లేదు. ఏపీలో తవ్విన ఇసుక ఇతర రాష్ట్రాలకు వెళ్లకూడదు. రాష్ట్రాల సరిహద్దులు దాటిన వాహనాలను సీజ్ చేయండి.. ఈ విషయంలో కఠినంగా ఉండండి. ఇసుక లారీలను ట్రాకింగ్ పెట్టాలి. ఈ మేరకు టెక్నాలజీని పూర్తి స్థాయిలో వినియోగించుకోవాలి. ఇసుక అక్రమంగా వేరే ప్రాంతాలకు వెళ్తే... వెంటనే అలెర్ట్ మెసేజెస్ వచ్చేలా మెకానిజం ఉండాలి. ఇప్పటికే 50 వేల వాహనాలకు జీపీఎస్ పెట్టి ట్రాకింగ్ చేస్తున్నాం.. అక్రమాలు జరగడానికి వీల్లేదు. ఈ మేరకు మైనింగ్-పోలీసులు కో-ఆర్డినేట్ చేసుకోవాలి. ప్రభుత్వం అందించే వివిధ సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను ప్రజల్లోకి బలంగా తీసుకెళ్లాలి. ప్రభుత్వం అందించే ప్రతీ పథకం, అమలు చేస్తున్న ప్రతి కార్యక్రమం పట్ల ప్రజలకు అవగాహన కలిగితే.. ప్రభుత్వం అందించే సేవలకు సార్థకత లభిస్తుంది. ప్రజల్లోకి వెళ్లాలని... ప్రజలకు వివరించాలని చెప్పేది ప్రచారం కోసం కాదు... ప్రజలకు అవగాహన కల్పించడానికే అనేది ప్రతి ఒక్కరూ అర్థం చేసుకోవాలి. ప్రభుత్వ సేవల పట్ల అవగాహన కలిగితే... ప్రభుత్వం అందిస్తున్న సేవల పట్ల ప్రజల్లో సంతృప్తి పెరుగుతుంది. రాజవొమ్మంగి సీడీపీఓ ఆత్మహత్య ఘటనకు కారకులైన వారిపై కఠిన చర్యలు తీసుకోండి. వర్క్ ప్లేసులో వేధింపులు ఉండకూడదు. క్షేత్రస్థాయిలో జరుగుతున్న పరిణామాలను ఎప్పటికప్పుడు విశ్లేషించుకోవాలి. సమస్యలు ఉత్పన్నం అయ్యాక చర్యలు తీసుకోవడం కాదు... సమస్యలు ఉత్పన్నం కాకుండా చర్యలు తీసుకోవాలి."అని ముఖ్యమంత్రి స్పష్టం చేశారు. ఈ సమీక్షలో మంత్రి పార్థసారధి, సీఎస్ సాయి ప్రసాద్, వివిధ శాఖల ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

# తెలంగాణలోనూ జనసేన పోటీ



(మొదటి పేజీ తరువాయి)


**పీక కోసినా.. :** ఆంధ్రప్రదేశ్‌లోనే కాదు.. ఇక్కడ ఏమైనా చేస్తే తాను సీఎం అయిపోతానా? అని పవన్ కల్యాణ్ ప్రశ్నించారు. తెలంగాణను తానెప్పుడు అవమానించాను? అని ఆయన స్థానిక నేతలను ప్రశ్నించారు. తన పీక కోసినా కూడా భయపడేది లేదన్నారు. తనకు రెచ్చగొట్టడం ఇష్టం లేదని తెలిపారు. తనను ఎన్ని తిట్టినా పట్టించుకోనన్నారు.

**ఇంకెంతకాలం.. :** తెలంగాణలో ఉపాధి లేకపోతే తాను కారణమా? అని రాజకీయ పార్టీల నాయకులను ఆయన సూటిగా నిలదీశారు. మద్రాస్‌లో ఉన్న చిత్రపరిశ్రమ ఇక్కడికి ఎలా వచ్చిందన్నారు. ఆంధ్రా వాళ్లను తిడుతుంటే వాళ్లు ఇక్కడెలా ఉంటారన్నారు. ఇంకెంతకాలం ఆంధ్రావాళ్లను తిడుతూ కాలక్షేపం చేస్తారంటూ తెలంగాణలోని నాయకులకు ఆయన సూటిగా ప్రశ్నించారు. సడెన్‌గా ఇక్కడికి రావొద్దంటే ఎలా అని ఆయన ప్రశ్నించారు. తెలంగాణలో ఏపీ కాంట్రాక్టర్లు బాగానే ఉన్నారన్నారు.

**ప్రభుత్వానికే రాసిస్తా.. :** తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిపై తనకు గౌరవం ఉందన్నారు. తాను చెరువును కబ్జా చేశానని కొందరు అంటున్నారని.. అలా చేస్తే తనను ఇక్కడ ఉండనిస్తారా? అని ఆయన సూటిగా నిలదీశారు. తన ఫామ్‌హౌస్ కబ్జా అని తేలిస్తే.. దానిని రాష్ట్ర ప్రభుత్వానికే రాసిస్తానన్నారు. గద్దర్‌తో తనకు చాలా సాన్నిహిత్యం ఉందని గుర్తు చేసుకున్నారు. రాజకీయాల్లోకి రాకముందే తనకు గద్దర్ తెలుసునన్నారు.

**మీరంతా ఎక్కడున్నారు? :** గద్దర్ ఒంట్లో బుల్లెట్లు దిగినప్పుడు ఎందుకు మాట్లాడలేదని రాజకీయ పార్టీల నేతలను పవన్ కల్యాణ్ సూటిగా ప్రశ్నించారు. గద్దర్ తమ పార్టీ కార్యాలయానికి వచ్చేవారని గుర్తు చేశారు. గద్దర్ బతికున్నప్పుడు మీరంతా ఎక్కడున్నారు? అంటూ తనను ప్రశ్నిస్తున్న నేతలకు ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ చురకలంటించారు.

# 'పవర్ ఆఫ్ సైకిల్' చాటుదాం



(మొదటి పేజీ తరువాయి)

టీడీపీ ప్రధాన పార్టీగా ఉన్నందున పూర్తి అప్రమత్తంగా ఉండాలని తెలిపారు. 'సర్'పై తెలుగుదేశం పార్టీ ఎమ్మెల్యేలకు చంద్రబాబు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. శిక్షణ తరగతులకు హాజరుకాని నేతలపై ఆగ్రహం వ్యక్తం చేశారు.

పవర్ ఆఫ్ సైకిల్: "రాష్ట్రంలో 2002 తర్వాత ఓటర్ల జాబితా సవరణ జరుగుతోంది. మన ఓట్లు తీసేసి వాళ్ల ఓట్లు పెట్టేలా కుట్రలకు గొడ్డలి పార్టీ వెనుకాడదు. 'సర్' సమయంలో ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలి. మాకేం సంబంధం లేదన్నట్లుగా ఎంపీలు ఉంటే సరికాదు. జులై 14 లోపు ఓట్లు ఉండేలా చూసుకోకపోతే ఇబ్బందులు ఎదురవుతాయి. పార్టీ ఉంటేనే ప్రభుత్వం వస్తుందనే బాధ్యతతో ప్రతి ఒక్కరూ పని చేయాలి. పవర్ ఆఫ్ సైకిల్ చాటేందుకు నెలలో కొన్ని రోజులు సైకిల్‌పై వెళ్తా. సైకిల్ పవర్ చూపించేందుకు ప్రతి ఒక్కరూ ఎలక్ట్రిక్ సైకిల్ వాడండి. దీని వల్ల ఖర్చు సున్నా, ఆరోగ్యానికి ఆరోగ్యం. ఎలక్ట్రిక్ సైకిల్‌పై వీలైనన్ని ఎక్కువ ఇళ్లకు తిరుగుదాం. ఈ నెల 4న ఎన్డీయే సమావేశం తర్వాత భవిష్యత్ కార్యాచరణ చేపడతాం. 2024లో కూటమికి వచ్చిన ఓట్ల కంటే వచ్చే ఎన్నికల్లో పెరగాలి. ప్రతి బుధవారం పార్టీ క్యాలెండర్ తప్పనిసరిగా అమలు కావాలి" అని సీఎం చంద్రబాబు దిశానిర్దేశం చేశారు.

# ఎల్‌వోసీ చెక్కు పంపిణీ



**మంగళగిరి (జర్నలిస్ట్ ఫైల్) :** మంగళగిరి మండలం పెదవడ్లపూడి గ్రామానికి చెందిన కాపారపు వీరరాఘవులకు రూ. 2,01,460 విలువైన ఎల్‌వోసీ (లెటర్ ఆఫ్ క్రెడిట్) చెక్కును మంత్రి నారా లోకేష్ చొరవతో మంజూరు చేయగా, మంగళగిరి వ్యవసాయ మార్కెట్ యార్డ్ చైర్మన్ జవ్వాది కిరణ్ చంద్ మంగళవారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా జవ్వాది కిరణ్ చంద్ మాట్లాడుతూ, అర్హులైన ప్రతి పేద కుటుంబానికి ప్రభుత్వ సంక్షేమ పథకాల ప్రయోజనాలు అందేలా మంత్రి నారా లోకేష్ నిరంతరం కృషి చేస్తున్నారని తెలిపారు. ఎల్‌వోసీ చెక్కు అందుకున్న లబ్ధిదారుడు కాపారపు వీరరాఘవులు తనకు ఆర్థిక సహాయం అందేలా చొరవ తీసుకున్న మంత్రి నారా లోకేష్‌కు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు మాదల రమేష్ బాబు, యేళ్ళ శివరామయ్య, జాలాది సందీప్, ఉల్లంగి శ్రీనివాసరావు, కొండపల్లి కిషోర్, కాపారపు మురళి, తదితరులు పాల్గొన్నారు.

# రీ సర్వే లో ప్రభుత్వ దారులను గుర్తించి హద్దులు చూపాలి



- **బిజెపి అధ్యక్షులు చంద్ర ఓబుల్ రెడ్డి**

**బ్రహ్మంగారిమఠం(జర్నలిస్ట్ ఫైల్ ):** బ్రహ్మంగారి మఠం మండలంలో జరుగు రీ సర్వేలో బ్రిటీష్ కాలం నాడు ప్రభుత్వం ఏర్పాటు చేసిన రహదారులను గుర్తించి హద్దులు ఏర్పాటు చేయాలని బ్రహ్మంగారి మఠం మండల బిజెపి అధ్యక్షులు చంద్ర ఓబుల్ రెడ్డి ప్రభుత్వ అధికారులను కోరారు. ఈ సందర్భముగా ఆయన మాట్లాడుతూ మండల కేంద్రమైన కందిమల్లాయపల్లె గ్రామం నుండి వీరబ్రహ్మేంద్ర నగర్ మీదుగా నరసన్నపల్లె గ్రామం గంగిరెడ్డిపల్లి గ్రామం వరకు ఉన్న రాజబాటకు (దారి) సంబంధించిన సర్వే నంబర్ల కు చెందిన విస్తీర్ణానికి హద్దులు గుర్తించి రాకపోకలకు అంతరాయం లేకుండా చర్యలు తీసుకోవాలని ఆయన తెలిపారు. అంతే కాకుండా రాబోవు కాలంలో జరిగే అభివృద్ధి పనులకు ఈ రహదారి చాలా కీలకమవుతుందని, అధికారులకు ఎన్నో మార్లు వినతి పత్రాల ద్వారా విన్నవించిన కిందిస్థాయి సిబ్బంది సహకరించడం లేదని ఆయన తెలిపారు. పిజిఆర్ఎస్ నందు అర్జీ సమర్పించిన దరఖాస్తు దారునికి తెలియకుండానే పరిష్కారం చేస్తున్నట్లుగానే పరిష్కారం ఎండార్స్మెంట్ ఇస్తూ ఆశ్చర్యానికి గురి చేస్తున్నారని ఆయన అధికారులపై మండిపడ్డారు.

బ్రహ్మంగారిమఠం మండలం సోమిరెడ్డిపల్లి గ్రామ రెవెన్యూ పొలం సర్వే నంబర్లు వరుసగా 16,262,249,208,206,338,325,300 (327 సర్వే నంబర్లు సబ్ డివిజన్) పై నెంబర్లలో కందిమల్లయపల్లి గ్రామంలో నుండి నరసనపల్లి మీదుగా గంగిరెడ్డి పల్లె గ్రామం వరకు పూర్వీకులు రాకపోకలు కొనసాగించేవారని, పై నంబర్ల గుండా రహదారి వేస్తే, జనాభా పెరుగుతున్న ఈ తరుణంలో రాబోయే రోజుల్లో ప్రజలకు ఎటువంటి ఇబ్బందులు కలగవని ఆయన తెలిపారు.

# తెలంగాణలో అవినీతి కాంగ్రెస్ పాలనకు చరమగీతం పాడాలి: నితిన్ నబీన్



**తెలంగాణ (జర్నలిస్ట్ ఫైల్) :** వచ్చే ఎన్నికల్లో తమ పార్టీ కచ్చితంగా అధికారంలోకి వస్తుందని బీజేపీ జాతీయ అధ్యక్షుడు నితిన్ నబీన్ ధీమా వ్యక్తం చేశారు. తెలంగాణ ప్రజలు రానున్న ఎన్నికల్లో బీజేపీకి సంపూర్ణ మద్దతు అందిస్తారని ఆశాభావం వ్యక్తం చేశారు. తెలంగాణ ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకుని మంగళవారం న్యూఢిల్లీలోని తెలంగాణ భవన్ లోని అంబేద్కర్ ఆడిటోరియంలో ఘనంగా వేడుకలు నిర్వహించారు. తెలంగాణ రెసిడెంట్స్ ఆఫ్ ఢిల్లీ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమానికి బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రాంచందర్ రావు అధ్యక్షత వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన నితిన్ నబీన్ మాట్లాడుతూ, చిన్న రాష్ట్రాల ఏర్పాటుకు బీజేపీ ఎప్పటి నుంచో మద్దతుదారుగా ఉందన్నారు.

మాజీ ప్రధాని అటల్ బిహారీ వాజ్‌పేయి నాయకత్వంలో ఛత్తీస్‌గఢ్, ఉత్తరాఖండ్ రాష్ట్రాలు ఏర్పాటయ్యాయని గుర్తు చేశారు. తెలంగాణ రాష్ట్ర సాధనలో మాజీ కేంద్ర మంత్రి సుష్మా స్వరాజ్ పార్లమెంట్‌లో అందించిన సంపూర్ణ మద్దతు చారిత్రాత్మకమని పేర్కొన్నారు. తెలంగాణ కోసం ఎన్నో పోరాటాలు చేసి రాష్ట్రాన్ని సాధించుకున్నారని, ఆ పోరాటంలో అసువులు బాసిన అమరవీరులకు శిరస్సు వంచి నమస్కారం చేస్తున్నాను. వారు కలలు కన్న తెలంగాణను నిర్మించుకోవడంలో ప్రస్తుతం కాస్త వెనుకబడ్డామని, భవిష్యత్తులో తెలంగాణ అభివృద్ధి కోసం, అమరవీరులు కలలు కన్న తెలంగాణను నిర్మించుకునేందుకు బీజేపీ పోరాటం చేస్తుందన్నారు.

2009 డిసెంబర్ 9న కేంద్ర ప్రభుత్వం తెలంగాణ ఏర్పాటు చేస్తామని ప్రకటించి మోసం చేసిన విషయం అందరికీ గుర్తుంటుందని, దీంతో తెలంగాణలోని అనేక మంది యువతీ యువకులు తమ ప్రాణత్యాగాలు చేశారని ఆవేదన వ్యక్తం చేశారు. గత 12 సంవత్సరాలుగా ప్రధాని మోడీ నేతృత్వంలో తెలంగాణ అభివృద్ధి కోసం వికసిత భారత్ లో తెలంగాణను భాగస్వామ్యం చేసేందుకు ఎంతో కృషి చేస్తున్నాం. 31 లక్షల మంది తెలంగాణ రైతులకు పీఎం కిసాన్ యోజన నిధులు, 75 లక్షలకు పైగా లబ్ధిదారులకు ముద్ర యోజన రుణాలు, 1.27 కోట్ల జనధన్ ఖాతాలు, ఆయుష్మాన్ కార్డులను అందజేశాం. రైల్వే, రోడ్డు ప్రాజెక్టులను భారీగా తెలంగాణకు మంజూరు చేశాం. బీబీనగర్ లో ఎయిమ్స్ వంటి ప్రతిష్టాత్మక సంస్థను ఇచ్చామన్నారు.

**తెలంగాణ అవినీతి పాలనకు చరమగీతం పాడాలి:** 2047 నాటికి వికసిత భారత్ సాధించాలన్న లక్ష్యంతో తెలంగాణ ప్రజలకు అభివృద్ధి ఫలాలను అందజేస్తామని, రాష్ట్రంలో అవినీతి పాలనకు చరమగీతం పాడి తెలంగాణ అమరవీరులు కలలు కన్న తెలంగాణను పునర్మించుకోవాల్సిన అవసరం ఉంది. తెలంగాణను కొందరు ఏటీఎం లాగా మార్చుకుని, కాంగ్రెస్ జేబులు నింపుతున్నారు. దీనిని ఆపేందుకు భవిష్యత్తులో బీజేపీ కార్యకర్తలంతా కలసి పోరాడుతామన్నారు. హైదరాబాద్ రాష్ట్రాన్ని నిజాం చెర నుంచి విడిపించిన ఉక్కుమనిషి సర్దార్ వల్లభాయ్ పటేల్ ను మనమంతా గుర్తు చేసుకోవాల్సిన అవసరం ఉంది. ఆయన స్వాతంత్ర్యం అనంతరం ఏక్ భారత్ శ్రేష్ట్ భారత్ కోసం ఆయన చేసిన కృషి మరువలేనిది. ఆయన అడుగు జాడల్లోనే మోడీ అన్ని రాష్ట్రాలను సమానంగా చూస్తూ వాటి అభివృద్ధికి పాటుపడుతున్నారని గుర్తు చేశారు.

**తెలంగాణ కాంగ్రెస్ఇవ్వలేదు, ప్రజలు ఉద్యమించి సాధించారు : కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి**

స్వరాష్ట్ర తీసుకొచ్చింది కాంగ్రెస్ పార్టీ కానే కాదని ప్రజలంతా ఆ పార్టీ నేతల మెడలు వంచి తెచ్చుకున్నారని కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి చెప్పుకొచ్చారు. బీజేపీ ఎప్పుడు కూడా ఒకే మాట, ఒకే బాట ఒకే నినాదం, ఒకే లక్ష్యంతో తెలంగాణ కోసం పోరాడింది. ఇప్పుడు కూడా తెలంగాణ అభివృద్ధి కోసం పాటుపడుతున్నామని, కాంగ్రెస్ పార్టీ లాగా పది మాటలు మాట్లాడే వాళ్లం కాదని, అలాంటి కాంగ్రెస్ పార్టీ తెలంగాణ గురించి మాట్లాడే అర్హత లేదన్నారు. కేసీఆర్ సీఎంగా ఉన్నప్పుడు బంగారు తెలంగాణ అని చెప్పి.. బంగారు కుటుంబాన్ని పెంచి పోషించారు. తీవ్ర అవినీతి, అహంకారంతో కుటుంబ సభ్యులందరికీ దోచి పెట్టారు. రేవంత్ రెడ్డి ప్రభుత్వం వచ్చాక కూడా తెలంగాణలో ఎలాంటి మార్పు లేదు. అదే విధంగా అవినీతి, అక్రమాలు చేస్తూ తెలంగాణ ప్రభుత్వాన్ని రియల్ ఎస్టేట్ కు అడ్డాగా మార్చారు.

తెలంగాణ నుంచి వందల కోట్లను రేవంత్ రెడ్డి తీసుకెళ్లి కాంగ్రెస్ అధిష్టానానికి ముట్టజెప్తున్నారు. అందుకే తెలంగాణకు ముఖ్యమంత్రి అయ్యారని ఎద్దేవా చేశారు. ఒకప్పుడు మిగులు రాష్ట్రంగా ఉన్న తెలంగాణను బీఆర్ఎస్, కాంగ్రెస్ పార్టీలు దివాళా దిశగా తీసుకెళ్లారు. రిటైర్అయిన వారికి కనీసం బెనెఫిట్స్ ఇవ్వకుండా ఇబ్బందులు పెడుతున్నారు. ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా తెలంగాణలో అభివృద్ధి జరగాలంటే బీజేపీతో సాధ్యమన్నారు. తెలంగాణ ఉద్యమ చరిత్ర, బీజేపీ నేతల భాగస్వామ్యం పై ఏర్పాటు చేసిన ఎగ్జిబిషన్ లో బీజేపీ జాతీయ అధ్యక్షుడు నితిన్ నబిన్‌కు , బీజేపీ తెలంగాణ అధ్యక్షుడు ఎన్.రామచందర్ రావుతో కలిసి కేంద్ర మంత్రి జి.కిషన్ రెడ్డి వివరించారు. తెలంగాణ ఉత్పత్తులతో ఏర్పాటు చేసిన వివిధ స్టాళ్లను తిలకించారు.

**తెలంగాణ ఏర్పాటులో సుష్మా స్వరాజ్ పాత్ర మరువలేనిది : బీజేపీ అధ్యక్షులు రాంచందర్‌రావు**

తెలంగాణ రాష్ట్రం ప్రజాస్వామ్య మరియు పార్లమెంటరీ ప్రక్రియ ద్వారానే సిద్ధించిందని, ఈ ప్రక్రియలో బీజేపీ పోషించిన కీలక పాత్ర వహించిందన్నారు. పార్లమెంట్‌లో తెలంగాణ రాష్ట్ర డిమాండ్‌కు బేషరతుగా, అచంచలంగా మద్దతు పలికిన అప్పటి లోక్‌సభ ప్రతిపక్ష నేత సుష్మా స్వరాజ్ తెలంగాణ ప్రజలు ఎప్పటికి మరువలేని పేర్కొన్నారు. పార్లమెంట్‌లో తెలంగాణ కోసం బలంగా నిలబడకపోతే, తెలంగాణ గొంతు అంత శక్తివంతంగా వినిపించేది కాదు. తెలంగాణ ప్రజలు ఆమె చేసిన సహకారాన్ని ఎల్లప్పుడూ కృతజ్ఞతతో గుర్తుంచుకుంటారని కొనియాడారు.

ప్రత్యేక రాష్ట్రం సిద్ధించిన ఇప్పుడు మన ప్రయాణం మరింత అభివృద్ధి, ప్రగతి వైపు సాగాలని పిలుపునిచ్చారు. ప్రధాని మోడీ నాయకత్వంలోని కేంద్ర ప్రభుత్వం తెలంగాణ అభివృద్ధికి పూర్తిగా కట్టుబడి ఉందని స్పష్టం చేశారు. వికసిత్ భారత్' అనే బృహత్ సంకల్పంలో భాగంగా మనమంతా కలిసికట్టుగా 'వికసిత్ తెలంగాణ' లక్ష్యం కోసం కృషి చేయాలని సూచించారు. రెండు రాష్ట్రాలు పరస్పర స్నేహంతో, ఆరోగ్యకరమైన అభివృద్ధి పోటీతో ముందుకు సాగాలని అభిప్రాయపడ్డారు. తెలుగు ప్రజలమైన మనకు రెండు రాష్ట్రాలు ఉన్నాయి. మన మధ్య ఎటువంటి ద్వేషాలు, విభేదాలు ఉండకూడదు.. కేవలం అభివృద్ధిలో మాత్రమే ఆరోగ్యకరమైన పోటీ ఉండాలి.

రెండు రాష్ట్రాల ప్రజల ఆకాంక్షలను నెరవేర్చేలా పరస్పర స్నేహం, సంపూర్ణ సహకారం ఉంటేనే ఉభయ రాష్ట్రాలు ప్రగతి పథంలో ముందుకు దూసుకుపోగలవు. వికసిత్ తెలంగాణ', వికసిత్ ఆంధ్రప్రదేశ్' లు కలిసికట్టుగా అడుగులు వేసినప్పుడే వికసిత్ భారత్ స్వప్నం సాకారమవుతుందని స్పష్టం చేశారు. ఈ సందర్భంగా పెరిక సురేష్ మాట్లాడుతూ, రాష్ట్ర ఆవిర్భావం అనంతరం న్యూఢిల్లీలో ఇంత భారీ స్థాయిలో తెలంగాణ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు నిర్వహించడం ఆనందదాయకమన్నారు. అనంతరం నితిన్ నబీన్‌ను నిర్వాహకులు ఘనంగా సత్కరించారు. తెలంగాణ సంస్కృతి, చరిత్ర, రాష్ట్ర సాధనలో ప్రముఖుల పాత్రను స్మరించుకుంటూ నిర్వహించిన ఈ వేడుకలు ఢిల్లీలోని తెలంగాణ వాసుల్లో ప్రత్యేక ఉత్సాహాన్ని నింపాయి.

# పదలో కొండంత అండ.. అభాగ్యుల పాలిట 'సంజీవని'!

- **కష్టమంటే 'నేనున్నా'నంటూ కదిలొచ్చే జననేత.. పేదల పాలిట పెన్నిధి రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు**
- **పేదల కళ్లలో ఆనందం నింపుతున్న ముఖ్యమంత్రి చంద్రబాబు దార్శనికత**
- **బాధితుల పాలిట ఆపద్బాంధవుడిగా రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు చొరవ**
- **టెక్కలి నియోజకవర్గంలో 23 నెలల్లో 322 మందికి రూ. 3.15 కోట్ల సీఎంఆర్ఎఫ్ సాయం**



**నిమ్మాడ (జర్నలిస్ట్ ఫైల్):** అనుకోని అనారోగ్యం.. ఆసుపత్రి పాలైతే లక్షల్లో ఖర్చు.. అప్పు చేసి ప్రాణాలు నిలబెట్టుకున్నా, ఆ అప్పుల ఊబిలోంచి ఎలా బయటపడాలో తెలియని అయోమయం. ఇలాంటి దీనస్థితిలో ఉన్న ఎన్నో పేద కుటుంబాలకు ముఖ్యమంత్రి సహాయనిధి (సీఎంఆర్ఎఫ్) కొండంత అండగా మారుతోంది. ఆపదలో ఉన్నవారికి "మేమున్నాం" అంటూ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అందిస్తున్న భరోసా అభాగ్యుల పాలిట సంజీవనిలా పనిచేస్తోంది. అప్పుల బాధతో కుంగిపోతున్న కుటుంబాల్లో ఈ సాయం సరికొత్త మానవీయ వెలుగులు ప్రసరిస్తోంది.

టెక్కలి నియోజకవర్గం పరిధిలోని నందిగాం, టెక్కలి, సంతబొమ్మాళి, కోటబొమ్మాళి మండలాల ప్రజలతో పాటు.. ఇతర నియోజకవర్గాల నుంచి ముఖ్యమంత్రి సహాయనిధి కోసం ఆశ్రయించిన వారికి సైతం రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు గారు సాయం అందిస్తూ తన మానవత్వాన్ని చాటుకుంటున్నారు.

**అహర్నిశలు శ్రమిస్తున్న రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు :** ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు గారి మార్గదర్శకత్వంలో, మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు పేదల పాలిట ఆత్మీయుడిగా నిలుస్తున్నారు. కష్టం అని వచ్చిన వారికి 24 గంటలూ తన కార్యాలయ సిబ్బందిని అందుబాటులో ఉంచుతూ, బాధితుల గుండె ఘోషను వింటున్నారు. గత ప్రభుత్వ పాలనలో లాగా కాళ్లరిగేలా ఆఫీసుల చుట్టూ తిరిగే అవసరం లేకుండా, దళారుల ప్రమేయమే లేకుండా నేరుగా లబ్ధిదారులకు సాయం అందేలా ఆయన తీసుకుంటున్న ప్రత్యేక చొరవ సర్వత్రా ప్రశంసలు అందుకుంటోంది. అవసరమైతే స్వయంగా ఆయనే కార్పొరేట్ ఆసుపత్రుల యాజమాన్యాలతో మాట్లాడి, బాధితులకు మెరుగైన వైద్యం అందేలా చూస్తుండటం మంత్రిలోని మానవీయ కోణానికి అద్దం పడుతోంది. ఎప్పటికప్పుడు విజయవాడకు సమాచారం చేరవేస్తూ, చెక్కుల మంజూరులో ఎలాంటి జాప్యం లేకుండా ఆయన యంత్రాంగాన్ని పరుగులు పెట్టిస్తున్నారు.

**గణాంకాల్లో దాగిన కరుణ.. ఆకలి తీర్చే ఆత్మీయత :** గడిచిన 23 నెలల్లోనే ఏకంగా 322 మంది లబ్ధిదారులకు రూ. 3.15 కోట్ల ముఖ్యమంత్రి సహాయనిధి సాయం మంజూరైందంటే కూటమి ప్రభుత్వ చిత్తశుద్ధిని అర్థం చేసుకోవచ్చు. ఒక్క టెక్కలి నియోజకవర్గంలోనే రూ. 3.15 కోట్లకు పైగా సాయం అందించి, మంత్రి అచ్చెన్నాయుడు వందలాది కుటుంబాల్లో వెలుగులు నింపారు. సాయం కోసం సుదూర ప్రాంతాల నుంచి తన కార్యాలయానికి వచ్చే వారికి కేవలం భరోసా మాత్రమే ఇవ్వకుండా, నాణ్యమైన భోజనం పెట్టి ఆదరిస్తున్న అచ్చెన్నాయుడి పెద్ద మనసు అక్కడికి వచ్చేవారిని కంటతడి పెట్టిస్తోంది.

**ఆదర్శంగా నిమ్మాడ క్యాంప్ కార్యాలయ సిబ్బంది :** రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడి స్ఫూర్తితో నిమ్మాడ క్యాంప్ కార్యాలయ సిబ్బంది సైతం బాధితులకు విశేష సేవలు అందిస్తున్నారు. ముఖ్యమంత్రి సహాయ నిధి కోసం దరఖాస్తు చేసుకునేందుకు వచ్చే నిరుపేదలకు వారు ఆత్మీయంగా అండగా నిలుస్తున్నారు. దరఖాస్తుకు ఎలాంటి ధృవీకరణ పత్రాలు అవసరమో వారికి కూలంకషంగా, ఓపికగా వివరిస్తున్నారు.

సమర్పించిన దరఖాస్తు ఎక్కడా వెనక్కి రాకుండా, నూటికి నూరు శాతం మంజూరయ్యే విధంగా అత్యంత క్రమపద్ధతిలో ఫైళ్లను సిద్ధం చేసి విజయవాడకు పంపుతున్నారు. సిబ్బంది చూపుతున్న ఈ ప్రత్యేక చొరవ వల్ల ఎలాంటి వివరాలు తెలియని అమాయకులైన పేదలకు శ్రమ తప్పడమే కాకుండా, సాయం త్వరితగతిన అందుతోంది.

**కళ్లలో ఆనంద భాష్పాలు.. చెరగని కృతజ్ఞత :** తాజాగా సాయం అందుకున్న 322 మంది లబ్ధిదారుల ముఖాల్లో ఇప్పుడు చెప్పలేనంత ఆనందం కనిపిస్తోంది. "అప్పుల పాలై దిక్కుతోచని స్థితిలో ఉన్న మాకు ముఖ్యమంత్రి చంద్రబాబు గారు దేవుడిలా సాయం చేశారు. అచ్చెన్నాయుడు గారు మాకు ఎలాంటి ఇబ్బంది రాకుండా, వేగంగా చెక్కులు అందేలా చూశారు. ప్రాణాలు నిలబెట్టుకోవడానికి అప్పులు చేసిన మాకు, ఈ సాయం కొండంత అండ. ఈ మేలును ఎప్పటికీ మర్చిపోలేం" అంటూ వారు భావోద్వేగంతో కృతజ్ఞతలు తెలుపుతున్నారు. పేదల విద్య, వైద్యంపై కూటమి ప్రభుత్వం చూపుతున్న ఈ ప్రత్యేక శ్రద్ధ.. రాష్ట్రంలో సరికొత్త మానవీయ పాలనకు నాంది పలుకుతోంది.

# మూడు రోజుల పాటు కేరళంలో పర్యాటక శాఖ మంత్రి కందుల దుర్గేష్ పర్యటన



**అమరావతి (జర్నలిస్ట్ ఫైల్) :** ఆంధ్రప్రదేశ్ పర్యాటక రంగానికి జాతీయ స్థాయిలో అరుదైన గౌరవం దక్కింది. దక్షిణాదిలోనే అతి పెద్ద ట్రావెల్ అండ్ ట్రేడ్ ఎక్స్‌పో అయిన 'గ్లోబల్ ట్రావెల్ మార్కెట్' (2026) ఆంధ్రప్రదేశ్‌ను "బెస్ట్ టూరిజం ప్రమోషన్ స్టేట్" (ఉత్తమ పర్యాటక ప్రచార రాష్ట్రం) గా ఎంపిక చేసింది. ఈ నేపథ్యంలో కేరళలోని తిరువనంతపురంలో జరగనున్న 'జీటీఎం ఎక్స్ పో -2026'లో పాల్గొని, ప్రతిష్ఠాత్మకమైన 'మెట్రో ఎక్స్‌పెడిషన్ -- GTM టూరిజం అవార్డు 2026' ను స్వీకరించేందుకు రాష్ట్ర పర్యాటక, సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కందుల దుర్గేష్ మూడు రోజుల కేరళం పర్యటనకు బయలుదేరారు.

కేరళం పర్యటనలో భాగంగా జూన్ 3న తిరువనంతపురంలోని కోవాలం 'ఉదయ్ సముద్ర లీజర్ బీచ్ హోటల్ అండ్ స్పా'లో జరిగే జీటీఎం ఎక్స్‌పో -2026 ప్రారంభోత్సవంలో మంత్రి దుర్గేష్ పాల్గొంటారు. అనంతరం జూన్ 4న తిరువనంతపురం 'గోల్డెన్ ప్యాలెస్ కన్వెన్షన్ సెంటర్'లో జరిగే ఎక్స్ పో కార్యక్రమాలకు హాజరవుతారు. అదే రోజు సాయంత్రం 4 గంటలకు కోవాలంలోని 'లీలా తిరువనంతపురం రావిజ్ హోటల్'లో జరిగే జీటీఎం అవార్డ్స్-2026 వేడుకలో దేశవిదేశాల ప్రముఖుల సమక్షంలో ఏపీకి దక్కిన "బెస్ట్ టూరిజం ప్రమోషన్ స్టేట్" అవార్డును మంత్రి దుర్గేష్ అందుకోనున్నారు. ఆ తర్వాత జూన్ 5న తిరువనంతపురం నుండి ముంబయి పర్యటనకు బయలుదేరి వెళ్తారు.

**ఇది కూటమి ప్రభుత్వ దార్శనికతకు దక్కిన గౌరవం: మంత్రి కందుల దుర్గేష్**

ఈ సందర్భంగా మంత్రి కందుల దుర్గేష్ హర్షం వ్యక్తం చేస్తూ ఒక ప్రకటన విడుదల చేశారు. "ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ ల దిశానిర్దేశంలో, కేంద్ర ప్రభుత్వ సహకారంతో పర్యాటక శాఖ స్పెషల్ చీఫ్ సెక్రటరీ అజయ్ జైన్, ఎండీ ఆమ్రపాలి కాట, పర్యాటక శాఖ అధికారుల బృందం అంతర్జాతీయ స్థాయిలో చేసిన కృషికి దక్కిన అరుదైన గౌరవం ఇది. పర్యాటక రంగంలో మేం తీసుకొచ్చిన వినూత్న సంస్కరణలు, విప్లవాత్మక మార్పుల వల్లే ఈ రోజు జాతీయ స్థాయి ప్రశంసలు దక్కాయి" అన్నారు. ప్రధానంగా నూతన పర్యాటక పాలసీ 2024-29, పర్యాటక రంగానికి పారిశ్రామిక హోదా కల్పన, అనుబంధ పాలసీలు అదే విధంగా 'బ్రాండ్ ఏపీ' ప్రదర్శనతో సోషల్ మీడియా, అంతర్జాతీయ ప్లాట్‌ఫామ్స్‌పై ఏపీ పర్యాటక సౌందర్యాన్ని సరికొత్త శైలిలో బ్రాండింగ్ చేశామన్నారు. రాష్ట్రంలో టూరిజం యాక్టివిటీ పెంచేందుకు ఏడాది పొడవునా నిరంతరం ప్రతి జిల్లాలో పర్యాటక ఉత్సవాలు నిర్వహించామన్నారు. అంతేగాక సృజనాత్మక ఆలోచనలు, డిజిటల్ ప్రమోషన్స్ ద్వారా అంతర్జాతీయ పర్యాటకులను ఆకర్షించామన్నారు. కేరళంలో అందుకోబోయే ఈ జాతీయ అవార్డు ఏపీ పర్యాటక వైభవానికి ముగింపు కాదు.. ఇది ప్రపంచ స్థాయి విజయాలకు ఒక ఘనమైన ఆరంభం!" అని మంత్రి దుర్గేష్ స్పష్టం చేశారు. ప్రపంచవ్యాప్తంగా ఉన్న టూరిజం బోర్డులు, హాస్పిటాలిటీ బ్రాండ్‌లు, పరిశ్రమల ప్రతినిధులు పాల్గొనే ఈ ఎక్స్‌పో ద్వారా ఆంధ్రప్రదేశ్ పర్యాటక రంగానికి మరిన్ని పెట్టుబడులు, పర్యాటకులు వచ్చే అవకాశం ఉందని మంత్రి దుర్గేష్ ఆశాభావం వ్యక్తం చేశారు.

# రెండు తెలుగు రాష్ట్రాల విభజనకు 12 ఏళ్లు

- **వికసిత్ భారత్ లక్ష్యంలో భాగస్వాములుగా నిలవాలి**
- **ఆంధ్రప్రదేశ్ బీజేపీ అధ్యక్షుడు పీవీఎన్ మాధవ్**



**అమరావతి (జర్నలిస్ట్ ఫైల్) :** ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాలు ఏర్పడి నేటికి 12 సంవత్సరాలు పూర్తయిన సందర్భంగా ఆంధ్రప్రదేశ్ బీజేపీ అధ్యక్షుడు పీవీఎన్ మాధవ్ మంగళవారం సోషల్ మీడియా వేదికగా ప్రత్యేక సందేశం విడుదల చేశారు. తెలంగాణ ఆవిర్భావ దినోత్సవ సందర్భంగా ఆ రాష్ట్ర ప్రజలందరికీ హృదయపూర్వక శుభాకాంక్షలు తెలిపారు.

ప్రధానమంత్రి నరేంద్ర మోదీ నేతృత్వంలో దేశం వికసిత్ భారత్--2047 లక్ష్య సాధన దిశగా వేగంగా పయనిస్తున్న ఈ సమయంలో రెండు తెలుగు రాష్ట్రాలు పెట్టుబడులు, మౌలిక వసతులు, సాంకేతిక పరిజ్ఞానం, పారిశ్రామికాభివృద్ధి మరియు ఉపాధి కల్పన రంగాలలో ఆరోగ్యకరమైన పోటీ ప్రదర్శిస్తూ దేశ అభివృద్ధికి చోదక శక్తులుగా నిలవాలని మాధవ్ ఆకాంక్షించారు.

రాష్ట్ర రాజధాని అమరావతి మరియు హైదరాబాద్ (భాగ్యనగరం) ప్రపంచ స్థాయి నగరాలుగా ఎదిగి తెలుగు ప్రజల ప్రతిభను అంతర్జాతీయ వేదికపై చాటాలని ఆయన కోరుకున్నారు. తెలుగు జాతి వైభవం మరింత ఇనుమడిస్తూ ప్రతి కుటుంబం అభివృద్ధి ఫలాలను అందుకోవాలని, రెండు రాష్ట్రాలు వికసిత్ భారత్ నిర్మాణంలో కీలక పాత్ర పోషించాలని ఆయన స్పష్టం చేశారు.

రెండు రాష్ట్రాల విభజన తర్వాత గడచిన 12 సంవత్సరాలలో అభివృద్ధి పథంలో పోటీపడుతూ సాగిన తెలుగు రాష్ట్రాలు భవిష్యత్తులో మరింత పురోగతి సాధించాలని మాధవ్ ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ సందేశం రాజకీయ పక్షాలకు అతీతంగా తెలుగు జాతి ఐక్యత మరియు సహకార స్ఫూర్తికి నిదర్శనంగా నిలుస్తుందని రాజకీయ విశ్లేషకులు పేర్కొంటున్నారు.

# జూన్ 5న మెగా జాబ్ మేళా

**మంగళగిరి (జర్నలిస్ట్ ఫైల్) :** రాష్ట్ర మంత్రి నారా లోకేష్ చొరవతో మంగళగిరిలోని వి.జే. జూనియర్ కాలేజీలో ఈ నెల 5వ తేదీన మెగా జాబ్ మేళా నిర్వహించనున్నారు యువతకు ఉపాధి అవకాశాలు కల్పించడమే మంత్రి నారా లోకేష్ లక్ష్యంగా ఈ జాబ్ మేళా నిర్వహణ .

10వ తరగతి, ఇంటర్మీడియట్, డిగ్రీ, బీటెక్, పీజీ తదితర విద్యార్హతలు కలిగిన 18 నుంచి 40 సంవత్సరాల మధ్య వయస్సు గల నిరుద్యోగ యువత ఈ జాబ్ మేళాలో పాల్గొనవచ్చని పేర్కొన్నారు. అభ్యర్థులు ఆధార్ కార్డు, విద్యార్హతల సర్టిఫికెట్లు, పాస్‌పోర్ట్ సైజు ఫోటోలు, బయోడేటాతో నేరుగా ఇంటర్వ్యూలకు హాజరు కావచ్చని తెలిపారు.

ఈ జాబ్ మేళా ద్వారా 950 మందికి పైగా ఉద్యోగ అవకాశాలు అందుబాటులో ఉండగా, ఎంపికైన అభ్యర్థులకు నెలకు రూ. 15,000 నుంచి రూ. 40,000 వరకు వేతనాలు లభించే అవకాశం ఉందన్నారు.

**జాబ్ మేళా వివరాలు:**

- తేదీ: 05-06-2026
- సమయం: ఉదయం 9.00 గంటల నుంచి సాయంత్రం 4.00 గంటల వరకు
- వేదిక: వి.జే. జూనియర్ కాలేజీ, మంగళగిరి

అభ్యర్థులు రాష్ట్ర ప్రభుత్వ నైపుణ్యం పోర్టల్ ద్వారా నమోదు చేసుకోవచ్చని అధికారులు తెలిపారు.

**రిజిస్ట్రేషన్ కోసం:**

నైపుణ్యం పోర్టల్: naipunyam.ap.gov.in

**అదనపు వివరాల కోసం:**

8074597926, 7780588993 నంబర్లను సంప్రదించవచ్చని సూచించారు.

అలాగే, జాబ్ మేళా ప్రాంగణంలోనే ప్రత్యక్ష రిజిస్ట్రేషన్ సౌకర్యం కూడా అందుబాటులో ఉంటుందని నిర్వాహకులు వెల్లడించారు. మంగళగిరి నియోజకవర్గానికి చెందిన నిరుద్యోగ యువత ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

# తిరుమలలో రికార్డ్ స్థాయి దర్శనాలు

**తిరుమల (జర్నలిస్ట్ ఫైల్) :** తిరుమల శ్రీవారి భక్తులకు బిగ్ అలర్ట్. తిరుమలలో రికార్డు స్థాయి దర్శనాలు నమోదు అవుతున్నాయి. విద్యాసంస్థలకు సెలవులు ఉన్న నేపథ్యంలో మే నెలలో తిరుమల శ్రీవారి ఆలయాన్ని దర్శించుకునేందుకు భక్తులు పోటెత్తారు. మే మాసంలో మొత్తం 25,46,168 మంది తిరుమల శ్రీవారిని దర్శించుకున్నట్లు అధికారికంగా టీటీడీ పాలకమండలి ప్రకటన చేసింది. మే 24వ తేదీన అత్యధికంగా 98,058 మంది భక్తులు తరలివచ్చినట్లు వెల్లడించింది.

ఇక తిరుమల హుండీ ఆదాయం మే నెలలో రూ. 120.28 ఓట్లుగా నమోదు అయింది. మే మాసంలో మొత్తం 12,29,773 మంది తలనీలాలు సమర్పించారు.

# మియాపూర్ ప్రజావాణిలో 35 అర్జీలు



**శేరిలింగంపల్లి, (జర్నలిస్ట్ ఫైల్) :** మియాపూర్ సిఎంసీ సర్కిల్ 48 పరిధిలో సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమానికి మొత్తం 35 ఫిర్యాదులు వచ్చినట్లు డీసీ శశిరేఖ తెలిపారు. ఈ అర్జీలలో అత్యధికంగా టౌన్ ప్లానింగ్ విభాగానికి సంబంధించి 33 రాగా, ఇరిగేషన్, వెటర్నరీ విభాగాలకు ఒక్కొక్కటి చొప్పున ఫిర్యాదులు అందాయి. కాగా రెవెన్యూ, హెల్త్ అండ్ శానిటేషన్, యూసీడీ, ఇంజినీరింగ్, యూబీడీ, ఎలక్ట్రికల్ విభాగాలకు ఎలాంటి అర్జీలు రాలేదని ఆమె పేర్కొన్నారు. ప్రజల నుంచి వచ్చిన ఈ ఫిర్యాదులను పరిశీలించి, వాటిని త్వరితగతిన పరిష్కరించేలా చర్యలు తీసుకుంటామని శశిరేఖ వివరించారు

# సాకారం కానున్న శేరిలింగంపల్లి, అమీన్‌పూర్ వాసుల కల: ప్రారంభమైన ఫ్లైఓవర్ పనులు



**-బీహెచ్ఈఎల్ చౌరస్తా - బంధంకొమ్ము రోడ్డు పనులను క్షేత్రస్థాయిలో పరిశీలించిన ఎంపీ రఘునందన్ రావు**

**శేరిలింగంపల్లి (జర్నలిస్ట్ ఫైల్) :** బీహెచ్ఈఎల్ చౌరస్తా నుంచి అమీన్‌పూర్ బంధంకొమ్ము వరకు జాతీయ రహదారిని కలుపుతూ నాలాపై నిర్మించనున్న ఫ్లైఓవర్, నాలుగు లైన్ల రహదారి పనులను మెదక్ ఎంపీ రఘునందన్ రావు సోమవారం క్షేత్రస్థాయిలో పరిశీలించారు. సంగారెడ్డి జిల్లా అధ్యక్షురాలు గోదావరి అంజిరెడ్డి, బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి రవికుమార్ యాదవ్‌లతో కలిసి పనులను పర్యవేక్షించిన అనంతరం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో నాయకులు మాట్లాడారు. ఈ రహదారి నిర్మాణం శేరిలింగంపల్లి, అమీన్‌పూర్ ప్రజల దీర్ఘకాలిక కల అని, గతంలో దీనికోసం బీజేపీ ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ధర్నాలు చేశామని గుర్తుచేశారు. చేవెళ్ల ఎంపీ కొండా విశ్వేశ్వర్ రెడ్డి, మెదక్ ఎంపీ రఘునందన్ రావు ప్రత్యేక చొరవతో జీహెచ్ఎంసీ కమిషనర్ కర్ణన్‌ను కలిసి సమస్యను వివరించి నిధులు మంజూరు చేయించడంతోనే వారం రోజులుగా నాలా డైవర్షన్ పనులు ప్రారంభమయ్యాయని స్పష్టం చేశారు. స్థానిక పటాన్‌చెరు, శేరిలింగంపల్లి ఎమ్మెల్యేలు ఓట్లు వేయించుకుని ప్రజలను మోసం చేశారే తప్ప పనులు చేయలేదని, ఈ విజయం కేవలం బీజేపీ ఎంపీల కృషి, ప్రజల సహకారంతోనే సాధ్యమైందని వివరించారు. ఈ కార్యక్రమంలో పార్టీ ప్రతినిధులు మహిపాల్ రెడ్డి, బుచ్చిరెడ్డి, సింధు రెడ్డి, శ్రీనివాస్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు

# ఎన్నికల హామీలు నెరవేర్చాలి... సీఐటీయూ



**తాండూర్, జూన్ 02 (జర్నలిస్ట్ ఫైల్) :** రాష్ట్ర కాంగ్రెస్ ప్రభుత్వం గ్రామపంచాయతీ కార్మికులకు ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను వెంటనే నెరవేర్చాలని సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి దాగం రాజారాం డిమాండ్ చేశారు. సోమవారం తాండూర్ మండలం ఐబీ కేంద్రంలో సీఐటీయూ ఆధ్వర్యంలో గ్రామపంచాయతీ కార్మికులు రాస్తారోకో నిర్వహించారు. ఈ సందర్భంగా రాజారాం మాట్లాడుతూ, మల్టీ పర్పస్ విధానాన్ని రద్దు చేసి కార్మికులను పర్మినెంట్ చేయాలని, బకాయి వేతనాలు వెంటనే చెల్లించాలని, నెలకు రూ.26 వేల కనీస వేతనం ఇవ్వాలని డిమాండ్ చేశారు. కరోనా సమయంలో ప్రాణాలను లెక్కచేయకుండా పని చేసిన కార్మికులను ప్రభుత్వం పట్టించుకోవడం లేదని, పెరిగిన ధరలకు అనుగుణంగా వేతనాలు పెంచాలని ఆయన కోరారు. ప్రభుత్వం స్పందించకుంటే ఆందోళనలు ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో నాయకులు వేల్పుల శంకర్, బొల్లం రాజేశం, మొగిలి,హక్కు, అక్బర్, నందిపేట వెంకటి, ఇప్ప రామయ్య, ఇప్పదురుగు, ఇప్ప ఎల్లమ్మ, ఇప్ప సుజాత, కాజీపేట కమల, రామగిరి రాధా, మరియు కార్మికులు పాల్గొన్నారు

# రోడ్డు నిర్మాణ పనులను పరిశీలించిన 11వ డివిజన్ కార్పొరేటర్ కరెంగుల రమ్య

**-ప్రజలకు మెరుగైన రవాణా సౌకర్యాలే లక్ష్యం**



**రామ్ మందిర్ ఏరియా, జూన్ 02 (జర్నలిస్ట్ ఫైల్) :** రామగుండం: స్థానిక ఎమ్మెల్యే రాజ్ ఠాకూర్, నగర మేయర్ మహంకాళి స్వామి ఆదేశాల మేరకు సోమవారం 11వ డివిజన్ పరిధిలోని వన్‌టౌన్ పోలీస్ స్టేషన్ నుంచి 5 ఇంక్లైన్ వరకు చేపడుతున్న 40 అడుగుల రోడ్డు నిర్మాణ పనులను కార్పొరేటర్ కరెంగుల రమ్య (దాసరి విజయ్ కుమార్) క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, డివిజన్ ప్రజల రవాణా ఇబ్బందులను తొలగించి మెరుగైన రోడ్డు సౌకర్యాలు కల్పించడమే లక్ష్యంగా అభివృద్ధి పనులు చేపడుతున్నట్లు తెలిపారు. ప్రజాప్రతినిధుల సహకారంతో రోడ్డు నిర్మాణ పనులు వేగంగా కొనసాగుతున్నాయని పేర్కొన్నారు. నిర్మాణ పనుల్లో నాణ్యతకు అత్యంత ప్రాధాన్యం ఇవ్వాలని, ఎలాంటి లోపాలు తలెత్తకుండా అధికారులు, కాంట్రాక్టర్లు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని సూచించారు. అలాగే ప్రజలకు ఇబ్బందులు కలగకుండా పనులను త్వరితగతిన పూర్తి చేయాలని ఆదేశించారు. డివిజన్ అభివృద్ధికి సహకరిస్తున్న ఎమ్మెల్యే రాజ్ ఠాకూర్, మేయర్ మహంకాళి స్వామికి ఈ సందర్భంగా కార్పొరేటర్ కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు, వార్డు ప్రజలు, అధికారులు పాల్గొన్నారు. శీర్షిక ప్రత్యామ్నాయాలు: 40 అడుగుల రోడ్డు నిర్మాణ పనులపై కార్పొరేటర్ కరెంగుల రమ్య సమీక్షనాణ్యతతో రోడ్డు పనులు పూర్తి చేయాలి: కార్పొరేటర్డివిజన్ కరెంగుల రమ్య

# అధ్వాన్నంగా స్మశాన వాటిక, రోడ్లు.. తక్షణమే పనులు చేపట్టాలని డిమాండ్



**శేరిలింగంపల్లి(జర్నలిస్ట్ ఫైల్):** శేరిలింగంపల్లి నియోజకవర్గం లోని అంజయ్య నగర్ డివిజన్ పరిధిలో గల రాజీవ్ నగర్ స్మశాన వాటిక దయనీయ స్థితిపై, పెండింగ్‌లో ఉన్న సీసీ రోడ్ల నిర్మాణంపై డివిజన్ నాయకుడు ఆంజనేయులు సాగర్ తీవ్ర ఆందోళన వ్యక్తం చేశారు. సోమవారం ప్రజావాణి కార్యక్రమంలో చీఫ్ ఇంజినీర్ శ్రీలక్ష్మిని కలిసి స్థానిక ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలపై వినతిపత్రం అందజేశారు. స్మశాన వాటికలో కనీస సౌకర్యాలైన తాగునీరు, వీధి దీపాలు, మరుగుదొడ్లు లేకపోవడంతో పాటు చెత్త పేరుకుపోవడంతో అంత్యక్రియల నిర్వహణ నరకంగా మారిందని ఆవేదన వ్యక్తం చేశారు. బంజారా బస్తీ, రాజీవ్ నగర్ పరిసర ప్రాంతాల్లో రోడ్లు పూర్తిగా దెబ్బతిన్నాయని, వర్షాలు పడితే డ్రైనేజీలు పొంగిపొర్లి వాహనదారులు, ఉద్యోగులు ప్రమాదాల బారిన పడుతున్నారని మండిపడ్డారు. ప్రజాసమస్యలను తక్షణమే పరిష్కరించాలని డిమాండ్ చేయగా, చీఫ్ ఇంజినీర్ శ్రీలక్ష్మి స్పందిస్తూ త్వరలోనే క్షేత్రస్థాయిలో పరిశీలించి తగిన చర్యలు చేపడతామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో నాయకులు సురేష్ సాగర్, వెంకటేష్, మురళి పాల్గొన్నారు

# అటవీ శాఖ ఆధ్వర్యంలో ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక కార్యక్రమాల ప్రారంభం



**నిర్మల్ జిల్లా, జూన్ 02 (జర్నలిస్ట్ ఫైల్) :** జిల్లాలో పర్యావరణ పరిరక్షణ, అటవీ సంపద సంరక్షణపై ప్రజల్లో అవగాహన పెంపొందించేందుకు అటవీ శాఖ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న 'ప్రజా పాలన--ప్రగతి ప్రణాళిక' కార్యక్రమాలను జిల్లా అటవీ శాఖ అధికారి సుశాంత్ సుఖదేవ్ బోబడే ఆదివారం చించోలి గ్రామంలోని గండి రామన్న అర్బన్ పార్కులో ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జూన్ 1 నుంచి 12వ తేదీ వరకు జిల్లాలోని అన్ని అటవీ రేంజ్‌ల పరిధిలో పలు అవగాహన కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. బైక్ ర్యాలీలు, పక్షుల వీక్షణ కార్యక్రమాలు, విద్యార్థులకు వ్యాసరచన--చిత్రలేఖన పోటీలు, వన దర్శిని, ప్రపంచ పర్యావరణ దినోత్సవ వేడుకలు, కళాజాతలు, ప్లాస్టిక్ వినియోగ నిర్మూలనపై అవగాహన కార్యక్రమాలు చేపట్టనున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమానికి జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ అర్జుమన్ అలీ, నిర్మల్ మున్సిపాలిటీ వైస్ చైర్మన్ అప్పాల గణేష్ చక్రవర్తి, నిర్మల్ వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ భీమరెడ్డి, సారంగాపూర్ వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ అబ్దుల్ హాది, భైంసా వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ షిండే ఆనంద్‌రావు పటేల్, కుబీర్ వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ కళ్యాణ్ ముఖ్య అతిథులుగా హాజరయ్యారు .అటవీ మండలాధికారులు షేక్ ఆదం నాగిని భాను, కే. శివకుమార్, అటవీ నిఘా విభాగం అధికారులు, ప్రజాప్రతినిధులు, కౌన్సిలర్లు, అటవీ శాఖ అధికారులు, సిబ్బంది, విద్యార్థులు, స్థానిక ప్రజలు పాల్గొన్నారు. అనంతరం మొక్కలు నాటడం, ఫోటో స్టాల్ ప్రదర్శన నిర్వహించగా, జిల్లా అటవీ శాఖ ప్రగతి నివేదికను సమర్పించారు.

# కిష్టయ్యపల్లిలో పేదల భూములపై కన్నేసిన రియల్ ఎస్టేట్ వ్యాపారులు

**-పేదల పట్టా భూములను రక్షిస్తాం: కౌన్సిలర్ ఇంద్రసేన**



**(జర్నలిస్ట్ ఫైల్) :** గడ్డపోతారం మున్సిపాలిటీ పరిధిలోని కిష్టయ్యపల్లి గ్రామంలో సర్వే నంబర్ 42లో గతంలో పేదలకు కేటాయించిన 91 ఇళ్ల స్థలాల భూములపై రియల్ ఎస్టేట్ వ్యాపారులు కబ్జాకు పాల్పడుతున్నారని లబ్ధిదారులు ఆందోళన వ్యక్తం చేశారు. తమకు ప్రభుత్వం కేటాయించిన భూములను కాపాడాలని, తమ భూములు తమకే దక్కేలా చర్యలు తీసుకోవాలని లబ్ధిదారులు డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా పలువురు పట్టాదారులు మాట్లాడుతూ, కొందరు రియల్ ఎస్టేట్ వ్యాపారులు భూములను ఆక్రమించే ప్రయత్నాలు చేస్తున్నారని ఆరోపించారు. విషయం తెలుసుకున్న కిష్టయ్యపల్లి 15వ వార్డు కౌన్సిలర్ ఇంద్రసేన వారి సమస్యలను తెలుసుకున్నారు. పేదలకు కేటాయించిన ఇళ్ల స్థలాలను ఎట్టి పరిస్థితుల్లోనూ కబ్జాకు గురికాకుండా కాపాడుతామని, అవసరమైతే సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లి న్యాయం జరిగేలా చర్యలు చేపడతామని హామీ ఇచ్చారు. పేదల హక్కులను పరిరక్షించేందుకు తాను అండగా ఉంటానని, లబ్ధిదారుల భూములను రియల్ ఎస్టేట్ వ్యాపారుల నుంచి కాపాడేందుకు కృషి చేస్తానని కౌన్సిలర్ ఇంద్రసేన భరోసా ఇచ్చారు

# వాసవి విద్యా సంస్థల్లో విద్యా ప్రమాణాలపై సదస్సు



**నిర్మల్ జిల్లా, జూన్ 02 (జర్నలిస్ట్ ఫైల్) :** నిర్మల్ జిల్లా కేంద్రంలోని స్థానిక తన్వి ఫంక్షన్ హాల్‌లో వాసవి విద్యా సంస్థల ఆధ్వర్యంలో ఉపాధ్యాయుల కోసం విద్యా ప్రమాణాలపై ప్రత్యేక సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఎస్‌సీఈఆర్‌టీ మాజీ కరికులం, పాఠ్యపుస్తకాల విభాగాధిపతి ఎన్. ఉపేందర్‌రెడ్డి ముఖ్య వక్తగా హాజరై ఉపాధ్యాయులకు పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉపాధ్యాయుడు నిరంతర అభ్యాసకుడిగా ఉండాలని, బోధనలో కేవలం పాఠ్యాంశం పూర్తి చేయడమే లక్ష్యంగా కాకుండా విద్యార్థుల్లో జ్ఞాన సముపార్జన పెంపొందించడమే ప్రధాన ధ్యేయంగా ఉండాలని పేర్కొన్నారు. మార్కుల కంటే విద్యార్థులు పొందే అవగాహన, నేర్చుకునే సామర్థ్యం ముఖ్యమని అన్నారు. విద్యార్థులతో ఎక్కువగా సంభాషిస్తూ వారి ఆలోచనా విధానాన్ని పెంపొందించాలని, సృజనాత్మక దృక్పథాన్ని అలవర్చేలా బోధన సాగించాలని సూచించారు. విద్యార్థులు తరగతికి వచ్చే సమయానికి నిమిషానికి కనీసం 60 పదాలు చదివే స్థాయికి చేరుకోవాలని, ఇంటి పనుల భారం తగ్గించి పఠన సంస్కృతిని అభివృద్ధి చేయాల్సిన అవసరం ఉందన్నారు. సిలబస్ పూర్తి చేయడమే విజయమని భావించకుండా, ఎంత బోధించామన్నదానికంటే విద్యార్థులు ఎంత నేర్చుకున్నారనే అంశంపై ఉపాధ్యాయులు నిరంతరం సమీక్ష చేసుకోవాలని సూచించారు. విద్యార్థుల్లో ప్రశ్నించే తత్వాన్ని ప్రోత్సహించి, వారిని మాట్లాడించే అవకాశాలు కల్పించాలని, మంచి పనితీరును ప్రశంసించడం ద్వారా ఆత్మవిశ్వాసాన్ని పెంపొందించాలని తెలిపారు. అలాగే పాఠ్యపుస్తకాలలోని అంశాలను నిత్యజీవితానికి అన్వయిస్తూ ఉదాహరణలతో బోధిస్తే విద్యార్థులకు మరింత సులభంగా అర్థమవుతాయని పేర్కొన్నారు. అనంతరం నిర్వహించిన విద్యాగోష్టిలో ఉపాధ్యాయులతో చర్చించి, వారు అడిగిన పలు ప్రశ్నలకు సమాధానాలు ఇచ్చి సందేహాలను నివృత్తి చేశారు. ఈ కార్యక్రమంలో వాసవి విద్యా సంస్థల కరస్పాండెంట్ పోతారెడ్డి, కార్యదర్శి ఎన్. జగదీష్‌రెడ్డి, ప్రిన్సిపాల్స్ ఎం. రాజ్‌కుమార్, శ్రీనివాస్‌మొట్టి, శైలాజాయ్, సుహాసిని తదితరులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

# ఖమ్మం ప్రభుత్వ ఆసుపత్రి వైద్యుల నిర్లక్ష్యంపై విచారణ జరిపి బాధ్యులపై చర్యలు తీసుకోవాలి

ప్రభుత్వం బాధ్యత వహిస్తూ 3 నేలలో వికలాంగుడైన బాలుడి కుటుంబానికి రూ.50 లక్షల నష్టపరిహారం ఇవ్వాలి - బాలుడికి జీవితాంతం వైద్యం, విద్యను ప్రభుత్వమే భరించాలి -- సీపీఎం వైరా డివిజన్ కార్యదర్శి భూక్యా వీరభద్రం డిమాండ్



వైరా, (జర్నలిస్ట్ ఫైల్) : ఖమ్మం ప్రభుత్వ ఆసుపత్రి వైద్యుల నిర్లక్ష్యం కారణంగా ఓ పసికందు వికలాంగుడిగా మారిన సంఘటన అత్యంత దారుణమని, ఈ ఘటనపై రాష్ట్ర ప్రభుత్వం వెంటనే స్పందించి బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని సీపీఎం వైరా డివిజన్ కార్యదర్శి భూక్యా వీరభద్రం డిమాండ్ చేశారు.సోమవారం వైరా బోడేపూడి భవన్‌లో సీపీఎం డివిజన్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ వైరా మండలం పుణ్యపురం గ్రామానికి చెందిన తలపాటి సూర్యకాంత్, రేణుక దంపతులకు జన్మించిన కవల పిల్లల్లో ఒక బాలుడికి ఆరోగ్య సమస్యలు ఉండటంతో మార్చి 4వ తేదీన ఖమ్మం ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స కోసం చేర్పించారని తెలిపారు.రక్తం ఎక్కించే సమయంలో కాన్యులా అమర్చిన ప్రాంతంలో వాపు వచ్చినప్పటికీ కుటుంబ సభ్యులు పలుమార్లు వైద్యులకు చెప్పినా పెద్ద సమస్య కాదని నిర్లక్ష్యంగా వ్యవహరించారని ఆరోపించారు. వాపు తగ్గకపోవడం, చేయి నల్లగా మారడంతో మళ్లీ ప్రశ్నించగా ప్రైవేటులో స్కానింగ్ చేయించు కోవాలని సూచించడం వైద్యుల బాధ్యతా రాహిత్యానికి నిదర్శనమని అన్నారు.స్కానింగ్ నివేదికలో చేతి కణజాలం తీవ్రంగా దెబ్బతిన్నట్లు తేలడంతో హైదరాబాద్ నిలోఫర్ ఆసుపత్రికి తరలించగా, అక్కడి వైద్యులు చేయి పూర్తిగా దెబ్బతిన్నందున తొలగించడం తప్ప మార్గం లేదని చెప్పారని వివరించారు. దీంతో పసికందు జీవితాంతం వికలాంగుడిగా మారడం అత్యంత బాధాకరమని అన్నారు.ఈ ఘటనపై రాష్ట్ర ప్రభుత్వం ఉన్నతస్థాయి విచారణ జరిపి నిజానిజాలు వెలికితీయాలని, వైద్యుల నిర్లక్ష్యం నిరూపితమైతే సంబంధిత అధికారులపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.అలాగే బాధిత కుటుంబానికి రాష్ట్ర ప్రభుత్వం రూ.50 లక్షల నష్టపరిహారం ప్రకటించాలని, బాలుడికి జీవితాంతం ఉచిత వైద్య సేవలు, కృత్రిమ అవయవాల ఏర్పాటు, అవసరమైన పునరావాస సదుపాయాలు కల్పించాలని కోరారు. బాలుడి విద్యా బాధ్యతను కూడా ప్రభుత్వమే స్వీకరించాలని డిమాండ్ చేశారు.ప్రభుత్వం వైద్యరంగంపై సరైన పర్యవేక్షణ నిర్వహించడంలో విఫలమవుతోందని, అందువల్లే ఇలాంటి నిర్లక్ష్య ఘటనలు చోటుచేసుకుంటున్నాయని వీరభద్రం విమర్శించారు. ప్రభుత్వ ఆసుపత్రుల్లో వైద్య సేవల నాణ్యతపై నిరంతర పర్యవేక్షణ ఉండేలా చర్యలు తీసుకోవాలని, ప్రజలకు మెరుగైన వైద్యం అందించేందుకు సక్రమమైన విధానాన్ని ప్రభుత్వం అనుసరించాలని సీపీఎం డిమాండ్ చేస్తోందని అయన తెలిపారు.ఈ మీడియా సమావేశంలో సీపీఎం జిల్లా కమిటీ సభ్యులు కొండబోయిన నాగేశ్వరరావు, సీపీఎం వైరా మండల కార్యదర్శి బాణాల శ్రీనివాసరావు, డివిజన్ కమిటీ సభ్యులు తోట నాగేశ్వరరావు, తుము సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

# విద్యార్థులకు కంప్యూటర్ కోర్సులు



వైరా, (జర్నలిస్ట్ ఫైల్) : జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల రెబ్బవరం హై స్కూల్ నందు హై స్కూల్ పూర్వ విద్యార్థి విశ్రాంత ఇంజనీర్ అయిన కొల్లి రామారావు సహకారంతో ప్రత్యేక కంప్యూటర్ ఇన్స్ట్రక్టర్ ను నియమించి, వేసవి శిక్షణ శిబిరం ఏప్రిల్ 20వ తారీకు నుంచి మే 31 వరకు నిర్వహించి కంప్యూటర్ కోర్స్ నేర్పించడం జరిగింది. ఇందులో విద్యార్థులకు ఎమ్మెస్ ఆఫీస్ సి లాంగ్వేజ్ నేర్పించి వారికి సర్టిఫికెట్ ప్రధానం చేయడం జరిగింది . సెలబ్రేషన్ కార్యక్రమాన్ని హైస్కూల్ నందు మే 31 సాయంత్రం నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమంలో హైస్కూల్ ఇన్చార్జి హెచ్‌ఎం వెంకటరావు, ప్రైమరీ స్కూల్ ప్రధానోపాధ్యాయులు సుధాకర్, కంప్యూటర్ ఇన్స్ట్రక్టర్ మోహన్ సాయి, విద్యా వాలంటీర్ కవిత, బుజ్జి, కంప్యూటర్ కోర్స్ నేర్చుకున్న విద్యార్థులు వారి తల్లిదండ్రులు పాల్గొన్నారు.

# ప్రజావాణిలో మాజీ కార్పొరేటర్ శ్రవణ్

సమస్యల పరిష్కారంపై అధికారులను నిలదీత.. వారం రోజుల్లో చర్యలకు హామీ.....



మల్కాజిగిరి, జూన్ 02 : మల్కాజిగిరి జోనల్ కార్యాలయంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమం సోమవారం ఉద్రిక్తంగా మారింది. స్థానిక సమస్యల పరిష్కారంలో నిర్లక్ష్యం వహిస్తున్నారని ఆరోపిస్తూ మాజీ కార్పొరేటర్ శ్రవణ్ జోనల్ కార్యాలయంలో బైఠాయించి నిరసన చేపట్టారు.ప్రజావాణికి హాజరైన శ్రవణ్‌కు ప్రజావాణిలో మాజీ కార్పొరేటర్ శ్రవణ్ నిరసమస్యల పరిష్కారంపై అధికారులను నిలదీత.. వారం రోజుల్లో చర్యలకు హామమల్కాజిగిరి జోనల్ కార్యాలయంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమం సోమవారం ఉద్రిక్తంగా మారింది. స్థానిక సమస్యల పరిష్కారంలో నిర్లక్ష్యం వహిస్తున్నారని ఆరోపిస్తూ మాజీ కార్పొరేటర్ శ్రవణ్ జోనల్ కార్యాలయంలో బైఠాయించి నిరసన చేపట్టారు.ప్రజావాణికి హాజరైన శ్రవణ్‌కు పలువురు శాఖల అధికారులు గైర్హాజరుగా కనిపించడంతో ఆగ్రహం వ్యక్తం చేశారు. శానిటేషన్, స్ట్రీ మాజీ కార్పొరేటర్ శ్రవణ్ జోనల్ కార్యాలయంలో బైఠాయించి నిరసన చేపట్టారు.ట్ లైట్స్, ఫాగింగ్, రోడ్ల మరమ్మతులు, డీసిల్టింగ్ పనులు, పార్కుల అభివృద్ధి తదితర అంశాల్లో తీవ్ర నిర్లక్ష్యం కొనసాగుతోందని ఆరోపించారు. అధికారులు కనిపించడం లేదంటూ జోనల్ కమిషనర్ కుర్చీ వద్ద లేఖను అతికించి నిరసన తెలిపారు.మృగశిర కార్తె ప్రారంభమైనప్పటికీ వర్షాకాలానికి ముందస్తు ఏర్పాట్లు చేయకపోవడం, గుంతల రోడ్ల వల్ల ప్రమాదాలు జరుగుతున్నా పట్టించుకోకపోవడం, సఫిల్‌గూడా, ఆనంద్‌బాగ్ ప్రాంతాల్లో తవ్విన రోడ్లను పునరుద్ధరించకపోవడంపై ప్రశ్నించారు. టౌన్ ప్లానింగ్ విభాగంలో అవకతవకలు జరుగుతున్నాయని, కొన్ని నిర్మాణాలకు అనుమతుల విషయంలో ప్రజలను ఇబ్బందులకు గురిచేస్తున్నారని ఆరోపించారు.అలాగే సఫిల్‌గూడాలో ప్రజా మరుగుదొడ్ల ఏర్పాటు, దోమల నివారణ చర్యలు, చెరువు అభివృద్ధి పనులు, సమ్మర్ క్యాంపుల నిర్వహణ వంటి అంశాలను ప్రస్తావిస్తూ వెంటనే చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.శ్రవణ్ నిరసనతో అప్రమత్తమైన జోనల్ కమిషనర్ సంచిత్ గంగ్వార్‌తో పాటు ఇతర అధికారులు అక్కడికి చేరుకుని సమస్యలపై చర్చించారు. వారం రోజుల్లో సంబంధిత అంశాలపై నిర్దిష్ట చర్యలు చేపడతామని హామీ ఇవ్వడంతో శ్రవణ్ తన నిరసనను విరమించారు.ఈ కార్యక్రమంలో మురళీ గౌడ్, మాధవ్ యాదవ్, సత్తిరెడ్డి శ్యామ్, వాణిశ్రీ, నందు యాదవ్, మల్లేష్, నరసింహ, జోగు వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.పలువురు శాఖల అధికారులు గైర్హాజరుగా కనిపించడంతో ఆగ్రహం వ్యక్తం చేశారు. శానిటేషన్, స్ట్రీ మాజీ కార్పొరేటర్ శ్రవణ్ జోనల్ కార్యాలయంలో బైఠాయించి నిరసన చేపట్టారు. ట్ లైట్స్, ఫాగింగ్, రోడ్ల మరమ్మతులు, డీసిల్టింగ్ పనులు, పార్కుల అభివృద్ధి తదితర అంశాల్లో తీవ్ర నిర్లక్ష్యం కొనసాగుతోందని ఆరోపించారు. అధికారులు కనిపించడం లేదంటూ జోనల్ కమిషనర్ కుర్చీ వద్ద లేఖను అతికించి నిరసన తెలిపారు.మృగశిర కార్తె ప్రారంభమైనప్పటికీ వర్షాకాలానికి ముందస్తు ఏర్పాట్లు చేయకపోవడం, గుంతల రోడ్ల వల్ల ప్రమాదాలు జరుగుతున్నా పట్టించుకోకపోవడం, సఫిల్‌గూడా, ఆనంద్‌బాగ్ ప్రాంతాల్లో తవ్విన రోడ్లను పునరుద్ధరించకపోవడంపై ప్రశ్నించారు. టౌన్ ప్లానింగ్ విభాగంలో అవకతవకలు జరుగుతున్నాయని, కొన్ని నిర్మాణాలకు అనుమతుల విషయంలో ప్రజలను ఇబ్బందులకు గురిచేస్తున్నారని ఆరోపించారు.అలాగే సఫిల్‌గూడాలో ప్రజా మరుగుదొడ్ల ఏర్పాటు, దోమల నివారణ చర్యలు, చెరువు అభివృద్ధి పనులు, సమ్మర్ క్యాంపుల నిర్వహణ వంటి అంశాలను ప్రస్తావిస్తూ వెంటనే చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.శ్రవణ్ నిరసనతో అప్రమత్తమైన జోనల్ కమిషనర్ సంచిత్ గంగ్వార్‌తో పాటు ఇతర అధికారులు అక్కడికి చేరుకుని సమస్యలపై చర్చించారు. వారం రోజుల్లో సంబంధిత అంశాలపై నిర్దిష్ట చర్యలు చేపడతామని హామీ ఇవ్వడంతో శ్రవణ్ తన నిరసనను విరమించారు.ఈ కార్యక్రమంలో మురళీ గౌడ్, మాధవ్ యాదవ్, సత్తిరెడ్డి శ్యామ్, వాణిశ్రీ, నందు యాదవ్, మల్లేష్, నరసింహ, జోగు వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

# రెండవసారి ఏకగ్రీవంగా ఎన్నికైన వీరశైవ సమాజం శ్రీకృష్ణ నగర్ కాలనీ అధ్యక్షులు నందిగారి సంతోష్ కుమార్



(జర్నలిస్ట్ ఫైల్) సంగారెడ్డి ప్రతినిధి:శ్రీ వీర శైవ సమాజం శ్రీకృష్ణ నగర్ కాలనీ( సిద్దాపూర్ కాలనీ ) 2వ కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకొనడం జరిగింది అధ్యక్షులు నందిగారి సంతోష్ కుమార్ గౌరవాధ్యక్షులు చంద్రశేఖర్ స్వామి ఉపాధ్యక్షులు హెచ్ ఆర్ మధు కోశాధికారి నర్సింలు రాజు ప్రధాన కార్యదర్శి నురేందర్ ప్రధాన సలహాదారు వసంతరావు సలహాదారులు ఎల్లారం రాములు కార్యవర్గ సభ్యులు మాచెడిపల్లి విజయ అలాండ్ మోహన్ గాండ్ల కృష్ణ మహేష్ స్వామి సంగిశెట్టి ఎన్నుకోవడం జరిగింది గత సంవత్సరంలో అధ్యక్షులు నందిగారి సంతోష్ కుమార్ ఆధ్వర్యంలో ఎన్నో కార్యక్రమాలు నిర్వహించి అందరి ఆదర అభిమానాలను పొందిన వారికి సభ్యులందరూ అభినందించడం జరిగింది ఈ కార్యక్రమంలో సహకరించినటువంటి ప్రతి ఒక్కరికి అధ్యక్షులు నందిగారి సంతోష్ కుమార్ గారు పేరుపేరునా ధన్యవాదాలు తెలియజేసారు

# గ్రామ దీపికల సమస్యలు వెంటనే పరిష్కరించాలి

గ్రామ దీపికల హామీలు అమలు చేయాలి: బోనకల్‌లో రిలే దీక్షలు

ఉద్యోగ భద్రత, కనీస వేతనం కోసం గ్రామ దీపికల ఆందోళన

గ్రామ దీపికల సమస్యలపై ప్రభుత్వం స్పందించాలి: సీఐటీయూ

హామీలు నెరవేర్చకపోతే ఉద్యమం ఉధృతం చేస్తాం: గ్రామ దీపికల హెచ్చరిక



రాథోడ్, బోనకల్, జూన్ 02 : గ్రామ దీపికల న్యాయమైన సమస్యలను రాష్ట్ర ప్రభుత్వం తక్షణమే పరిష్కరించాలని సీఐటీయూ ఆధ్వర్యంలోని గ్రామపంచాయతీ వర్కర్స్ యూనియన్ నాయకులు డిమాండ్ చేశారు. కనీస వేతనం, ఉద్యోగ భద్రత, ఆరోగ్య బీమా, సీసీలు, పదోన్నతులు తదితర సమస్యల పరిష్కారం కోసం సోమవారం బోనకల్ మండల తహసీల్దార్ కార్యాలయం ఎదుట గ్రామ దీపికలు రిలే నిరాహార దీక్షలు చేపట్టారు.ఈ సందర్భంగా గ్రామపంచాయతీ వర్కర్స్ యూనియన్ మధిర డివిజన్ కార్యదర్శి మరీదు పుల్లయ్య, సీఐటీయూ బోనకల్ మండల కన్వీనర్ గుగులోతు నరేష్, మండల అధ్యక్షురాలు బోయినపల్లి దివ్య మాట్లాడుతూ గ్రామ దీపికల సమస్యలను ప్రభుత్వం నిర్లక్ష్యం చేయడం బాధాకరమన్నారు. ఎన్నికల సమయంలో అధికారంలోకి వస్తే గ్రామ దీపికలకు కనీస వేతనం, ఉద్యోగ భద్రతతో పాటు ఇతర సమస్యలను పరిష్కరిస్తామని కాంగ్రెస్ పార్టీ హామీ ఇచ్చిందని, అధికారంలోకి వచ్చిన తరువాత కూడా ఆ హామీలు అమలు కాలేదని విమర్శించారు.గ్రామ దీపికల న్యాయమైన డిమాండ్లను వెంటనే నెరవేర్చాలని, లేనిపక్షంలో రాష్ట్రవ్యాప్తంగా గ్రామ దీపికలను ఐక్యం చేసి ఉద్యమాలను మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు.దీక్షా కార్యక్రమానికి సీఐటీయూ గ్రామపంచాయతీ వర్కర్స్ యూనియన్ నాయకులు ఎస్‌కే కాసిం, కొత్తపల్లి నాగయ్య, కొత్తపల్లి నారాయణ, గ్రామ దీపికల మండల కార్యదర్శి దారెల్లి విజయ, కోశాధికారి ఎస్‌కే మేరాబీ, ఉపాధ్యక్షులు చేబ్రోలు ఉష, సహాయ కార్యదర్శి తోటపల్లి ప్రమీల, సీనియర్ నాయకులు ప్రసూనాంబ, బలగాని నాగరాజు తదితరులు సంఘీభావం తెలిపారు.

# తెలంగాణ రాష్ట్ర ఆర్యవైశ్య మహాసభ రాష్ట్ర ఉపాధ్యక్షులుగా

వనమా విశ్వేశ్వరరావు

-- పలువురు అభినందనలు శుభాకాంక్షలు



వైరా, జూన్ 02 (జర్నలిస్ట్ ఫైల్) : వైరా కు చెందిన ప్రముఖ రాష్ట్ర ఆర్యవైశ్య నాయకులు వనమా విశ్వేశ్వరరావు ని రాష్ట్ర ఆర్యవైశ్య మహాసభ అధ్యక్షులు అమరవాది లక్ష్మీనారాయణ రాష్ట్ర ఆర్యవైశ్య మహాసభ ఉపాధ్యక్షులుగా నియమించినట్లు హైదరాబాదులో సోమవారం నియామక పత్రం అందజేశారు . వనమా విశ్వేశ్వరరావు 34సంవత్సరాలుగా ఛాంబర్ కామర్స్ అధ్యక్షులుగా శ్రీ హరి హర సుత అయ్యప్ప క్షేత్రం చైర్మన్ గా పది సంవత్సరాల నుండి గౌరవ అధ్యక్షులుగా కిరాణా జాగిర్ మర్చంట్ అసోసియేషన్ 34 సంవత్సరాలుగా ఉంటూ ప్రస్తుత ఆర్యవైశ్య కళ్యాణ మండపం గౌరవ అధ్యక్షులుగా 1993 94 సంవత్సరంలో వైరా లయన్స్ క్లబ్ అధ్యక్షులుగా ఉన్నారు. వైరాలో ఆర్యవైశ్య సోదరులకు వారి కుటుంబాలకు చేదోడు వాదోడుగా ఉంటూ ఏ కష్టం వచ్చినా నేనున్నాను అంటూ చిరస్థాయిగా వారి మనసుల్లో నిలిచిపోయిన వనమా విశ్వేశ్వరరావుకు ఇటువంటి పదవి లభించడం పట్ల పలువురు రాష్ట్ర నాయకులు జిల్లా నాయకులు అభినందనలు తెలియజేశారు. అభినందనలు తెలియజేసిన వారిలో రాష్ట్ర ఆర్యవైశ్య మహాసభ నాయకులు పులిపాటి ప్రసాద్, ఆగిరి వెంకటేష్, పెండ్యాల విజయభాస్కర్, ఆర్యవైశ్య సంఘం జిల్లా ఉపాధ్యక్షులు కళ్యాణ మండపం ప్రధాన కార్యదర్శి నూకల శ్రీనివాసరావు, రాష్ట్ర స్టేట్ కౌన్సిలింగ్ మెంబర్ నూకల ప్రసాదరావు, శ్రీ హరిహర సుత అయ్యప్ప క్షేత్రం చైర్మన్ కొప్పురావూరి వెంకటేశ్వరరావు, ఖమ్మం జిల్లా ఆర్యవైశ్య మహాసభ కార్యదర్శి ఎంద్రపుడి శివ శంకర్, వైరా ఆర్యవైశ్య కళ్యాణ మండపం అధ్యక్షులు డాక్టర్ పెరుమాళ్ళ కృష్ణమూర్తి, కోశాధికారి మిట్టపల్లి వెంకటరమణ, మండల ఆర్యవైశ్య మహాసభ అధ్యక్షులు మిట్టపల్లి కిరణ్ కుమార్, సెక్రెటరీ కొల్లా రాంబాబు, ఆర్యవైశ్య మహాసభ మండల సెక్రటరీ నూకల అన్న పూర్ణ, ఉపాధ్యక్షురాలు గజ్జలమణి, వాసవి క్లబ్ డైమండ్ అధ్యక్షులు నంబూరి శ్రీనివాసరావు, సెక్రటరీ వజినేపల్లి రవి, వాసవి క్లబ్ మహిళ అధ్యక్షురాలు మిట్టపల్లి మహాలక్ష్మి, సెక్రటరీ రాయల అన్నపూర్ణ, కోశాధికారి మిట్టపల్లి సుధారాణి, ఆర్యవైశ్య పట్టణ మండల అధ్యక్షురాలు బొగ్గవరపు సునీత, పట్టణ ఆర్యవైశ్య సంఘం పట్టణ అధ్యక్షులు దారా కృష్ణారావు, ఆర్యవైశ్య సంఘం నాయకులు మిట్టపల్లి సత్యంబాబు, కొదుమూరి భాగ్యలక్ష్మి, గజ్జల కృష్ణమూర్తి, కొదమూరి రవి, నంబూరి రామారావు, మిట్టపల్లి శివ నాగభూషణం, రాయపూడి వెంకటేష్, రంగా సత్యనారాయణ, వనమా వెంకటేష్ , మిట్టపల్లి నాగేశ్వరరావు, వనమా మల్లికార్జునరావు, రంగా వాసవి, రాయపూడి రజిని, నాళ్ళ నాగమల్లేశ్వరి, రాయల రోజా, రాయల ప్రసాదరావు, వజినేపల్లి చక్రవర్తి, నాళ్ళ నాగేశ్వరరావు, కొప్పురావూరి శబరీనాథ్, తదితరులు శుభాకాంక్షలు హర్షం ప్రకటించారు.

# అయిల్ సత్యనారాయణ గౌడ్ పోస్ట్ ఆఫీస్(రాగి అంబలి)పంపిణి

-వేసవి కాలం(రాగి అంబలి)తో ఆరోగ్యం సుభిక్షం

-మానవసేవ యే మాధవసేవ అంటు అయిల్ సత్యనారాయణ గౌడ్ పోస్ట్ ఆఫీస్,(రాగి అంబలి)పంపిణి




(జర్నలిస్ట్ ఫైల్) తలకొండపల్లి:రంగారెడ్డి జిల్లా తలకొండపల్లి మండలం వెల్జాల్ గ్రామంలోని ప్రధాన రహదారిపై తిరుమణి రాఘవేందర్ గౌడ్ ఏర్పాటు చేసిన వెల్జాల్ చలివేంద్రం దగ్గర అయిల్ సత్యనారాయణ గౌడ్ పోస్ట్ ఆఫీస్(రాగి అంబలి)పంపిణీ,చెయ్యడం జరిగింది. వేసవి కాలం ప్రజల దాహార్తి తీర్చడానికి బాటసారిలకు వాహనం దారులకు రాగి అంబలి పంపిణీ అందజేయడం జరిగింది.ఈ సందర్భంగ సత్యనారాయణ గౌడ్ మాట్లాడుతూ వెల్జాల్ గ్రామంలో చలివేంద్రం ఏర్పాటు చేసిన రాఘవేంద్ర గౌడ్ కు ప్రత్యేక ధన్యవాదాలు వేసవి కాలాన్ని దృష్టిలో పెట్టుకొని ప్రజల దహార్తిని తీర్చడానికి మంచి మనసు తో ఏర్పాటుచేసిన చలివేంద్రం ప్రజలకు ఎంతో ఉపయోగపడుతుందని గ్రామంలోని ఎస్ బి ఐ బ్యాంకు దగ్గరికి వచ్చిన ప్రజలు చల్లటి నీరు,మజ్జిగా,అంబలి తాగి వారి దాహార్తిని తీర్చుకుంటున్నారు.గ్రామంలో ప్రజా అవసరాలను తీర్చడమే లక్ష్యంగా ఇలాంటి కార్యక్రమాలు మరెన్నో చేయాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో సత్యనారాయణ గౌడ్ కుటుంబ సభ్యులు,విజయ్ యాదవ్, రమేష్, అంజి, రవి, సదక్,తదితరులు పాల్గొన్నారు.

# వక్ఫ్ సమస్యకు శాశ్వత పరిష్కారం దిశగా అడుగులు

: ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డి



నేరెడ్ మెట్, జూన్ 02 (జర్నలిస్ట్ ఫైల్) : మల్కాజ్‌గిరి నియోజకవర్గంలోని పలు కాలనీల ప్రజలను ఇబ్బందులకు గురిచేస్తున్న వక్ఫ్ బోర్డు సమస్యకు శాశ్వత పరిష్కారం కల్పించేందుకు ప్రభుత్వం, వక్ఫ్ బోర్డు అధికారులతో నిరంతరం సమన్వయం చేస్తున్నామని ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డి తెలిపారు. కాలనీవాసుల ఆస్తుల కొనుగోలు, అమ్మకాలపై ఏర్పడిన ప్రతిష్ఠంభన తొలగించడమే తమ ప్రధాన లక్ష్యమన్నారు.ఈ మేరకు ప్రభావిత కాలనీ సంఘాల ప్రతినిధులతో కలిసి తెలంగాణ రాష్ట్ర వక్ఫ్ బోర్డు చైర్మన్ సయ్యద్ అజమాతుల్లా హుస్సేనీని కలిసి సమస్య తీవ్రతను వివరించినట్లు చెప్పారు. 2024లో పొరపాటున కొన్ని సర్వే నంబర్లు 22-ఏ నిషేధిత ఆస్తుల జాబితాలో చేర్చడంతో న్యూ విద్యానగర్, ఓల్డ్ నేరెడ్మెట్, రాంబ్రహ్మనగర్, దేవినగర్, దేవినగర్ ఎక్స్‌టెన్షన్, సైనిక్‌నగర్, సీతారాంనగర్, కృష్ణానగర్ ప్రాంతాల్లో వేలాది మంది ఆస్తి యజమానులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు.సంబంధిత గెజెట్ నోటిఫికేషన్లు, హైకోర్టు తీర్పులను పరిశీలించినప్పుడు ఆయా సర్వే నంబర్లు మల్కాజ్‌గిరికి కాకుండా ఉప్పల్ మండలంలోని మల్లాపూర్ గ్రామానికి చెందినవిగా స్పష్టమైందన్నారు. ఈ విషయాన్ని వక్ఫ్ బోర్డు చైర్మన్ దృష్టికి తీసుకెళ్లగా, ఆయన సానుకూలంగా స్పందించి పొరపాటును సరిదిద్దేందుకు చర్యలు చేపడుతున్నట్లు హామీ ఇచ్చారని వెల్లడించారు.ప్రజల ఆస్తి హక్కులను కాపాడటం ప్రజాప్రతినిధిగా తన బాధ్యత అని, సమస్య పూర్తిగా పరిష్కారమయ్యే వరకు పోరాటం కొనసాగిస్తానని మర్రి రాజశేఖర్ రెడ్డి స్పష్టం చేశారు. త్వరలోనే వివాదాస్పద సర్వే నంబర్లు వక్ఫ్ జాబితా నుంచి తొలగించబడి, ప్రభావిత కాలనీల్లో సాధారణ లావాదేవీలు పునరుద్ధరించబడతాయని ఆశాభావం వ్యక్తం చేశారు.

# మండుటెండల్లో ఉపాధి కూలీల దాహార్తిని తీర్చిన సర్పంచ్ సునీతమ్మ



ఖమ్మం, జూన్ 02(జర్నలిస్ట్ ఫైల్): రఘునాధపాలెం మండలం శివాయిగూడెం గ్రామంలో సోమవారం మండుతున్న ఎండలను దృష్టిలో ఉంచుకుని, ఉపాధి హామీ పనుల్లో పాల్గొన్న కూలీల ఆరోగ్యాన్ని కాపాడాలనే ఉద్దేశంతో గ్రామ సర్పంచ్ బానోతు సునీత, ఉప సర్పంచ్ తేజావత్ శారద తమ సేవాభావాన్ని చాటుకున్నారు.ఈ సందర్భంగా సర్పంచ్ బానోతు సునీత తమ సొంత ఖర్చులతో సుమారు 150 మంది ఉపాధి హామీ కూలీలకు మజ్జిగ ప్యాకెట్లను పంపిణీ చేసి, ఎండ తీవ్రత నుంచి ఉపశమనం కల్పించారు. ఈ సేవా కార్యక్రమాన్ని కూలీలు అభినందిస్తూ వారికి కృతజ్ఞతలు తెలిపారు.ఈ కార్యక్రమంలో పంచాయతీ సెక్రటరీ రోజా, గ్రామ పెద్దలు నంద్యా నాయక్, లాలు నాయక్ , లాల్‌సింగ్ , నాగులు,తావు,నెహ్రూ, రవి,ఫీల్డ్ అసిస్టెంట్ భద్రు , మహిళలు, యువత తదితరులు పాల్గొన్నారు. ప్రజల సంక్షేమమే లక్ష్యంగా ఎండ తీవ్రతను సైతం లెక్కచేయకుండా ముందుండి సేవలందిస్తున్న సర్పంచ్ బానోతు సునీతమ్మ, ఉపసర్పంచ్ తేజావత్ శారద సేవాభావాన్ని గ్రామస్తులు ప్రత్యేకంగా అభినందించారు.ప్రజా సేవే పరమావధిగా భావించి నిరంతరం ప్రజల కోసం కృషి చేస్తున్న ప్రజాప్రతినిధులకు గ్రామస్తులు హృదయపూర్వక అభినందనలు తెలియజేశారు.

# అభివృద్ధి పథంలో వైరా మున్సిపాలిటీ అభివృద్ధి చేస్తా

-- మున్సిపల్ కమిషనర్ రామచంద్ర రావు



వైరా, (జర్నలిస్ట్ ఫైల్) : వైరా మున్సిపాలిటీ నూతన కమిషనర్ గా మేదూరు రామచంద్ర రావు సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ఖమ్మం జిల్లా చిన్న కోరుకొండ గ్రామానికి చెందిన రామచంద్రరావు కూసుమంచి ఎండిఓగా ఐదు సంవత్సరాలు పనిచేశారు. మూడేళ్లు ఎంపీ డిఓ గా ఉత్తమ సేవలు అందించినందుకు కలెక్టర్ గౌతమ్ చేతుల మీదుగా ఉత్తమ అధికారిగా, అదేవిధంగా ఎంపీడీవో గా ఒకసారి కలెక్టర్ ముజ్మీల్ ఖాన్ చేతుల మీదుగా అవార్డును అందుకున్నారు. రెండు నెలల పాటు సొంత మండలం అయిన కల్లూరులో మున్సిపల్ ఏర్పడ్డ తొలి కమిషనర్ గా విధులు నిర్వహించారు. వైరా మున్సిపాలిటీ అభివృద్ధి కోసం 20 వార్డుల్లో ప్రభుత్వ అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు అందరి సహకారంతో అభివృద్ధి చేస్తానని తెలిపారు. అరులైన వారందరికీ అందించి వారి సహకారంతో మున్సిపాలిటీ అభివృద్ధి కోసం కృషి చేస్తానని కమిషనర్ గా పదవి బాధ్యత స్వీకరించిన మేదూరి రామచంద్రరావు తెలిపారు. నిబంధనలకు కనుగుణంగా విధులు నిర్వహిస్తానని, అన్ని వార్డులలో సిసి రోడ్లు డ్రైన్ నిర్మాణం పారిశుద్ధ్య కల్పనకు శక్తివంచ లేకుండా కృషి చేస్తానని, రానున్న వర్షాకాలం ప్రజలకు సీజనల్ వ్యాధులు ప్రబలకుండా యుద్ధ ప్రాతిపదికతో పారిశుద్ధ్య చర్యలు చేపట్టనున్నట్లు ఆయన తెలిపారు.

## ఫ్యూచర్ సిటీలో జర్నలిస్టులకు ఇండ్ల స్థలాలు ఇవ్వాలి

**జర్నలిస్టులను ప్రభుత్వ అధికారుల హెల్త్ స్కీంలో చేర్చాలి.వర్కింగ్ జర్నలిస్టులందరికీ అక్రిడిటేషన్ కార్డులు ఇవ్వాలి .ప్రయివేటు, కార్పొరేట్ సంస్థలో ఫీజు రాయితీ కల్పించాలి.టీడబ్ల్యూజేఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బి. బసవ పున్నయ్య**



ఇబ్రహీంపట్నం జూన్ 02 (జర్నలిస్ట్ ఫైల్) : రంగారెడ్డి జిల్లా కమిటీ సమావేశంలో జర్నలిస్టుల సమస్యల పరిష్కారానికి పలు అంశాలపై ఏకగ్రీవ తీర్మానంహైదరాబాద్ కేంద్రంగా పనిచేస్తున్న వర్కింగ్ జర్నలిస్టులకు రంగారెడ్డి జిల్లా ఫ్యూచర్ సిటీలో ఇండ్ల జాగాలు ఇవ్వాలన్న అంశంపై రాష్ట్ర ప్రభుత్వం చేస్తున్న ఆలోచన మంచి పరిణామని, అదే క్రమంలో ఈ జిల్లాలో పనిచేస్తున్న జర్నలిస్టుల వివరాలు కూడా సేకరించి ఫ్యూచర్ సిటీలో ఇండ్ల జాగాలు ఇవ్వాలని టీడబ్ల్యూజేఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బి. బసవ పున్నయ్య ప్రభుత్వాన్ని కోరారు. సోమవారం టీడబ్ల్యూజేఎఫ్ రంగారెడ్డి జిల్లా కమిటీ సమావేశం అబ్దుల్లాపూర్ మెట్ మండల కేంద్రంలోని వి. వి బ్యాంకెట్‌హాల్‌లో నిర్వహించారు. ఈ సమావేశానికి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బి. బసవ పున్నయ్య, జిల్లా అధ్యక్ష?లు శేరిబాయి గణేష్ , జిల్లా ప్రధాన కార్యదర్శి మైల సైదులు, కోశాధికారి శ్రీనివాస్ చారి, నేషనల్ కమిటీ సభ్యులు దేవేందర్, జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు, జిల్లా కమిటీ సభ్యులు హాజరయ్యారు. ఈ సమావేశానికి జిల్లా అధ్యక్ష?లు గణేష్ అధ్యక్ష?త వహించారు. ఈ సందర్భంగా బసవ పున్నయ్య మాట్లాడుతూ జర్నలిస్టుల అక్రిడిటేషన్ల ప్రక్రియను వేగవంతం చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. అర్హులైన వర్కింగ్ జర్నలిస్టులందరికీ అక్రిడిటేషన్ కార్డులు ఇవ్వాలన్నారు. ఫీల్డ్ జర్నలిస్టుల విషయంలో ఎలాంటి కొర్రిలు పెట్టకుండా కార్డులు ఇచ్చేలా చూడాలని ప్రభుత్వాన్ని కోరారు. హెల్త్ కార్డుల విషయంలో ప్రభుత్వం చొరవ తీసుకోవాలన్నారు. ప్రభుత్వ అధికారుల హెల్త్ స్కీం జాబితాలో జర్నలిస్టులను చేర్చాలన్నారు. ఇండ్ల జాగాల విషయంలో హైదరాబాద్ కేంద్రంలో పనిచేస్తున్న జర్నలిస్టులకు ఫ్యూచర్ సిటీలో ఇచ్చేందుకు చేస్తున్న ఆలోచనలో భాగంగా ఈ జిల్లాలో పనిచేస్తున్న జర్నలిస్టులకు ఫ్యూచర్ సిటీలో ఇండ్ల స్థలాలు ఇచ్చేందుకు జిల్లా జర్నలిస్టుల వివరాలు సేకరించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. జరల్నిస్టుల పిల్లల ఫీజు రాయితీ విషయంలో ప్రభుత్వం కఠినమైన చర్యలు తీసుకోవాలన్నారు. అర్హులైన జర్నలిస్టుల పిల్లలకు ఖచ్చితంగా ప్రయివేటు, కార్పొరేట్ స్కూల్స్‌లో రాయితీ ఇచ్చేలా జిల్లా కలెక్టర్లు, డీఈవోలు చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు పి. వెంకటేశ్, మణికుమార్ , రఘునంధన్ గౌడ్, సుధర్శన్ గౌడ్, శ్రీనివాస్ , నర్సింహ్మా, రాజశేఖర్ , రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు యాదగిరి, జిల్లా ప్రచార కార్యదర్శి నర్సింహ్మారెడ్డి, సోషల్ మీడియా కమిటీ కన్వీనర్ శివ కుమార్ గౌడ్ , జిల్లా కమిటీ సభ్యులు శ్రీశైలం, అంజి, నియోజకవర్గాల అధ్యక్ష?, కార్యదర్శులు యాదగిరి, రఘవేందర్ గౌడ్, రాజు, జైచందర్ , శంకర్, బుచ్చయ్య, జర్నలిస్టులు మల్లేష్, యాకుబ్ పాష, తదితరులు పాల్గొన్నారు.

## ఇందిరమ్మ ఇళ్ల పథకంతో పేద కుటుంబాల సొంతింటి కలలు సాకారం

: కమిషనర్ అగస్త్య



ఖమ్మం, జూన్ 02(జర్నలిస్ట్ ఫైల్) : తెలంగాణ ప్రభుత్వం పేద కుటుంబాలకు గౌరవ ప్రదమైన జీవనం కల్పించాలనే లక్ష్యంతో అమలు చేస్తున్న ఇందిరమ్మ ఇళ్ల పథకం ద్వారా అనేక మంది లబ్ధిదారుల సొంతింటి కలలు నెరవేరు తున్నాయి. ఈ క్రమంలో ఖమ్మం నగరపాలక సంస్థ పరిధిలోని 53వ డివిజన్‌లో ఇందిరమ్మ ఇళ్ల పథకం కింద మంజూరైన గృహ నిర్మాణాన్ని పూర్తి చేసుకున్న లబ్ధిదారుల నూతన గృహంలో సోమవారం గృహప్రవేశ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి హాజరైన మున్సిపల్ కమిషనర్ అగస్త్య నూతన గృహాన్ని సందర్శించి లబ్ధిదారులను అభినందించారు. గృహ నిర్మాణం ఏయే దశల్లో పూర్తయిందో, నిర్మాణానికి ఎంత వ్యయం అయిందో, ప్రభుత్వ సహాయం ఎలా ఉపయోగపడిందో అడిగి తెలుసుకున్నారు. అలాగే ఇంటి నిర్మాణానికి ముందు కుటుంబం ఎదుర్కొన్న పరిస్థితులు, ప్రస్తుతం కలుగుతున్న ప్రయోజనాల గురించి లబ్ధిదారులతో మాట్లాడారు.ఈ సందర్భంగా లబ్ధిదారులు మాట్లాడుతూ గతంలో తాము పాత రేకుల ఇంటిలో నివసించే వారమని, వర్షాకాలంలో ఇంట్లోకి నీరు కారుతూ అనేక ఇబ్బందులు ఎదుర్కొనేవారమని తెలిపారు. వర్షాలు కురిసిన ప్రతిసారీ కుటుంబ సభ్యుల భద్రతపై ఆందోళన ఉండేదని, చిన్నపిల్లలతో చాలా కష్టాలు పడాల్సి వచ్చేదని వివరించారు. అయితే ఇందిరమ్మ ఇళ్ల పథకం ద్వారా సొంత పక్కా ఇల్లు లభించడంతో తమ జీవితాల్లో ఎంతో మార్పు వచ్చిందని ఆనందం వ్యక్తం చేశారు.ఇప్పుడు ఎలాంటి వర్షాలు వచ్చినా, గాలులు వీచినా, ఇతర ప్రతికూల వాతావరణ పరిస్థితులు ఉన్నా భయం లేకుండా సురక్షితంగా నివసించగలుగుతున్నామని తెలిపారు. అద్దె ఇంటి భారం లేకుండా, తమ



సొంత ఇంటిలో కుటుంబ సభ్యులతో ప్రశాంతంగా జీవించే అవకాశం లభించడం ఎంతో సంతోషంగా ఉందన్నారు. తమ పిల్లలకు మెరుగైన వాతావరణంలో జీవించే అవకాశం కల్పించినందుకు ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలిపారు.మున్సిపల్ కమిషనర్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం పేదల సంక్షేమానికి అత్యంత ప్రాధాన్యత ఇస్తూ అమలు చేస్తున్న ఇందిరమ్మ ఇళ్ల పథకం ద్వారా అర్హులైన కుటుంబాల సొంతింటి కలలను సాకారం చేస్తోందన్నారు. గృహం అనేది కేవలం నాలుగు గోడలు మాత్రమే కాదని, కుటుంబానికి భద్రత, ఆత్మవిశ్వాసం, స్థిరమైన భవిష్యత్తుకు పునాది అని పేర్కొన్నారు.ఇందిరమ్మ ఇళ్ల పథకం ద్వారా నగరంలోని అర్హులైన లబ్ధిదారులు తమ గృహ నిర్మాణాలను పూర్తి చేసుకొని సొంత ఇంటిలోకి ప్రవేశిస్తున్న నేపథ్యంలో ప్రజల్లో ఆనందం వ్యక్తమవు తోందని, ఈ పథకం మరెన్నో కుటుంబాల జీవితాల్లో వెలుగులు నింపుతోందని తెలిపారు.కార్యక్రమంలో స్థానిక ప్రజాప్రతినిధులు, మున్సిపల్ అధికారులు, సిబ్బంది, లబ్ధిదారుల కుటుంబ సభ్యులు, స్థానికులు పాల్గొన్నారు.

## మంథని కోర్టు అడిషనల్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ గా వేముల లక్ష్మీ ప్రసాద్



మంథని, జూన్ 02 జర్నలిస్ట్ ఫైల్) : మంథని సెషన్ కోర్టు అడిషనల్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ గా వేముల లక్ష్మి ప్రసాద్ సోమవారం పదవీ బాధ్యతలు స్వీకరించారు. సిరిసిల్ల జిల్లా అదనపు సెషన్స్ జిల్లా కోర్టు, ఆరవ అదనపు సెషన్స్ కోర్టు మరియు ఏ సి బీ కోర్టు కరీంనగర్ లో అదనపు పబ్లిక్ ప్రాసిక్యూటర్ గా పని చేశారు. సాధారణ బదిలీల్లో భాగంగా మంథని కోర్టు కి బదిలీపై వచ్చారు. నాలుగు జిల్లాల కరీంనగర్ , పెద్దపల్లి ,జగిత్యాల, రాజన్న సిరిసిల్ల జిల్లాలకు అసిస్టెంట్ డైరెక్టర్ ఆఫ్ ప్రాసిక్యూషన్స్ గా అదనపు బాధ్యతలు నిర్వహిస్తున్నారు.వేముల లక్ష్మీ ప్రసాద్ ఈ సందర్భంగా మాట్లాడుతూ నిందితులకు శిక్షపడుటలో పోలీసులతో పాటు పబ్లిక్ ప్రాసిక్యూటర్లది కీలకపాత్రని,పోలీసు అధికారులు,పబ్లిక్ ప్రాసిక్యూటర్లు సమన్వయశీతో పని చేసినేరస్థులకు ఖచ్చితంగా శిక్ష పడేవిధంగా కృషి చేయాలని సూచించారు.

## తెలంగాణ రాష్ట్రావతరణ దినోత్సవం సందర్భంగా ప్రజలకు హృదయపూర్వక శుభాకాంక్షలు తెలిపిన ఎం పి వద్దిరాజు రవిచంద్ర



హైదరాబాద్, ఖమ్మం, జూన్ 02 (జర్నలిస్ట్ ఫైల్) : తెలంగాణ రాష్ట్రావతరణ దినోత్సవం సందర్భంగా బీఆర్ఎస్ పార్లమెంటరీ పార్టీ డిప్యూటీ లీడర్, రాజ్యసభ సభ్యులు వద్దిరాజు రవిచంద్ర ప్రజలకు హృదయపూర్వక శుభాకాంక్షలు తెలిపారు. మహానేత కల్వకుంట్ల చంద్రశేఖర రావు అహింసా మార్గంలో మహోద్యమాన్ని నడిపించి చావు నోట్లో తలపెట్టి తెలంగాణ రాష్ట్రాన్ని సాధించడమే కాక అన్ని విధాలా అద్భుతంగా అభివృద్ధి చేశారన్నారు.కేసీఆర్ తన పదేళ్ల పాలనలో శాంతిభద్రతల పరిరక్షణకు ప్రాధాన్యతనివ్వడం, ఆర్థిక క్రమశిక్షణతో ప్రణాళికాబద్ధంగా అభివృద్ధి, సంక్షేమం రెండు కండ్లుగా ముందుకు సాగడంతో తెలంగాణ దేశం మొత్తంమీద అగ్రగామి రాష్ట్రంగా వెలుగొందినదని ఎంపీ రవిచంద్ర చెప్పారు. రాష్ట్రావతరణకు ముందు స్థూల రాష్ట్ర దేశీయ ఉత్పత్తి (జీఎస్డీపీ) రూ.5,05,849 కోట్లు కాగా,2023-24 నాటికి రూ.15,01,000 కోట్లకు,తలసరి ఆదాయం రూ.1,12,162 కాగా,3,56,000 రూపాయలకు పెరిగిందని ఎంపీ రవిచంద్ర తన ప్రకటనలో పేర్కొన్నారు. విద్యుత్ సామర్థ్యం 2013-14లో 7,778 మెగావాట్లు కాగా,2022-23 నాటికి 18,567 మెగావాట్లకు ,పంటల సాగు విస్తీర్ణం కోటి 31లక్షల ఎకరాలు అయితే,2కోట్ల20లక్షల ఎకరాలకు,పంటల దిగుబడి కోటి 7లక్షల 49వేల మెట్రిక్ టన్నుల నుంచి 4 కోట్ల 65 లక్షల 25వేల మెట్రిక్ టన్నులకు పెరిగినదని ఆయన వివరించారు.తెలంగాణ ప్రాంతంలో 2013-14లో గురుకుల పాఠశాలలు కేవలం 293మాత్రమే ఉండగా, కేసీఆర్ కొత్తగా పెద్ద సంఖ్యలో నెలకొల్పి వీటి సంఖ్యను 1022 లకు పెంచారని,5 మెడికల్ కాలేజీలు ఉంటే 29 కొత్త వాటిని ప్రారంభించడంతో వీటి సంఖ్య 34 కు పెరిగిందని,వీటికి అనుబంధంగా నర్సింగ్ కాలేజీలను కూడా నెలకొల్పారని ఎంపీ రవిచంద్ర కొనియాడారు.రాష్ట్ర ఏర్పాటుకు ముందు ప్రభుత్వాసుపత్రిల్లో 17,000 పడకలు మాత్రమే అందుబాటులో ఉండగా,2022-23 నాటికి రెట్టింపయ్యే 34,000కు చేరుకున్నాయని, ఫార్మా ఉత్పత్తుల ఎగుమతులు 2019-20లో రూ.34,800 కోట్లు కాగా,2023-24 ఆర్థిక సంవత్సరానికి 37,100 కోట్ల రూపాయలకు పెరగడం జరిగిందని ఎంపీ వద్దిరాజు వివరించారు. ఐటీ ఉత్పత్తుల ఎగుమతులు 2013-14లో రూ.57,000 కోట్లు అయితే,2023-24 నాటికి 2,70,000 కోట్ల రూపాయలకు పెరిగాయని ఆయన తెలిపారు. అలాగే, కేసీఆర్ ప్రభుత్వం తీసుకొచ్చిన సంస్కరణలు,ఐటీ,పరిశ్రమల శాఖ మంత్రిగా కే.టీ.రామారావు కృషితో విదేశీ ప్రత్యక్ష పెట్టుబడులు తెలంగాణకు తరలివచ్చాయని ఎంపీ రవిచంద్ర చెప్పారు. అమెజాన్, గూగుల్, క్వాల్కమ్,ఊబర్, ఫేస్బుక్, ఆపిల్,ఫోక్స్ కాన్,మైక్రోసాఫ్ట్ వంటి బహుళజాతి సంస్థలు హైదరాబాద్ లో తమ భారీ ప్రాంగణాలను ప్రారంభించడంతో సుమారు 9 లక్షల మంది యువతకు ఉద్యోగాలు వచ్చాయని ఆయన పేర్కొన్నారు.ట్రాఫిక్ సజావుగా ముందుకు సాగేందుకు గాను దార్శనికులు కేసీఆర్ హయాంలో రోడ్ల విస్తరణ, అభివృద్ధి,అండర్ పాసులు,ఫ్లైఓవర్ల నిర్మాణం పెద్ద ఎత్తున జరిగిందన్నారు.హైదరాబాద్ నగరం గొప్పగా అభివృద్ధి చెందడంతో న్యూయార్క్,డల్లాస్, చికాగోలను మరిపించేలా కనిపిస్తున్నదని ప్రముఖ సినీ హీరోలు రజనీకాంత్,సన్నీడియోల్ తదితరులు ప్రశంసించడాన్ని ఈ సందర్భంగా ఎంపీ రవిచంద్ర గుర్తు చేశారు.దార్శనికులు కేసీఆర్ కాళేశ్వరం బహుళదశ ప్రాజెక్ట్,మిషన్ కాకతీయ,మిషన్ భగీరథ పథకాల ద్వారా సాగు,తాగునీళ్లకు కొరత లేకుండా చేశారని రామన్ మెగసేసే పురస్కార గ్రహీత రాజేంద్ర సింగ్ కొనియాడడం జరిగిందన్నారు.కేసీఆర్ రైతుబంధు ప్రవేశపెట్టి ప్రపంచంలో మరెక్కడా లేనివిధంగా రైతులకు పెట్టుబడి సాయం అందించడాన్ని ఐక్యరాజ్యసమితితో పాటు సుప్రసిద్ధ వ్యవసాయ శాస్త్రవేత్త ఎం.ఎస్.స్వామినాథన్ తదితరులు ప్రశంసించడాన్ని ఎంపీ వద్దిరాజు ప్రస్తావించారు. దళితబంధు, రైతుబీమా,అమ్మ ఒడి, కేసీఆర్ కిట్ పథకాలు ప్రారంభించారని, కాళోజీ నారాయణరావు వైద్యారోగ్య,కొండా లక్ష్మణ్ బాపూజీ ఉద్యానవన విశ్వవిద్యాలయాలను కేసీఆర్ నెలకొల్పారని తెలిపారు.రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బాబాసాహెబ్ అంబేడ్కర్ పేరిట సచివాలయాన్ని,ఆ సమీపానే 125 అడుగుల ఆయన కాంస్య విగ్రహాన్ని నెలకొల్పారని, అమరవీరుల స్మారక చిహ్నాన్ని గొప్పగా నిర్మించారని ఎంపీ రవిచంద్ర చెప్పారు. కొత్తగా ఏర్పాటు చేసిన జిల్లాల్లో కలెక్టరేట్స్,ఎస్పీ కార్యాలయాలను అధునాతనంగా నిర్మించడమే కాక జిల్లా కేంద్రాలు, ముఖ్యమైన పట్టణాల రోడ్లను అభివృద్ధి చేసి, సెంట్రల్ లైటింగ్ సిస్టం ఏర్పాటు చేశారని వివరించారు. కేసీఆర్ సుపరిపాలన, గొప్పతనాన్ని ఇలాగే చెప్పుకుంటూపోతే చాలా ఉందని,హరితహారం ద్వారా కోట్ల కొద్దీ మొక్కలు నాటించడంతో పచ్చదనం బాగా పెరిగిందని, హన్మకొండలో భారీ టెక్స్ టైల్ పార్క్ నెలకొల్పారని ఎంపీ రవిచంద్ర వివరించారు. యాదగిరిగుట్టను యాదాద్రి దివ్య క్షేత్రంగా అత్యద్భుతంగా తీర్చిదిద్దిన కేసీఆర్ గొప్ప దైవభక్తులని ఆయన కొనియాడారు.రాష్ట్రావతరణ దినోత్సవం సందర్భంగా తెలంగాణ బిడ్డలందరికి ఎంపీ వద్దిరాజు హృదయపూర్వక శుభాకాంక్షలు తెలిపారు.

## ప్రజావాణిలో129 ఫిర్యాదులు స్వీకరణ:జిల్లా కలెక్టర్ సి.నారాయణ రెడ్డి



రంగారెడ్డి, జూన్ 02 (జర్నలిస్ట్ ఫైల్) : ప్రజావాణిలో (129) ఫిర్యాదులు స్వీకరణ ప్రజావాణిలో స్వీకరించిన ఫిర్యాదులను వెంటనే పరిష్కరించాలని,పెండింగులో పెట్టవద్దని జిల్లా కలెక్టర్ సి.నారాయణ రెడ్డి అధికారులను ఆదేశించారు.సోమవారం సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయ సమావేశ మందిరంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమానికి మొత్తం(129) ఫిర్యాదులు అందాయి.జిల్లాలోని వివిధ ప్రాంతాల నుండి వచ్చిన ఫిర్యాదుదారులు తమ సమస్యలను జిల్లా కలెక్టర్ సి.నారాయణ రెడ్డికి విన్నవిస్తూ అర్జీలు సమర్పించారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ..ప్రజా సమస్యల సత్వర పరిష్కారం కోసం నిర్వహిస్తున్న ప్రజావాణి కార్యక్రమంలో ప్రజలు అందించే వినతులను సంబంధిత శాఖల అధికారులు అత్యంత ప్రాధాన్యతతో పరిష్కరించాలని ఆదేశించారు.అర్జీలను పెండింగ్‌లో ఉంచకుండా ఎప్పటికప్పుడు పరిశీలించి,నిర్ణీత గడువులోగా పరిష్కరించాలని సూచించారు.ప్రజల సమస్యల పరిష్కారంలో నిర్లక్ష్యం ప్రదర్శించరాదని అధికారులకు స్పష్టం చేశారు.ప్రజావాణిలో రెవెన్యూ శాఖకు చెందిన (28) దరఖాస్తులు,ఇతర శాఖలకు చెందిన (101) దరఖాస్తులు, మొత్తం (129 )దరఖాస్తులు అందినట్లు అధికారులు తెలిపారు.అనంతరం జిల్లా కలెక్టర్ సి.నారాయణ రెడ్డి మాట్లాడుతూ..ప్రజపాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యక్రమంలో భాగంగా జూన్ 2 నుండి జూన్ 12 వరకు నిర్వహించనున్న "పర్యావరణ పరిరక్షణ మరియు అటవీ అవగాహన వారోత్సవాలను"విజయవంతంగా నిర్వహించాలని అధికారులను ఆదేశించారు.అదే విధంగా జూన్ 2న జరిగే తెలంగాణ రాష్ట్ర అవతరణ దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించేలా అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పని చేయాలని సూచించారు.కార్యక్రమాల్లో పాల్గొనే అధికారులు,సిబ్బంది నిర్ణీత సమయానికి హాజరై తమ బాధ్యతలను సమర్థవంతంగా నిర్వర్తించాలని తెలిపారు."ప్రజల సమస్యల పరిష్కారానికి ప్రజావాణి ఒక సమర్థవంతమైన వేదిక.ప్రజల వినతులపై అధికారులు స్పందనాత్మకంగా వ్యవహరించి త్వరితగతిన పరిష్కారం చూపాలి.అదే విధంగా రాష్ట్ర అవతరణ దినోత్సవం,పర్యావరణ పరిరక్షణ వారోత్సవాలను ప్రజల భాగస్వామ్యంతో విజయవంతం చేయాలి" అని జిల్లా కలెక్టర్ పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో జిల్లా అదనపు కలెక్టర్లు చంద్రారెడ్డి (రెవెన్యూ),కిరణ్మయి (లోకల్ బాడీస్),వివిధ శాఖల జిల్లా అధికారులు,కలెక్టరేట్ సూపరింటెండెంట్లు,సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## దీర్ఘకాల ప్రభుత్వ సేవల అనంతరం ఘన వీడ్కోలు

**ఖమ్మం జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్- 11 మంది ప్రభుత్వ ఉద్యోగుల రిటైర్మెంట్ నేపథ్యంలో నిర్వహించిన కార్యక్రమంలో పాల్గొన్న జిల్లా కలెక్టర్**




ఖమ్మం, (జర్నలిస్ట్ ఫైల్) : సోమవారం కలెక్టరేట్ లో మే 31, 2026 నాటికి పదవి విరమణ పొందిన 11 మంది ఉద్యోగుల పదవీ విరమణ కార్యక్రమం ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్ అదనపు కలెక్టర్ పి. శ్రీనివాస్ రెడ్డి ముఖ్య అతిథులుగా హాజరై ఉద్యోగుల సేవలను కొనియాడారు.గిరిజన సంక్షేమ శాఖలో హెడ్మాస్టర్ గా పనిచేసిన అజ్మీర రాములు, దీటీ శ్రీనివాస్, సోషల్ స్కూల్ అసిస్టెంట్ గా పనిచేసిన శ్యామ్ సుందర్ రావు, కామాటి బోడ బాసు, రెవెన్యూ శాఖలో నాయబ్ తహసిల్దార్ గా పని చేసిన సయ్యద్ రెహ్మాన్, పశుసంవర్ధక శాఖ పరిధిలో లైవ్ స్టాక్ అధికారిగా పని చేసిన ఎన్.రాంబాబు, సత్తుపల్లి ఏరియా ఆసుపత్రిలో ఎంఎన్ఓ గా పని చేసిన రామ చంద్రరావు, పంచాయతీ శాఖలోని పంచాయతీ కార్యదర్శి ఎం.వెంకటరమణ, సర్వే ల్యాండ్ రికార్డ్స్ లో కార్యాలయ సపోర్టుగా పనిచేసిన ఫాతిమా, సెరికల్చర్ విభాగంలో డిప్యూటీ డైరెక్టర్ గా పని చేసిన ముత్యాలు అసిస్టెంట్ డైరెక్టర్ గా పని చేసిన రేణు శర్మ పదవి విరమణ వేడుకలు బాగా జరిగాయి. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్ మాట్లాడుతూ 30 నుంచి 35 సంవత్సరాల పాటు ప్రభుత్వ సేవలు నిర్విరామంగా అందించి నేడు పదవి విరమణ పొందుతున్న అధికారులకు , సిబ్బందికి ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. పదవీ విరమణ తర్వాత వారు జీవితం ప్రశాంతంగా, ఆరోగ్యవంతంగా




జీవించాలని కలెక్టర్ ఆకాంక్షించారు.అనంతరం పదవి విరమణ పొందిన ఉద్యోగులను జిల్లా కలెక్టర్, అదనపు కలెక్టర్ ఘనంగా సన్మానించారు.ఈ కార్యక్రమంలో జిల్లా అధికారులు, పదవి విరమణ పొందిన ఉద్యోగుల కుటుంబ సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.

## మాణిక్యమ్మ గూడా లో ఇందిరమ్మ ఇండ్ల ప్రారంభోత్సవంలో పాల్గొన్న కేఎల్ఆర్, సిహెచ్ యాదయ్య



(జర్నలిస్ట్ ఫైల్) మహేశ్వరం జూన్ 02 : రంగారెడ్డి జిల్లా మహేశ్వరం నియోజకవర్గ మహేశ్వరం మండల కేంద్రంలోని మణికమ్మ గూడ గ్రామంలో.... ఇందిరమ్మ ఇండ్ల ప్రారంభోత్సవంలో మరియు గృహప్రవేశ కార్యక్రమాలను వైభవంగా చేపట్టారు ఈ కార్యక్రమంలో మహేశ్వరం మండలం కిచ్చన్న గారి లక్ష్మారెడ్డి, మరియు మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ పాల్గొన్నారు ఈ సందర్భంగా కేఎల్ఆర్ మాట్లాడుతూ.పేదలకు గూడు కల్పించాలనేదే ప్రభుత్వ ధ్యేయమని తెలిపారు. అర్హులైన ప్రతి ఒక్కరికి ఈ పథకానికి దరఖాస్తు చేసుకోవాలని ప్రభుత్వం నుండి పూర్తి సహాయం అందుతుందని భరోసా ఇచ్చారు. ఈ యొక్క కార్యక్రమంలో మాణిక్యమ్మ గూడా సర్పంచ్ తెలంగాణ పంచాయతీ రాజ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జెన్నపల్లి పద్మకృష్ణ గ్రామ శాఖ అధ్యక్షులు లోకేశ్వర్ రెడ్డి అంకం శ్రీనివాస్ యాదవ్ దాసు దావీద్ మహేందర్ కృష్ణయ్య మండల స్థాయి నాయకులు గ్రామ సర్పంచ్లు వాట్స్అప్లో ముఖ్య కార్యకర్తలు మరియు నాయకులు పెద్ద ఎత్తున ఈ యొక్క కార్యక్రమంలో పాల్గొన్నట్టుగా తెలియజేశారు

## నేల ఆరోగ్యం పై పంట వ్యర్థాలను కాల్చడం వల్ల రైతులకు భారీ నష్టం.

-యాచారం మండలం వ్యవసాయ అధికారి రవినాథ్.



ఇబ్రహీంపట్నం జూన్ 02, (జర్నలిస్ట్ ఫైల్) : యాచారం మండలం పరిధిలోని రైతులకు అవగాహన పద్ధతులు పంట కోత తర్వాత పొలంలో మిగిలిపోయిన వరి, మొక్కజొన్న గడ్డి వంటి పంట అవశేషాలను తగలబెట్టడాన్నే పంట వ్యర్థాలను కాల్చడం అంటారు. ఇది పొలాలను త్వరగా శుభ్రం చేయడానికి ఒక మార్గం అయినప్పటికీ, నేల ఆరోగ్యం మరియు పర్యావరణంపై దీనికి అనేక హానికరమైన ప్రభావాలు ఉన్నాయి. నేల ఆరోగ్యంపై ప్రధాన ప్రభావాలు -సేంద్రియ పదార్థం నష్టం కాల్చడం వల్ల పంట వ్యర్థాలలో ఉండే విలువైన సేంద్రియ కార్బన్ నశిస్తుంది. నేలలోని సేంద్రియ పదార్థం వీటికి అవసరం: నేల సారవంతం నీటి నిలుపుదల మంచి నేల నిర్మాణం సూక్ష్మజీవుల కార్యకలాపాలు ఫలితం: నేల సారహీనంగా మారి, క్షీణతకు ఎక్కువగా గురవుతుంది.-ప్రయోజనకరమైన సూక్ష్మజీవుల నాశనం కాల్చడం వల్ల ఏర్పడే అధిక ఉష్ణోగ్రతలు వీటిని చంపుతాయి: ప్రయోజనకరమైన బ్యాక్టీరియా శిలీంధ్రాలు వానపాములు ఇతర నేల జీవులు ఈ జీవులు వీటికి సహాయపడతాయి: పోషకాల చక్రం నత్రజని స్థాపన సేంద్రియ పదార్థాల విచ్ఛిన్నం ఫలితం: జీవ కార్యకలాపాలు తగ్గి, నేల ఉత్పాదకత క్షీణిస్తుంది.-పోషకాల నష్టం కాల్చడం వల్ల ప్రధాన పోషకాల నష్టం జరుగుతుంది: నత్రజని (ఎన్) ఎక్కువగా వాతావరణంలోకి ఆవిరైపోతుంది గంధకం (ఎస్) ? వాయువుల రూపంలో నష్టపోతుంది ఫాస్ఫరస్ (పి) మరియు పొటాషియం (కె) పాక్షికంగా నష్టపోతాయి దీనివల్ల రసాయన ఎరువులపై ఆధారపడటం పెరుగుతుంది.-నేల నిర్మాణంలో క్షీణత పదేపదే కాల్చడం వల్ల: నేల కణాల కలయిక తగ్గుతుంది నేల గట్టిగా, కుదించుకుపోతుంది కోత ప్రమాదం పెరుగుతుంది ఫలితం: వేర్ల పెరుగుదల సరిగా ఉండదు మరియు నీరు భూమిలోకి ఇంకడం తగ్గుతుంది.-తేమ నిలుపుదల తగ్గడం పంట అవశేషాలు సాధారణంగా మల్చ్‌గా పనిచేసి తేమను నిల్వ చేస్తాయి. కాల్చిన తర్వాత: నేల త్వరగా ఆరిపోతుంది బాష్పీభవనం పెరుగుతుంది నీటిపారుదల అవసరం పెరుగుతుంది.-నేల ఉష్ణోగ్రత పెరగడం కాల్చిన పొలాలలో తరచుగా ఇవి జరుగుతాయి: ఆకస్మిక ఉష్ణోగ్రత హెచ్చుతగ్గులు నేల ఉపరితల జీవావరణానికి నష్టం ఇది విత్తనాల మొలక మరియు వేర్ల అభివృద్ధిపై ప్రతికూల ప్రభావం చూపుతుంది. పర్యావరణ ప్రభావాలు పంట గడ్డి కాల్చడం వల్ల ఈ క్రిందివి కూడా కలుగుతాయి: వాయు కాలుష్యం పొగమంచు ఏర్పడటం గ్రీన్‌హౌస్ వాయు ఉద్గారాలు మానవ శ్వాసకోశ సమస్యలు విడుదలయ్యే ప్రధాన వాయువులు: కార్బన్ డయాక్సైడ్ (సి ఓ2) మీథేన్ (సి హెచ్4) నైట్రస్ ఆక్సైడ్ (ఎన్ 2 ఓ) పంట గడ్డి కాల్చడానికి మెరుగైన ప్రత్యామ్నాయాలు సుస్థిరమైన పంట అవశేషాల నిర్వహణ పద్ధతులు మల్చింగ్ పంట అవశేషాలను పొలం ఉపరితలంపైనే వదిలివేయండి. కంపోస్టింగ్ పంట అవశేషాలను సేంద్రియ ఎరువుగా మార్చండి. మట్టిలో కలపడం సేంద్రియ పదార్థాన్ని మెరుగుపరచడానికి పంట అవశేషాలను మట్టిలో కలపండి. హ్యాపీ సీడర్ / సూపర్ సీడర్ వాడకం పంట అవశేషాలను కాల్చకుండా విత్తనాలు వేయడానికి అనుమతిస్తుంది. బయో-డీకంపోజర్ స్ప్రేలు పంట అవశేషాల కుళ్ళిపోవడాన్ని సహజంగా వేగవంతం చేస్తాయి. ముగింపు పంట గడ్డి కాల్చడం స్వల్పకాలంలో సమయం మరియు శ్రమను ఆదా చేసినప్పటికీ, ఇది నేల సారవంతాన్ని, సూక్ష్మజీవుల జీవితాన్ని మరియు దీర్ఘకాలిక వ్యవసాయ సుస్థిరతను తీవ్రంగా దెబ్బతీస్తుంది.పంట అవశేషాల నిర్వహణ పద్ధతులను పాటించడం వల్ల నేల ఆరోగ్యం, పంట ఉత్పాదకత మరియు పర్యావరణ నాణ్యత మెరుగుపడతాయి.అలాగే పంట అవశేషాలు కాల్చడం చట్ట ప్రకారం నేరం.

## ఆర్యవైశ్యుల అభివృద్ధిలో యువతే కీలకం కావాలి



○ తాడిశెట్టి మురళీమోహన్

**గుంటూరు (జర్నలిస్ట్ ఫైల్):** ఆర్యవైశ్యులు అన్ని రంగాల్లో సంపూర్ణ అభివృద్ధి సాధించడంలో యువత ముఖ్య భూమిక పోషించాలని రాష్ట్ర టిడిపి కార్యనిర్వాహక కార్యదర్శి తాడిశెట్టి మురళీమోహన్ సూచించారు. మంగళవారం ఉదయం వికాస్ నగర్ లోని ఒక అతిథి గృహంలో ఆంధ్రప్రదేశ్ ఆర్యవైశ్య యువజన సంఘం అధ్యక్షునిగా కండే రాజేష్ నియమితులైన సందర్భంగా ఆర్యవైశ్య సంఘాలు, ఇవివి యువ కళావాహిని సంయుక్త ఆధ్వర్యంలో జరిగిన అభినందన కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. ఈ కార్యక్రమానికి ఈవీవీ యువ కళావాహిని అధ్యక్షుడు వెచ్చా కృష్ణమూర్తి అధ్యక్షత వహించారు. తాడిశెట్టి మురళి మోహన్ తన ప్రసంగాన్ని కొనసాగిస్తూ.. రాజేష్ భవిష్యత్తులో మరిన్ని ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ఆకాంక్షించారు. ఏపీ ఆర్యవైశ్య యువజన సంఘం అధ్యక్షునిగా నియమితులైన కండే రాజేష్ మాట్లాడుతూ.. ఆర్యవైశ్యుల అభ్యున్నతే తన ధ్యేయమన్నారు. ఇవివి యువ వాహిని అధ్యక్షుడు వెచ్చా కృష్ణమూర్తి మాట్లాడుతూ..ఆర్యవైశ్యుల అభివృద్ధికి రాజేష్ ఆయువుపట్టుగా నిలవాలని సూచించారు. అనంతరం తాడిశెట్టి మురళీమోహన్ చేతుల మీదగా ఆర్యవైశ్య సంఘాలు కండే రాజేష్ ను ఘనంగా సత్కరించాయి. తొలుత ఆర్యవైశ్య సంఘాల ఆధ్వర్యంలో భారీ బైక్ ర్యాలీ నిర్వహించారు. పొట్టి శ్రీరాములు విగ్రహానికి పూలమాలలు వేసారు. ఆర్యవైశ్యుల ఐక్యత వర్ధిల్లాలంటూ నినాదాలు చేసారు. ఈ కార్యక్రమంలో ఆర్యవైశ్య సంఘాల నాయకులు మిట్టపల్లి రాజు, కాంతారావు, నాగేందర్ తదితరులు పాల్గొన్నారు.

## జూన్ 7 నుంచి 20వ తేదీ వరకు యోగా కార్యక్రమాలు



○ 21న అంతర్జాతీయ యోగా దినోత్సవ వేడుకలు

**గుంటూరు (జర్నలిస్ట్ ఫైల్) :** అంతర్జాతీయ యోగా దినోత్సవ వేడుకలను 'యోగాంధ్ర - 2026' పేరుతో నిర్వహించేందుకు అవసరమైన అన్ని ఏర్పాట్లు చేస్తున్నామని జిల్లా కలెక్టర్ సి. యం. సాయి కాంత్ వర్మ తెలిపారు. ఈ మేరకు మంగళవారం ఒక ప్రకటన విడుదల చేశారు. 'యోగా ఫర్ హెల్తీ ఏజింగ్ (శీస్త్రుః టశీతీ ఎముశ్రీష్ట్రం ాూస్త్రఅఅస్త్ర) నినాదంతో 12వ అంతర్జాతీయ యోగా దినోత్సవ వేడుకలు జరుగుతాయని చెప్పారు. యోగా ప్రతి ఒక్కరి దైనందిన జీవితంలో భాగం చేయడమే లక్ష్యంగా అవగాహన కార్యక్రమాలు చేపడతామని చెప్పారు. అన్ని రంగాల్లో ఉన్నవారిని యోగాంధ్ర కార్యక్రమాల్లో భాగస్వాములను చేస్తామన్నారు. ఈ నెల్ల 7 నుంచి 20వ తేదీ వరకు వివిధ ప్రాంతాల్లో యోగా కార్యక్రమాలు చేపట్టి ప్రచారం చేయడం జరుగుతుందని తెలిపారు. జూన్ 21న రాష్ట్ర స్థాయి యోగా దినోత్సవ వేడుకలు అమరావతిలో జరుగుతాయన్నారు. జిల్లాలో ఉండవల్లి గుహలు, మంగళగిరి శ్రీ లక్ష్మీనరసింహస్వామి ఆలయం వంటి ప్రాంతాల్లో యోగా కార్యక్రమాలు నిర్వహిస్తామని అన్నారు. జూన్ 7 నుంచి 9వ తేదీ వరకు గ్రామ/వార్డు స్థాయిలోనూ, జూన్ 10 నుంచి 12వ తేదీ వరకు మండల స్థాయిలోనూ, జూన్ 14 నుంచి 16వ తేదీ వరకు జిల్లా స్థాయిలో పోటీలు ఉంటాయని వివరించారు. జూన్ 18 నుంచి 20వ తేదీ వరకు రాష్ట్ర స్థాయిలో పోటీలు జరుగుతాయని తెలిపారు.

వ్యక్తిగత విభాగం, బృంద విభాగం, జ్ఞాన ఆధారిత యోగా పోటీలు నిర్వహించడం జరుగుతుందని చెప్పారు. వ్యక్తిగత విభాగంలో ఆసనాల ప్రదర్శన, ప్రాణాయామం., జ్ఞాన ఆధారిత పోటీలలో యోగా క్విజ్, యోగా వ్యాసరచన, యోగా నినాదాల పోటీలు ఉంటాయన్నారు. గ్రామ/వార్డు సచివాలయాల పరిధిలోని పార్కులు, పాఠశాలలు, క్రీడా ప్రాంగణాల్లో కార్యక్రమాలు జరుగుతాయన్నారు.

## డా.బి.ఆర్. అంబేద్కర్ గురుకులంలో చేరెందుకు స్పాట్ అడ్మిషన్లు



**బ్రహ్మంగారిమఠం(జర్నలిస్ట్ ఫైల్ ):** డాక్టర్ బి. ఆర్ అంబేద్కర్ గురుకుల పాఠశాల మరియు కళాశాలలో ఐదవ తరగతి నుంచి ఇంటర్ మొదటి సంవత్సరంలో చేరే విద్యార్థులకు ఈనెల 8వ తారీఖున కడప లోని చిన్నచౌక్ లో ఉన్నటువంటి డాక్టర్ బి. ఆర్ అంబేద్కర్ బాలికల కళాశాల యందు స్పాట్లోనే అడ్మిషన్లు నిర్వహించడం జరుగుతుందని డీసీ శీ ఉదయశ్రీ తెలియజేశారు. విద్యార్థులు అర్హత పరీక్ష రాసినా రాయక పోయినా కూడా ఈ కౌన్సిలింగ్ కు హాజరై చేరవచ్చునారు. ఈ కౌన్సిలింగ్ సోమవారం ఉదయం 10 గంటలకు 5 వ తరగతి నుంచి 10 వ తరగతి వరకు అలాగే మధ్యాహ్నం 3 గంటల నుంచి ఇంటర్ విద్యార్థులకు కౌన్సిలింగ్ జరుగుతుందన్నారు. బి. మఠం మండలంలో ఉన్నటువంటి రెండు పాఠశాలలకు అనగా పాత, కొత్త(తోట్లపల్లె) పాఠశాలలో చేరుటకు కూడా ఈ కౌన్సిలింగ్ కు హాజరు కావాలన్నారు. ఈ కౌన్సిలింగ్ కు హాజరయ్యే విద్యార్థుల తల్లిదండ్రులు క్యాస్ట్ సర్టిఫికెట్, ఎస్. ఎస్. సి సర్టిఫికెట్, ఆధార్ కార్డు, టిసి వెంట తీసుకుని కడపలోని చిన్న చౌక్ లో ఉన్న డాక్టర్ అంబేద్కర్ గురుకుల పాఠశాలలో నిర్వహించు కౌన్సిలింగ్ కు వెళ్లాలని డి సి ఓ ఉదయశ్రీ ఓ ప్రకటనలో తెలిపారు.

## యువతకు ఉద్యోగాలు కల్పించటమే లక్ష్యంగా కూటమి ప్రభుత్వం కృషి : ఎమ్మెల్యే గళ్ళా మాధవి

○ గుంటూరు పశ్చిమ నియోజకవర్గంలో మెగా జాబ్ మేళా విజయవంతం

○ 742 మంది హాజరు, 365 మందికి ఉద్యోగ అవకాశాలు

**గుంటూరు (జర్నలిస్ట్ ఫైల్) :** ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం నిరుద్యోగ యువతకు ఉపాధి అవకాశాలు కల్పించేందుకు నిరంతరం కృషి చేస్తోందని గుంటూరు పశ్చిమ నియోజకవర్గ ఎమ్మెల్యే గళ్ళా మాధవి తెలిపారు. యువతే రాష్ట్ర భవిష్యత్తు అని, వారికి ఉద్యోగ అవకాశాలు కల్పించడమే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని గళ్ళా మాధవి పేర్కొన్నారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ (APSSDC) సహకారంతో, ఎమ్మెల్యే గళ్ళా మాధవి ఆధ్వర్యంలో మంగళవారం గుంటూరులోని హిందూ ఫార్మసీ కళాశాల, అమరావతి రోడ్‌లో మెగా జాబ్ మేళా ఘనంగా నిర్వహించారు.

ఈ మెగా జాబ్ మేళాకు మొత్తం 742 మంది నిరుద్యోగ యువతీ యువకులు హాజరుకాగా, ప్రాథమిక ఎంపికల్లో 365 మంది అభ్యర్థులు ఉద్యోగాలకు ఎంపికయ్యారు.

ఈ సందర్భంగా జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి కె.



సంజీవరావు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం నిరుద్యోగ సమస్య నిర్మూలనకు ప్రత్యేక చర్యలు చేపడుతోందని, అందులో భాగంగా ఉద్యోగ మేళాల ద్వారా యువతకు ఉపాధి అవకాశాలు కల్పిస్తున్నట్లు తెలిపారు. ఈ మెగా జాబ్ మేళాలో ఇంకుక్స్ ఏఐ ప్రైవేట్ లిమిటెడ్, క్లౌడ్ మెల్లో టెక్నాలజీస్ ఎల్‌ఎల్‌పి, మాల్టెక్ సొల్యూషన్స్ ప్రైవేట్ లిమిటెడ్, ఎఫ్ట్రానిక్స్ సిస్టమ్స్ ప్రైవేట్ లిమిటెడ్, బుక్ ఎక్స్‌పర్ట్ ప్రైవేట్ లిమిటెడ్, ప్రైమారియా హెల్త్ కేర్, డ్రోగో డ్రోన్స్ ప్రైవేట్ లిమిటెడ్, అపెక్స్ సాఫ్ట్‌వేర్ సొల్యూషన్స్, స్కిల్జా గ్లోబల్ ప్రైవేట్ లిమిటెడ్, ఫ్యూచర్ ఐటి సొల్యూషన్స్ లిమిటెడ్ సహా 30కు పైగా ప్రముఖ కంపెనీలు పాల్గొన్నాయని తెలిపారు. మొత్తం 1,100 ఉద్యోగ అవకాశాలు అందుబాటులో ఉంచగా, వివిధ విద్యార్హతలు కలిగిన యువత పెద్ద సంఖ్యలో హాజరయ్యారని చెప్పారు.

హిందూ ఫార్మసీ కళాశాల చైర్మన్ జూపూడి రంగరాజు మాట్లాడుతూ ప్రభుత్వ ఆధ్వర్యంలో ఇలాంటి ఉపాధి కార్యక్రమాలకు తమ కళాశాల ఎల్లప్పుడూ సహకరిస్తుందని తెలిపారు. లిగుంటూరు పశ్చిమ నియోజకవర్గ మహిళా అధ్యక్షురాలు ముత్తినేని శివలీల, టీడీపీ పార్లమెంట్ సెక్రటరీ గంటా మౌళిక మాట్లాడుతూ... యువత ఈ అవకాశాలను సద్వినియోగం చేసుకుని జీవితంలో ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ఆకాంక్షించారు.

జిల్లా ఉపాధి అధికారి అభినవ్ మాట్లాడుతూ యువతకు మరింత ఉపాధి అవకాశాలు కల్పించాలనే ఉద్దేశంతో ప్రభుత్వం నిరంతరం ఉద్యోగ మేళాలు నిర్వహిస్తోందని తెలిపారు. లిమెప్మా ప్రాజెక్ట్ డైరెక్టర్ విజయలక్ష్మి మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వ మార్గదర్శకత్వంలో ప్రతి నియోజకవర్గంలో ఉద్యోగ మేళాలు నిర్వహిస్తున్నామని, నిరుద్యోగ యువత ఈ అవకాశాలను వినియోగించుకుని తమ లక్ష్యాలను సాధించాలని సూచించారు.

ఈ కార్యక్రమంలో హిందూ ఫార్మసీ కళాశాల చైర్మన్ జూపూడి రంగరాజు, డివిజన్ అధ్యక్షులు తెలగతోటి సుధీర్, గుంటూరు పశ్చిమ నియోజకవర్గ మహిళా అధ్యక్షురాలు ముత్తినేని శివలీల, పార్లమెంట్ కార్యదర్శి గంట మౌనిక, మెప్మా ప్రాజెక్ట్ డైరెక్టర్ విజయలక్ష్మి, జిల్లా ఉపాధి అధికారి అభినవ్, సీడాప్ జెడిఎం రాంబాబు, జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి కె. సంజీవరావు, జిల్లా ప్లేస్‌మెంట్ అధికారి పి. ఈశ్వర్‌రావు, కోఆర్డినేటర్లు తదితరులు పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

## ప్రభుత్వ వసతిగృహాలలో దోమలమందు పిచికారీ

**తెనాలి(జర్నలిస్ట్ ఫైల్) :** గుంటూరు జిల్లా మలేరియా అధికారి తలాటం మురళీకృష్ణ సుబ్బరాయణం ఆదేశాల ప్రకారశీ మలేరియా విభాగం ఆధ్వర్యంలో పట్టణంలో గల వివిధ ప్రభుత్వ వసతి గృహాలలో దోమల నివారణకై ముందు జాగ్రత్త చర్యగా ఆల్ఫా సైపర్ మిత్రిన్ మందును పిచికారీ చేయించడం జరిగిందని మలేరియా సబ్ యూనిట్ అధికారి శ్రీకంఠ ఉమాకాంత్ యుయల్ బి ఆరోగ్య విస్తరణాధికారి అందె బాలచంద్ర మౌళి తెలిపారు. ప్రస్తుతము ప్రభుత్వ పాఠశాలలకు, వసతి గృహాలకు సెలవులు కావున ప్రభుత్వ పాఠశాలలు తిరిగి ప్రారంభమయ్యే లోపల పూర్తి చేయవలెనన్న ప్రభుత్వ ఆదేశాలను అనుసరించి కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు చెప్పారు. పలు హాస్టల్ లోని వార్డెన్లు మలేరియా పర్యవేక్షకులు దీపాల శ్రీనివాసరావు దాసరి శివనాగమల్లేశ్వరరావు ఆరోగ్య కార్యకర్తలు ఆలా వేణుగోపాల్ , షేక్ నవీద్ సంకశరత్ బాబు, దీపాల



శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు. కార్యక్రమంలో సహకరించిన వసతి గృహాల వార్డెన్లకు మలేరియా శాఖ తరపున కృతజ్ఞతలు తెలియజేశారు. మందు పిచికారీ..

గుంటూరుజిల్లా మలేరియా అధికారి తలాటం మురళీకృష్ణ సుబ్బరాయణం ఆదేశాల ప్రకారశీ మలేరియా విభాగం ఆధ్వర్యంలో మంగళవారం పట్టణంలో గల వివిధ ప్రభుత్వ వసతి గృహాలలో దోమల నివారణకై ముందు జాగ్రత్త చర్యగా ఆల్ఫా సైపర్ మిత్రిన్ మందును పిచికారీ చేయించడం జరిగిందని మలేరియా సబ్ యూనిట్ అధికారి శ్రీకంఠ ఉమాకాంత్ యూ ఎల్ బి ఆరోగ్య విస్తరణ అధికారి అందే బాలచంద్రం వల్లి తెలిపారు. ప్రస్తుతము ప్రభుత్వ పాఠశాలలకు, వసతి గృహాలకు సెలవులు కావున ప్రభుత్వ పాఠశాలలు తిరిగి ప్రారంభమయ్యే లోపల కార్యక్రమాన్ని పూర్తి చేయవలెనన్న ప్రభుత్వ ఆదేశాలను అనుసరించి కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో సంబంధిత హాస్టల్ లో వార్డెన్లు మలేరియా పర్యవేక్షకులు దీపాల శ్రీనివాసరావు దాసరి శివనాగమల్లేశ్వరరావు ఆరోగ్య కార్యకర్తలు ఆలా వేణుగోపాల్ , షేక్ నవీద్ సంకశరత్ బాబు, దీపాల శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు. కార్యక్రమంలో సహకరించిన వసతి గృహాల వార్డెన్లకు మలేరియా శాఖ తరపున కృతజ్ఞతలు తెలియజేశారు.

## దళిత క్రైస్తవులకు ఎస్సీ హోదా కల్పించాలి : ఎస్సీ ఎస్టీ బీసీ మైనారిటీ ఐక్యవేదిక

**తెనాలి(జర్నలిస్ట్ ఫైల్ ):** స్థానిక బాలాజీ రావు పేట లోని ఎస్సీ ఎస్టీ బీసీ మైనార్టీ వేదిక సేవ టెస్ట్ కేంద్ర కార్యాలయం నందు ఈరోజు దళిత క్రైస్తవుల కు ఎస్సీ హోదా కల్పించాలని కోరుతూ విలేకరుల సమావేశం ఏర్పాటు చేశారు. కేంద్ర ప్రభుత్వం ఏర్పాటు చేసినటువంటి జస్టిస్ కేజీ బాలకృష్ణన్ కమిటీ వారికి ఐక్యవేదిక ఆధ్వర్యంలో దళిత క్రైస్తవులు పడుతున్నటువంటి సాధక బాధలను వివరించారు కమిషన్కు సంబంధించినటువంటి ఈమెయిల్ ద్వారా ప్రతి ఒక్కరు కూడా వారి యొక్క విన్నపాలను తెలియజేయవలసిందిగా ఐక్యవేదిక సభ్యుల కోరినారు. హైకోర్టు న్యాయవాది పెరికల



డానియల్ జై భీమ్ ఫెడరేషన్ అధ్యక్షులు కట్టివరపు దేవానంద్ దళిత నాయకులు ఒంపుగాని గురవయ్య న్యాయవాది పిల్లి ప్రేమ రాజ్ పిరాజకుమార్ పరస రాజు గోల సందీప్ ఫేక్ దుబాయ్ బాబు కుర్రా యశ్వంత్ యాదవ్ పాల్గొన్నారు. ఐక్యవేదిక అధ్యక్షులు అకిదాసు కిరణ్ కుమార్ కార్యక్రమాన్ని పరిరక్షించారు.

## జేఈఈ అడ్వాన్స్‌డ్‌లో జెండా పాతిన అంకిరెడ్డిపాలెం జూనియర్ కళాశాల

○ ప్రతిభ చాటిన పద్మావతి

○ అభినందించిన ఎమ్మెల్సీ లేళ్ళ అప్పిరెడ్డి

**గుంటూరు (జర్నలిస్ట్ ఫైల్) :** మట్టిలో మాణిక్యాలను వెలుగులోకి తెచ్చేందుకే అంకిరెడ్డిపాలెంలో జూనియర్ కళాశాల ఏర్పాటు చేసినట్లు శాసనమండలి సభ్యులు, స్ఫూర్తి ఫౌండేషన్ వ్యవస్థాపకులు లేళ్ళ అప్పిరెడ్డి వెల్లడించారు. పేదరికం కారణంగా ప్రతిభ గల విద్యార్థులు చదువుకు దూరం కాకూడదన్న సంకల్పంతో కళాశాల అభివృద్ధికి కృషి చేస్తున్నట్లు చెప్పారు. జాతీయ స్థాయి జేఈఈ అడ్వాన్స్‌లో గుంటూరు రూరల్ మండలం అంకిరెడ్డిపాలెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్లస్ జూనియర్ కళాశాల జెండా పాతింది. కళాశాల విద్యార్థిని బాణావత్ పద్మావతి జాతీయ స్థాయిలో ఉత్తమ ప్రతిభ కనబరిచి ఐఐటీ సంస్థల్లో ప్రవేశానికి అర్హత సాధించింది. ఈ నేపథ్యంలో బాణావత్ పద్మావతిని ఎమ్మెల్సీ లేళ్ళ అప్పిరెడ్డి ఘనంగా సత్కరించారు.

అనంతరం లేళ్ల అప్పిరెడ్డి మాట్లాడుతూ, పేద విద్యార్థులకు విద్యే విలువైన ఆస్తి అని వ్యాఖ్యానించారు. వారు విద్యావంతులు అవడం ద్వారానే సమాజంలో పేదరికం సమూలంగా సమసిపోతుందని స్పష్టం చేశారు. ఈ వాస్తవం



తెలుసు కనుకే తమ స్వగ్రామమైన అంకిరెడ్డిపాలెంలో పేద విద్యార్థుల చదువు కోసం ప్రత్యేక కాలేజీ ఏర్పాటుకు కృషి చేసి దాతల సహకారంతో దాని అభివృద్ధికి కట్టుబడి పని చేస్తున్నట్లు చెప్పారు. కళాశాలలో వారు చదువుకునేందుకు అవసరమైన అన్ని సౌకర్యాలు కల్పించడంతో పాటు పేద విద్యార్థులు ఉన్నత చదువులు చదివేలా ప్రోత్సహకాలు అందిస్తున్నామని వివరించారు.

తమ కష్టానికి తగిన ప్రతిఫలం జేఈఈ అడ్వాన్స్‌లో మెరిసిన పద్మావతి రూపంలో లభించినట్లు లేళ్ళ అప్పిరెడ్డి వెల్లడించారు. పేదరికంలో పుట్టి ఉన్న సౌకర్యాలను సద్వినియోగం చేసుకోవడం ద్వారా జాతీయ స్థాయిలో అత్యుత్తమంగా రాణించిన పద్మావతిని ఆయన ప్రత్యేకంగా అభినందించారు. పేద విద్యార్థులంతా ఆమెను స్ఫూర్తిగా తీసుకుని ఉన్నత శిఖరాలు అధిరోహించాలని లేళ్ళ అప్పిరెడ్డి పిలుపునిచ్చారు.

కళాశాల ప్రిన్సిపాల్ రామచంద్రరావు, విశ్రాంత అధ్యాపకులు సంజీవరెడ్డి, వీర గంగాధరరెడ్డి మాట్లాడుతూ, తమ పిల్లలను చదివించడాన్ని ప్రతి ఒక్క తల్లిదండ్రులు బాధ్యతగా భావించాలని కోరారు. అప్పుడే ప్రతి ఒక్కరూ ఉత్తమ విద్యావంతులై ఉన్నత స్థానాలు అధిరోహిస్తారని తెలిపారు. కళాశాలలో నిర్వహించే ప్రతి పరీక్షకు నిపుణులైన అధ్యాపకులు అందుబాటులో ఉండటం వల్ల విద్యార్థులు ఇంటర్మీడియట్ ఫలితాల్లో కూడా మెరుగైన ఫలితాలు సాధిస్తున్నట్లు చెప్పారు.

## ఘనంగా కళ్ళం పానకాల రెడ్డి ఐదో వర్ధంతి



**మంగళగిరి (జర్నలిస్ట్ ఫైల్):** ప్రజా సమస్యలపై పోరాటం చేసిన వ్యక్తి కళ్ళం పానకాల రెడ్డి అని సిపిఐ జాతీయ నాయకులు కె నారాయణ అన్నారు. మంగళవారం తాడేపల్లి మండలం పెనుమాక గ్రామంలో గ్రామ మాజీ సర్పంచ్ కళ్ళం పానకాల రెడ్డి ఐదో వర్ధంతి కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. సెంటర్ లో పానకాల రెడ్డి విగ్రహానికి పూలమాలలు వేసి నివాళ్లుర్పించారు. ఈ సందర్భంగా నారాయణ మాట్లాడుతూ గుంటూరులో ఇద్దరం కలసి చదువుకునే రోజులలో పానకాలు అని పిలిచేవారిమని అన్నారు. పానకాల రెడ్డి విద్యార్థి ఉద్యమాలు, ప్రజా సమస్యల పట్ల ఎంతో చురుకుగా వ్యవహరించేవారని గుర్తుచేశారు. తాను, పానకాల రెడ్డి, ఆళ్ళ నాగేశ్వరరావు, వెంకటప్పయ్య కలిసి అనేక ప్రజా సమస్యలపై పోరాటాలు సాగించామని పాత జ్ఞాపకాలను నెమరువేసుకున్నారు. కళ్ళం పానకాల రెడ్డి ఆశయాలను ఆయన కుమారుడు రాజశేఖర్ రెడ్డి ముందుకు తీసుకెళ్లాలని, తండ్రి మాదిరిగానే ప్రజా సమస్యల పరిష్కారంలో చురుకుగా పాల్గొనాలని నారాయణ ఆకాంక్షించారు. కార్యక్రమంలో ఏపీ రాష్ట్ర వ్యవసాయ మిషన్ వైస్ చైర్మన్ మర్రెడ్డి శ్రీనివాసరెడ్డి, తెలుగు రైతు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బొంతు శివసాంబి రెడ్డి, టీడీపీ మంగళగిరి నియోజకవర్గ పరిశీలకులు ముమ్మిడి సత్యనారాయణ, సీపీఐ జాతీయ కార్యవర్గ సభ్యులు ముప్పాల నాగేశ్వరరావు, సిపిఐ మంగళగిరి నియోజకవర్గ కార్యదర్శి చిన్ని తిరుపతయ్య, సీపీఎం నాయకుడు దొంతిరెడ్డి వెంకటరెడ్డి, టీడీపీ నాయకులు జంగాల సాంబశివరావు, పాలెపు రామారావు, మండల పార్టీ అధ్యక్షుడు దాసరి కృష్ణ, తెలుగు యువత ఉపాధ్యక్షుడు జంగాల వెంకటేష్, పెనుమాక సొసైటీ అధ్యక్షుడు కళ్ళం శివ గోవింద రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## పల్స్ పోలియో ప్రోగ్రాంను పగడ్బందీగా నిర్వహించాలి




○ సిబ్బందికి సూచనలిచ్చిన సిహెచ్‌ఓ సాంబశివారెడ్డి

**బ్రహ్మంగారిమఠం(జర్నలిస్ట్ ఫైల్ ):** ఈనెల 28వ తారీఖున నిర్వహించే పల్స్ పోలియో ప్రోగ్రాం ను పగడ్బందీగా నిర్వహించాలని సిహెచ్ఓ సాంబశివారెడ్డి వైద్య సిబ్బందికి సూచించారు. మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో మంగళవారం ఆశ డే ను నిర్వహించడం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వైద్య సిబ్బంది ఈనెల 28వ తేదీన జరిగే పల్స్ పోలియో ప్రోగ్రాం లో అందరూ పాల్గొని 0 నుండి 5 ఏళ్ల పిల్లలందరికీ తప్పనిసరిగా పోలియో చుక్కలు వేయాలని చెప్పారు. అలాగే జూన్ 1 నుండి 30 వరకు మలేరియా వ్యతిరేక మాసోత్సవాలు నిర్వహించాలని మరియు మలేరియా రహిత సమాజంగా తీర్చిదిద్దాలని వైద్య సిబ్బందికి తెలియజేయడం జరిగింది. ప్రతి గ్రామ మరియు పట్టణ ప్రాంతాల్లో ఉండే ప్రజలను మలేరియాపై అవగాహన కల్పిస్తూ ఉండాలని ఆయన సిబ్బందికి సూచించారు. ఇంటి పరిసర ప్రాంతాలలో చుట్టుపక్కల నీరు నిల్వ ఉన్న ప్రదేశాలను గుర్తించి వాటిని తొలగించే ఏర్పాట్లను చేయాలన్నారు. ఆశా వర్కర్లు వారి గ్రామాలలో జ్వరం వచ్చిన వారి సమాచారాన్ని సంబంధిత ఏఎన్ఎంకు ఇచ్చి రోగిని ఆసుపత్రికి వచ్చే విధంగా చర్యలు చేపట్టి రక్త పరీక్షలు చేపించాలన్నారు. వ్యాధి నిర్ధారణ అయిన వెంటనే మండల సూపర్వైజర్ మగ ఆరోగ్య కార్యకర్త ద్వారా ఉచితంగా వ్యాధిగ్రస్తులకు ఇంటి దగ్గరే రాడికల్ ట్రీట్మెంట్ ఇవ్వడం జరుగుతుందన్నారు.

దోమల నివారణకు దోమతెరలు వాడాలని పరిసరాల పరిశుభ్రత, వ్యక్తిగత పరిశుభ్రత పాటించే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమములో ఇంచార్జ్ డాక్టర్ సాయి తేజ, సూపర్వైజర్ పుష్పరాజ్ హెల్త్ అసిస్టెంట్ మాధవ ఏం ఎల్ హెచ్ పి లు ఏఎన్ఎంలు ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

## ఈనెల 15న మంత్రి మనోహర్ కార్యాలయం ముట్టడి : పసుపు రైతులు పిలుపు

**తెనాలి(జర్నలిస్ట్ ఫైల్) :** రెండున్నర సంవత్సరాలు గడుస్తున్నా గాని దుగ్గిరాల శుభమహేశ్వరి కోల్డ్ స్టోరేజ్ అగ్ని బాధ్యత పసుపు రైతులకు ప్రభుత్వం ఇచ్చిన హామీ మేరకు క్వింటాల్కు 7000 రూపాయలు పరిహారం ఇప్పించటంలో ప్రభుత్వ వైఫల్యానికి నిరసనగా ఈనెల 8వ తేదీన దుగ్గిరాల వ్యవసాయ మార్కెట్ యార్డు ముట్టడికి మంగళవారం స్థానిక కొత్తపేట ఎన్జీవోస్ కళ్యాణ మండపంలో ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన రౌండ్ టేబుల్ సమావేశం ఏకగ్రీవంగా తీర్మానించింది. ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షులు ములకా శివ సాంబిరెడ్డి అధ్యక్షత వహించారు. పసుపు రైతులు సంఘం రాష్ట్ర కార్యదర్శి జొన్న శివశంకరరావు మాట్లాడుతూ శుభం మహేశ్వరి కోల్డ్ స్టోరేజీ అగ్ని ప్రమాదం జరిగినప్పుడు క్వింటాల్ పసుపు ధర 13400 ఉందన్నారు. కానీ మంత్రి అచ్చం నాయుడుతో జరిగిన ఒప్పందంలో క్వింటాల్కు 7000 ఇప్పించాలని కోరిన గాని రెండున్నర సంవత్సరాలు గడుస్తున్నా గాని ప్రభుత్వం పసుపు రైతులకు సహాయం



చేయడంలో అలసత్వం వహిస్తుందని ఆయన విమర్శించారు. ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం దుగ్గిరాల తహసిల్దార్ కార్యాలయం వద్ద దీక్షలు సందర్భంగా వచ్చిన ప్రస్తుత కేంద్ర మంత్రి డాక్టర్ పెమసాని రాబోయే మూడు నెలలు ఆగండి తమ ప్రభుత్వం వస్తుంది అని పేర్కొన్నారు. రెండు సంవత్సరాల నాలుగు నెలలు గడుస్తున్నా గాని ఇంతవరకు పసుపు రైతులకు అరకొర డబ్బులు ఇవ్వటమే గాని పూర్తిస్థాయిలో పరిహారం ఇవ్వకపోవడంలో గల ఆంతర్యం ఏమిటని ఆయన ప్రశ్నించారు. కేంద్రమంత్రి కార్యాలయం నుండి 5వేలకు సంతకాలు పెట్టి భవిష్యత్తులో పసుపు రైతులు వారి వారసులు ఇటువంటి లావాదేవీలు జరపరాదని సంతకం పెట్టమని చెప్పటం ఏమిటని ఆయన ప్రశ్నించారు. మూడు రైతు వ్యతిరేక నల్ల చట్టాలు తెచ్చిన మోడీ ప్రభుత్వం రైతుల ఉద్యమానికి తలవంచి పార్లమెంట్ లో క్షమాపణ చెప్పి బిల్లును ఉపసంహరించుకుందని గుర్తు చేశారు. పసుపు రైతులు ఆందోళన చేయకుండా ఏ ప్రభుత్వం రైతులకు న్యాయం చేయదని ఆయన తెలిపారు. ఈనెల 8వ తేదీన దుగ్గిరాల వ్యవసాయ మార్కెట్ యార్డు ముట్టడి 15వ తేదీన వ్యవసాయ శాఖ మంత్రి క్యాంపు కార్యాలయం వద్ద ధర్నా లో రైతులు అధిక సంఖ్యలో పాల్గొనాలని ఆయన పిలుపునిచ్చారు. సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు కొల్లిపర బాబు ప్రసాద్ మాట్లాడుతూ శుభమహేశ్వరి కోల్డ్ స్టోరేజీ యజమాని నిర్లక్ష్యం కారణంగానే పసుపు పంట బూడిదగా మారిందని ఆయన ఆవేదన చెందారు. ఇప్పటికీ ప్రభుత్వ అధికారులు యజమానిపై చట్టపరమైన చర్యలు తీసుకోవడంలో విఫలమయ్యారని ఆయన ఆక్షేపించారు.

అప్పటి ప్రతిపక్ష నేత ప్రస్తుత ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అప్పటి ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కి రాసిన లేఖను ఒక్కసారి సీఎంఓ కార్యాలయం తెరచి చూడాలని ఆయన కోరారు. అప్పటి మార్కెట్ రేట్ ప్రకారం పసుపు డబ్బు చెల్లించాలని ఇన్సూరెన్స్ ఇవ్వాలని భవిష్యత్తులో ఇటువంటి ప్రమాదాలు జరగకుండా చూడాల్సిన బాధ్యత ప్రభుత్వాన్ని దేనిని ఆ లేఖలో ముఖ్యమంత్రి తెలిపినట్లు ప్రసాద్ వివరించారు. ముఖ్యమంత్రి కార్యాలయం స్పందించి వెంటనే పసుపు రైతులను ఆదుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. న్యాయవాది పట్టణ పరిసరాల అభివృద్ధి సంఘం అధ్యక్షులు దరిశి శివకోటేశ్వరావు మాట్లాడుతూ పోలీసులు ప్రభుత్వ యంత్రాంగం స్పందించి పసుపు రైతులను ఆదుకోవడంలో విఫలమైందని చెప్పారు. ఇప్పటికైనా ప్రభుత్వం జోక్యం చేసుకొని పసుపు రైతులను ఆదుకోవాలని కోరారు.

INK OF TRUTH
జర్నలిస్ట్ ఫైల్
తెలుగు దినపత్రిక
జర్నలిస్ట్ ఫైల్ దినపత్రిక చందాదారులుగా చేరాలని అనుకుంటున్నారా? అయితే ఈ నెంబర్‌కు ఫోన్ చేయండి
సర్క్యులేషన్ మేనేజర్
76 61 80 59 68

# తెలుగు రాష్ట్రాల అభివృద్ధి దేశానికి మార్గదర్శకంగా నిలవాలి



○ మంత్రి సత్యకుమార్ యాదవ్

**అమరావతి (జర్నలిస్ట్ ఫైల్) :** రెండు తెలుగు రాష్ట్రాలుగా ఆంధ్రప్రదేశ్, తెలంగాణ ఏర్పడి నేటికి 12 సంవత్సరాలు పూర్తయిన సందర్భంగా భాజపా జాతీయ నాయకుడు, రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ మంగళవారం ప్రత్యేక సందేశం విడుదల చేశారు. తెలుగు రాష్ట్రాల ఆవిర్భావానికి 12 సంవత్సరాలు పూర్తికావడం ఒక చారిత్రాత్మక ఘట్టమని ఆయన అభివర్ణించారు.

రాష్ట్రాలుగా విడిపోయినప్పటికీ తెలుగు జాతి హృదయం ఎప్పటికీ ఒకటేనని మంత్రి సత్యకుమార్ యాదవ్ స్పష్టం చేశారు. పరిపాలనా హద్దులు మారినప్పటికీ తెలుగు జాతి సంస్కృతి, గౌరవం ఎన్నటికీ తరిగిపోదని ఆయన గర్వంగా పేర్కొన్నారు. వైద్య ఆరోగ్య శాఖ మంత్రిగా తన బాధ్యతలను స్మరించుకుంటూ ప్రతి తెలుగు కుటుంబానికి నాణ్యమైన వైద్య సేవలు, మెరుగైన జీవన ప్రమాణాలు అందించడమే తమ ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని ఆయన స్పష్టం చేశారు. తెలుగు ప్రజల ఆరోగ్యం, సంక్షేమం పట్ల తమ నిబద్ధత కొనసాగుతుందని హామీ ఇచ్చారు. నగరాల అభివృద్ధి విషయంలో మాట్లాడుతూ హైదరాబాద్ తన అంతర్జాతీయ ఖ్యాతి, గుర్తింపును మరింత విస్తరించుకోవాలని, అమరావతి నూతన భారతానికి ప్రతీకగా ప్రపంచ స్థాయి రాజధానిగా అవతరించాలని ఆయన ఆకాంక్ష వ్యక్తం చేశారు.

వికసిత్ భారత్--2047 లక్ష్య సాధనలో రెండు తెలుగు రాష్ట్రాలు మార్గదర్శక శక్తులుగా ఎదగాలని సత్యకుమార్ యాదవ్ పిలుపునిచ్చారు. తెలుగు జాతి ఐక్యత, కృషి, జ్ఞానం, సంకల్పమే రెండు రాష్ట్రాల భవిష్యత్తు విజయాలకు పునాదిగా నిలుస్తాయని ఆయన విశ్వాసం వ్యక్తం చేశారు.

# 'ఏక్ పేడ్ మా కే నామ్' కార్యక్రమాన్ని విజయవంతం చేయాలి

○ బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు పీవీఎన్ మాధవ్



**విజయవాడ, (జర్నలిస్ట్ ఫైల్) :** ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని పురస్కరించుకుని జూన్ 5న రాష్ట్రవ్యాప్తంగా నిర్వహించనున్న "ఏక్ పేడ్ మా కే నామ్" (అమ్మ పేరున ఒక మొక్క) కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు పీవీఎన్ మాధవ్ పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు.

ఈ సందర్భంగా మంగళవారం విడుదల చేసిన ప్రకటనలో ఆయన మాట్లాడుతూ, ప్రతి మండల కేంద్రంలో పార్టీ నాయకులు, కార్యకర్తలు, ప్రజల భాగస్వామ్యంతో విస్తృత స్థాయిలో మొక్కల నాటే కార్యక్రమాలు చేపట్టాలని సూచించారు. ప్రతి ఒక్కరూ తమ తల్లి పేరుతో కనీసం ఒక మొక్కను నాటి, దాని సంరక్షణ బాధ్యతను స్వీకరించాలని కోరారు.

పర్యావరణ పరిరక్షణ ప్రతి పౌరుడి సామాజిక బాధ్యత అని పేర్కొన్న ఆయన, ప్రధాని నరేంద్ర మోదీ ప్రారంభించిన "ఏక్ పేడ్ మా కే నామ్" ఉద్యమానికి దేశవ్యాప్తంగా విశేష స్పందన లభించిందన్నారు. ప్రకృతి పరిరక్షణతో పాటు తల్లిపట్ల గౌరవాన్ని చాటిచెప్పే ఈ కార్యక్రమాన్ని ప్రజా ఉద్యమంగా మలచాల్సిన అవసరం ఉందని చెప్పారు.

పాఠశాలలు, కళాశాలలు, యువజన సంఘాలు, స్వచ్ఛంద సంస్థలు, సామాజిక సంస్థలను ఈ కార్యక్రమంలో భాగస్వాములను చేయడం ద్వారా మరింత ప్రభావవంతంగా నిర్వహించవచ్చని అభిప్రాయపడ్డారు. మొక్కలు నాటడమే కాకుండా వాటి సంరక్షణపై ప్రత్యేక దృష్టి సారించాలని, వాటి పెరుగుదలను నిరంతరం పర్యవేక్షించేలా చర్యలు చేపట్టాలని సూచించారు.

హరిత ఆంధ్రప్రదేశ్ లక్ష్య సాధనలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని, పర్యావరణ పరిరక్షణ కోసం తమ వంతు బాధ్యతను నిర్వర్తించాలని పీవీఎన్ మాధవ్ పిలుపునిచ్చారు.

# సీఎం పర్యటన ఏర్పాట్లను పరిశీలించిన కలెక్టర్ సాయి కాంత్ వర్మ



**గుంటూరు (జర్నలిస్ట్ ఫైల్) :** రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఈ నెల 3వ తేదీన గుంటూరులోని పీవీఎస్ లలిత ఆసుపత్రి ప్రారంభోత్సవ కార్యక్రమానికి హాజరుకానున్న నేపథ్యంలో జిల్లా కలెక్టర్ సి.యం. సాయి కాంత్ వర్మ మంగళవారం ఏర్పాట్లను పరిశీలించారు.

ముఖ్యమంత్రి పర్యటన సందర్భంగా చేపట్టిన ఏర్పాట్లు, సభా ప్రాంగణం, రాకపోకల మార్గాలు, భద్రతా ఏర్పాట్లు, పారిశుధ్య చర్యలను సంబంధిత అధికారులతో కలిసి కలెక్టర్ సమీక్షించారు. కార్యక్రమం విజయవంతంగా నిర్వహించేందుకు అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని సూచించారు.

ప్రజలకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా అవసరమైన ఏర్పాట్లు చేయాలని, ముఖ్యమంత్రి పర్యటనకు సంబంధించిన అన్ని పనులను నిర్దేశిత గడువులో పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. భద్రత, ట్రాఫిక్ నియంత్రణ, పారిశుధ్యం తదితర అంశాలపై ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు.

ఈ పరిశీలన కార్యక్రమంలో రెవెన్యూ డివిజనల్ అధికారి కె. శ్రీనివాసరావు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

# దేశ ప్రగతికి ఆరోగ్య సంరక్షణే కేంద్ర బిందువు: గవర్నర్ జస్టిస్ అబ్దుల్ నజీర్

○ డాక్టర్ ఎన్టీఆర్ ఆరోగ్య విజ్ఞాన విశ్వవిద్యాలయం 29వ, 30వ సంయుక్త స్నాతకోత్సవాలకు అధ్యక్షత వహించిన గవర్నర్



**విజయవాడ (జర్నలిస్ట్ ఫైల్) :** ఆరోగ్య సంరక్షణ దేశ ప్రగతికి కేంద్ర బిందువుగా మారిందని, నాణ్యమైన, అందుబాటులో ఉండే, అందరికీ సమానంగా చేరువయ్యే వైద్య సేవలను అందించాలనే లక్ష్యంతో దేశం ముందుకు సాగుతోందని రాష్ట్ర గవర్నర్, డాక్టర్ ఎన్టీఆర్ ఆరోగ్య విజ్ఞాన విశ్వవిద్యాలయం కులపతి జస్టిస్ ఎస్. అబ్దుల్ నజీర్ పేర్కొన్నారు. మంగళవారం విజయవాడలోని తుమ్మలపల్లి కళాక్షేత్రంలో నిర్వహించిన డాక్టర్ ఎన్టీఆర్ ఆరోగ్య విజ్ఞాన విశ్వవిద్యాలయం 29వ, 30వ సంయుక్త స్నాతకోత్సవాలకు ఆయన అధ్యక్షత వహించి స్నాతకోత్సవ ప్రసంగం చేశారు.

వైద్య విద్య, ఆరోగ్య మౌలిక వసతుల విస్తరణకు రాష్ట్ర ప్రభుత్వం కట్టుబడి ఉంది. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం వైద్య విద్య, ఆరోగ్య మౌలిక వసతులు, ప్రజారోగ్య సేవల విస్తరణ ద్వారా ఈ లక్ష్య సాధనకు కృషి చేస్తోందని గవర్నర్ తెలిపారు. వైద్య రంగానికి విశిష్ట సేవలను యూనివర్సిటీ అందించిందన్నారు.. డాక్టర్ ఎన్టీఆర్ ఆరోగ్య విజ్ఞాన విశ్వవిద్యాలయం వైద్య, ఆరోగ్య విజ్ఞాన విద్యలో విశిష్టమైన వారసత్వాన్ని నిర్మించుకుందని, వైద్యులు, దంతవైద్యులు, నర్సులు, ఫార్మసిస్టులు, ఫిజియోథెరపిస్టులు మరియు అనుబంధ ఆరోగ్య నిపుణులను తీర్చిదిద్దుతూ దేశ విదేశాల్లో ఆరోగ్య సేవల బలోపేతానికి దోహదపడిందని గవర్నర్ కొనియాడారు.

విద్యార్థులు ప్రజాసేవ, మానవ గౌరవ పరిరక్షణకు జీవితాన్ని అంకితం చేసిన డాక్టర్ ఎన్టీఆర్ ఆశయాలను కొనసాగించాలని సూచించారు. డీఎండీసీ కేంద్రం ఏర్పాటు అభినందనీయం అని అన్నారు. విశ్వ విద్యాలయంలో సమీకృత వ్యాధి పర్యవేక్షణ కార్యక్రమం కింద ఏర్పాటు చేసిన "డిసీజ్ మోడలింగ్ అండ్ డెసిషన్ ఇంటెలిజెన్స్ సెంటర్ "ను గవర్నర్ అభినందించారు. జాతీయ, అంతర్జాతీయ సంస్థల సహకారంతో వ్యాధుల అంచనా, విశ్లేషణ, నిర్ణయాల రూపకల్పనలో నిపుణులను తీర్చిదిద్దే ఈ కేంద్రం శాస్త్రీయ ప్రమాణాలకు అనుగుణంగా పనిచేస్తుందని పేర్కొన్నారు.

విద్యార్థులు యోగా, ధ్యానం సాధన చేయాలని, ఆరోగ్యకరమైన ఆహారపు అలవాట్లు పాటించాలని, తగిన విశ్రాంతి, నిద్రకు ప్రాధాన్యత ఇవ్వాలని గవర్నర్ సూచించారు. శారీరక, మానసిక ఒత్తిడిని అధిగమించి, జీవితాంతం నేర్చుకునే అలవాటు పెంపొందించుకోవాలని ఆకాంక్షించారు. 29వ స్నాతకోత్సవ ముఖ్య అతిథి, హైదరాబాద్ ఏఐజీ ఆసుపత్రుల అరిథ్మియా మరియు ఎలక్ట్రోఫిజియాలజీ సేవల డైరెక్టర్ డాక్టర్ సి. నరసింహన్‌కు గౌరవ డాక్టర్ ఆఫ్ సైన్స్ (డి.ఎస్‌సి.) పట్టా ప్రదానం చేశారు. 30వ స్నాతకోత్సవంలో హైదరాబాద్ అపోలో ఆసుపత్రుల కార్డియాక్ సైన్సెస్ విభాగం డైరెక్టర్, హెచ్‌వోడీ డాక్టర్ పి.సి. రాత్‌కు గౌరవ డాక్టర్ ఆఫ్ సైన్స్ (డి.ఎస్‌సి.) పట్టా ప్రదానం చేశారు. విశ్వవిద్యాలయ ఉపకులపతి డాక్టర్ పి. చంద్రశేఖర్ యూనివర్సిటీ వార్షిక నివేదికను సమర్పించి విద్య, పరిశోధన, సాంకేతికత, విద్యార్థుల సంక్షేమ రంగాల్లో సాధించిన పురోగతిని వివరించారు. అనంతరం ఉపకులపతి డాక్టర్ పి. చంద్రశేఖర్ గవర్నర్ జస్టిస్ ఎస్. అబ్దుల్ నజీర్‌ను జ్ఞాపికతో సత్కరించారు.

# జపాన్ కంపెనీతో ఎస్ఆర్ఎం వర్సిటీ ఎంవోయూ



**అమరావతి (జర్నలిస్ట్ ఫైల్) :** ఏపీ ఎస్ఆర్ఎం విశ్వవిద్యాలయం, టెక్నో స్మైల్ ఇండియా లిమిటెడ్ (జపాన్) కంపెనీల నడుమ వ్యూహాత్మక అవగాహన ఒప్పందం (ఎంవోయూ) జరిగింది. సోమవారం ఉదయం యూనివర్సిటీ కార్పొరేట్ రిలేషన్స్ అండ్ కెరీర్ సర్వీసెస్ విభాగం ఆధ్వర్యంలో జరిగిన ఎంవోయూ కార్యక్రమానికి జపాన్ కంపెనీ టెక్నో స్మైల్ ఇండియా ఎగ్జిక్యూటివ్ వైస్ ప్రెసిడెంట్ వతనబే సన తో పాటు పలువురు కీలక ప్రతినిధులు హాజరయ్యారు. ఎస్ఆర్ఎం యూనివర్సిటీ విద్యార్థులకు వృత్తిపరమైన శిక్షణతో పాటు భాషా నైపుణ్యాలు నేర్పించి వారికి టెక్నో స్మైల్లో ఉద్యోగావకాశాలను సమకూర్చే లక్ష్యంతో రెండు సంస్థల మధ్య ఎంవోయూ జరిగినట్లు యూనివర్సిటీ సీఆర్సీఎస్ డైరెక్టర్ డాక్టర్ వివేకానందన్ తెలిపారు.

ప్రస్తుతం జపాన్ లోని మియావక నగరంలో టయోటా కంపెనీ సహకారంతో కొనసాగుతున్న టెక్నో స్మైల్ ఇండియా లిమిటెడ్ అన్ని విధాలా అనుకూలురైన యువ ఇంజినీర్ల కోసం అన్వేషిస్తుందని ఆ కంపెనీ డైరెక్టర్ గోయ పేర్కొన్నారు. ప్రధానంగా జపాన్ భాష మాట్లాడే ఇంజినీర్లు తమకు ఎంతో అవసరమనీ, ఇండియాలోని ప్రతిష్టాత్మక యూనివర్సిటీల నుంచి ఇంజినీరింగ్ విద్యార్థులను ఎంపిక చేసుకుంటున్నామన్నారు. వీరికి శిక్షణతో పాటు సముచిత ఉద్యోగ అవకాశాలను కల్పిస్తున్నామని వివరించారు. ఈ ఏడాది ఏపీ ఎస్ఆర్ఎం విద్యార్థులకు ఎర్లీ ప్లేస్మెంట్తో పాటు ఇంటర్న్ షిప్ లను కూడా ఏర్పాటు చేస్తున్నామన్నారు. ఎంపిక చేసుకున్న ఇంజినీరింగ్ విద్యార్థులకు ఎటువంటి శిక్షణ, ఎంత కాలం పడుతుందన్న వివరాలను యూనివర్సిటీ రిజిస్ట్రార్ డాక్టర్ వినాయక్ అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఎంవోయూ పత్రాలపై యూనివర్సిటీ రిజిస్ట్రార్ డాక్టర్ వినాయక్, టెక్నో స్మైల్ ఎగ్జిక్యూటివ్ వైస్ ప్రెసిడెంట్ వతనబే సన్లు సంతకాలు చేశారు. ఈ సందర్భంగా యూనివర్సిటీ ఇన్చార్జి వీసీ డాక్టర్ సీవీ టామి జపాన్ కంపెనీ ప్రతినిధులను సత్కరించి పుష్పగుచ్ఛాలను అందజేశారు. ఈ కార్యక్రమంలో జపాన్ కంపెనీ టెక్నో స్మైల్ ఇండియా ప్రెసిడెంట్ కికూచి, డైరెక్టర్ గోయ, ఎస్ఆర్ఎం ప్లేస్మెంట్ డైరెక్టర్ డాక్టర్ వివేకానందన్, ఎస్ఆర్ఎం గ్లోబల్ కన్సల్టెంట్ కంట్రీ మేనేజర్ శంకర్, సీఈవో జ్యోతిష్ కుమార్, ఏజీఎం అంజురాజు తదితరులు పాల్గొన్నారు.

# ఏపీజేఏసీ అమరావతి ఎన్టీఆర్ జిల్లా మహిళా విభాగం నూతన కమిటీ ఎన్నిక



**విజయవాడ (జర్నలిస్ట్ ఫైల్) :** ఏపీజేఏసీ అమరావతి మహిళా విభాగం ఆధ్వర్యంలో 2026-29 కాలానికి ఎన్టీఆర్ జిల్లా మహిళా విభాగం ఎన్నికలు మంగళవారం విజయవాడ రెవెన్యూ భవన్‌లో ఘనంగా నిర్వహించబడ్డాయి. ఏపీజేఏసీ అమరావతి ఎన్టీఆర్ జిల్లా చైర్మన్ బత్తిన రామకృష్ణ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో నూతన జిల్లా కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

ఎన్టీఆర్ జిల్లా మహిళా విభాగం చైర్‌పర్సన్‌గా ఎం. స్వరాజ్యలక్ష్మి (ఏపీపీటీడీ), సహ చైర్‌పర్సన్‌గా ఉషారాణి (సహకార శాఖ), జనరల్ సెక్రటరీగా కుమారి టి. సౌమ్య (రెవెన్యూ), కోశాధికారిగా బి. విజయలక్ష్మి (వైద్య ఆరోగ్య శాఖ) ఎన్నికయ్యారు. అలాగే కో-చైర్‌పర్సన్‌లుగా షాకిరా బేగం, కె. హేమ మాధురి, ఎం. నాగేశ్వరి, కె. సువార్తలు, సెక్రటరీలుగా కె. విజయరాణి, కె. బాలమ్మ, సునీత ఛటోపాధ్యాయ, ఎ. మాధవిలు ఎన్నికయ్యారు.

ఈ సందర్భంగా ఏపీజేఏసీ అమరావతి రాష్ట్ర చైర్మన్ బొప్పరాజు వెంకటేశ్వర్లు నూతనంగా ఎన్నికైన కమిటీ సభ్యులతో ప్రమాణ స్వీకారం చేయించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ ఉద్యోగుల్లో మహిళల ప్రాతినిధ్యం అధికంగా ఉన్నందున ఉద్యోగుల సమస్యల పరిష్కారంలో మహిళల పాత్ర ఎంతో కీలకమని పేర్కొన్నారు. మహిళా ఉద్యోగుల ఐక్యత ద్వారా ఉద్యోగుల హక్కుల సాధన మరింత బలోపేతం అవుతుందని అన్నారు. నూతన కమిటీ చురుకుగా, సమర్థవంతంగా పనిచేస్తుందనే ఆశాభావం వ్యక్తం చేశారు.

ఏపీజేఏసీ అమరావతి సహ చైర్మన్ ఫణి పెర్రాజు మాట్లాడుతూ జిల్లా మహిళా విభాగం రాష్ట్ర కమిటీతో సమన్వయం చేసుకుంటూ సంస్థ కార్యక్రమాల విజయవంతానికి కృషి చేయాలని సూచించారు.

ఈ కార్యక్రమంలో ఏపీజేఏసీ అమరావతి రాష్ట్ర చైర్మన్ బొప్పరాజు వెంకటేశ్వర్లు, సహ చైర్మన్ ఫణి పెర్రాజు, కోశాధికారి టి. నాగేశ్వరరావు, ఎన్టీఆర్ జిల్లా చైర్మన్ బత్తిన రామకృష్ణ, జిల్లా ప్రధాన కార్యదర్శి వై. శ్రీనివాసరావు, ఏపీ పంచాయతీ రాజ్ ఇంజనీర్ల అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు పి. శ్రీనివాస్, రాష్ట్ర మహిళా విభాగం చైర్‌పర్సన్ పారే లక్ష్మి, సెక్రటరీ జనరల్ పొన్నూరు విజయలక్ష్మి, రాష్ట్ర మహిళా విభాగం కార్యవర్గ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

# మెగా డీఎస్సీపై అసత్య ప్రచారాలు మానుకోవాలి: టీఎన్‌యూఎస్

**అమరావతి (జర్నలిస్ట్ ఫైల్) :** ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం చేపట్టిన మెగా డీఎస్సీ నియామక ప్రక్రియపై కొందరు వ్యక్తులు, సంస్థలు చేస్తున్న అసత్య ప్రచారాలను తెలుగునాడు ఉపాధ్యాయ సంఘం (టీఎన్‌యూఎస్) తీవ్రంగా ఖండించింది.

ఈ మేరకు సంఘం రాష్ట్ర అధ్యక్షుడు మన్నం శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శి రామిశెట్టి వెంకటేశ్వర్లు సోమవారం ఒక ప్రకటన విడుదల చేశారు. మెగా డీఎస్సీ ద్వారా వేలాది మంది నిరుద్యోగ యువతకు ఉపాధ్యాయ ఉద్యోగ అవకాశాలు లభించాయని, ప్రభుత్వ పాఠశాలల్లో ఉపాధ్యాయ ఖాళీల భర్తీతో విద్యా వ్యవస్థ మరింత బలోపేతం అవుతుందని వారు పేర్కొన్నారు.

నియామక ప్రక్రియపై నిరాధార ఆరోపణలు చేయడం, ప్రజలను తప్పుదోవ పట్టించే విధంగా వ్యాఖ్యలు చేయడం సమంజసం కాదని అభిప్రాయపడ్డారు.

ప్రభుత్వం పారదర్శకంగా నిర్వహిస్తున్న నియామక ప్రక్రియపై అనవసర అనుమానాలు సృష్టించడం వల్ల అభ్యర్థుల్లో గందరగోళం నెలకొనే అవకాశం ఉందని తెలిపారు.

బాధ్యతాయుతంగా వ్యవహరిస్తూ అసత్య ప్రచారాలకు స్వస్తి పలకాలని సంబంధిత వ్యక్తులు, సంస్థలకు విజ్ఞప్తి చేశారు.

# స్వర్ణ గ్రామం-స్వర్ణ వార్డు ఉద్యోగులను శాఖల్లో శాశ్వతంగా విలీనం చేయాలి

○ డిప్యుటేషన్లు రద్దు చేయాలని గ్రామ వార్డు సచివాలయ ఎంప్లాయిస్ ఫెడరేషన్ డిమాండ్

**అమరావతి (జర్నలిస్ట్ ఫైల్) :** స్వర్ణ గ్రామం--స్వర్ణ వార్డు ఉద్యోగులపై ప్రస్తుతం అమలులో ఉన్న అన్ని డిప్యుటేషన్లను తక్షణమే రద్దు చేసి, వారి విద్యార్హతలు, ప్రత్యేక నైపుణ్యాలు, అనుభవం, ప్రభుత్వ సేవల్లో చూపిన ప్రతిభ ఆధారంగా వివిధ శాఖల్లో శాశ్వతంగా విలీనం చేయాలని గ్రామ వార్డు సచివాలయ ఎంప్లాయిస్ ఫెడరేషన్ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర కమిటీ ప్రభుత్వాన్ని కోరింది.

ఈ మేరకు ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్షుడు షేక్ మొహమ్మద్ జాని పాషా, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బత్తుల అంకమ్మరావు మంగళవారం సంయుక్త ప్రకటన విడుదల చేశారు. స్వర్ణ గ్రామం--స్వర్ణ వార్డు వ్యవస్థ ద్వారా నియమితులైన ఉద్యోగులు గత కొన్నేళ్లుగా వివిధ ప్రభుత్వ శాఖల్లో సమర్థవంతంగా విధులు నిర్వహిస్తూ ప్రజలకు నాణ్యమైన సేవలు అందిస్తున్నారని పేర్కొన్నారు.

అయితే స్పష్టమైన విధానాలు లేకుండా డిప్యుటేషన్ల పేరుతో ఉద్యోగులను ఇతర శాఖలకు తాత్కాలికంగా కేటాయించడం వల్ల వారి సీనియారిటీ, పదోన్నతులు, ఉద్యోగ భద్రత, సేవా ప్రయోజనాలు, భవిష్యత్ అవకాశాలపై తీవ్ర అనిశ్చితి నెలకొందని ఆందోళన వ్యక్తం చేశారు. ఉద్యోగుల సేవలను వినియోగించుకుంటూనే వారికి శాశ్వత భరోసా కల్పించడంలో ప్రభుత్వం ముందడుగు వేయాల్సిన అవసరం ఉందన్నారు.

ఈ నేపథ్యంలో ప్రభుత్వం తక్షణమే జోక్యం చేసుకుని ప్రస్తుతం అమలులో ఉన్న అన్ని డిప్యుటేషన్లను రద్దు చేయాలని, అర్హత కలిగిన ఉద్యోగులను వారి విద్యార్హతలు, అనుభవానికి అనుగుణంగా సంబంధిత శాఖల్లో శాశ్వతంగా విలీనం చేయాలని కోరారు. అలాగే సీనియారిటీ, పదోన్నతులు, ఇతర సేవా హక్కులకు పూర్తి రక్షణ కల్పించడంతో పాటు పారదర్శకమైన విధానంలో నిర్దిష్ట కాలపరిమితిలో విలీన ప్రక్రియను పూర్తి చేయాలని డిమాండ్ చేశారు. ఉద్యోగుల న్యాయమైన డిమాండ్లను ప్రభుత్వం సానుకూలంగా పరిశీలించి శాశ్వత పరిష్కారానికి చర్యలు చేపట్టాలని ఫెడరేషన్ నాయకులు విజ్ఞప్తి చేశారు.

# పాఠశాల విద్యాశాఖలో ఫస్ట్ లెవల్ గెజిటెడ్ పోస్టులను జోనల్ కేడర్లుగానే ఏర్పాటు చేయాలి: ఫోర్టో

**అమరావతి (జర్నలిస్ట్ ఫైల్) :** పాఠశాల విద్యాశాఖలోని ఫస్ట్ లెవల్ గెజిటెడ్ పోస్టులను ఆంధ్రప్రదేశ్ పబ్లిక్ ఎంప్లాయ్మెంట్ (ఆర్గనైజేషన్ ఆఫ్ లోకల్ కేడర్స్ అండ్ రెగ్యులేషన్ ఆఫ్ డైరెక్ట్ రిక్రూట్మెంట్) ఆర్డర్--2025 నిబంధనలకు అనుగుణంగా జోనల్ కేడర్లుగానే ఏర్పాటు చేయాలని ఫోర్టో (ఫోరం ఆఫ్ రిజిస్టర్డ్ టీచర్స్ ఆర్గనైజేషన్స్) రాష్ట్ర నాయకులు డి. శ్రీను, మాగంటి శ్రీనివాసరావు ప్రభుత్వాన్ని కోరారు.

మంగళవారం పాఠశాల విద్యాశాఖ డైరెక్టర్ శ్రీమతి తమీం అన్సారియాను కలిసి ఈ మేరకు వినతిపత్రం సమర్పించినట్లు వారు తెలిపారు. ప్రెసిడెన్షియల్ ఆర్డర్--2025లోని పేరా 3(3) ప్రకారం ఫస్ట్ లెవల్ గెజిటెడ్ పోస్టులు ప్రత్యేక కేటగిరీగా పరిగణించబడతాయని, వాటిని తప్పనిసరిగా జోనల్ కేడర్లుగానే ఏర్పాటు చేయాలని స్పష్టంగా పేర్కొన్నారని వివరించారు.

అయితే గెజిటెడ్ ప్రధానోపాధ్యాయులు, మండల విద్యాధికారులు (ఎంఈఓలు), డైట్ లెక్చరర్లు తదితర పోస్టులను మల్టీ-జోనల్ కేడర్లుగా ఏర్పాటు చేసే ప్రతిపాదనలు ఆర్డర్ నిబంధనలకు విరుద్ధమని వారు పేర్కొన్నారు. మండల పరిషత్, జిల్లా పరిషత్ పాఠశాలల్లో పనిచేస్తున్న ఉపాధ్యాయులు, ప్రధానోపాధ్యాయులు ప్రభుత్వ ఉద్యోగులుగా విద్యాశాఖ పరిపాలనా నియంత్రణలోనే పనిచేస్తున్నారని గుర్తు చేశారు. ముఖ్యంగా జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలల ప్రధానోపాధ్యాయుల పోస్టులు గెజిటెడ్ పోస్టులుగా గుర్తించబడిన విషయాన్ని ప్రస్తావించారు.

ఫస్ట్ లెవల్ గెజిటెడ్ పోస్టులను మల్టీ-జోనల్ కేడర్లుగా మార్చడం వల్ల స్థానిక అభ్యర్థుల నియామకాలు, పదోన్నతి అవకాశాలపై ప్రతికూల ప్రభావం పడే అవకాశం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. స్థానికతకు భంగం కలగకుండా, ఉద్యోగుల హక్కులు పరిరక్షించే విధంగా అన్ని ఫస్ట్ లెవల్ గెజిటెడ్ పోస్టులను జోనల్ కేడర్లుగానే ఏర్పాటు చేయాలని ప్రభుత్వాన్ని కోరారు. ఈ అంశంపై ప్రభుత్వం సానుకూలంగా స్పందించి తగిన ఉత్తర్వులు జారీ చేయాలని ఫోర్టో నాయకులు విజ్ఞప్తి చేశారు.

# పారిశుధ్య, పునరుత్పాదక ఇంధన కార్యక్రమాలకు యూనిడో ప్రశంసలు

○ నగరంలోని వినూత్న ప్రాజెక్టులను పరిశీలించిన కేంద్ర, రాష్ట్ర అధికారుల బృందం



**గుంటూరు (జర్నలిస్ట్ ఫైల్) :** సుస్థిర పట్టణాభివృద్ధి, ప్రజారోగ్య పరిరక్షణ, ఆధునిక పారిశుధ్య నిర్వహణలో గుంటూరు నగరపాలక సంస్థ అమలు చేస్తున్న వినూత్న కార్యక్రమాలను మంగళవారం యునైటెడ్ నేషన్స్ ఇండస్ట్రియల్ డెవలప్‌మెంట్ ఆర్గనైజేషన్ (యూనిడో) ప్రతినిధులు, రాష్ట్రంలోని వివిధ నగరపాలక సంస్థలు, మునిసిపాలిటీల కమిషనర్ల బృందం పరిశీలించింది.

ఈ సందర్భంగా నగర కమిషనర్ కె. మయూర్ అశోక్ బృందానికి నగరంలో యూనిడో సహకారంతో చేపడుతున్న కార్యక్రమాలను వివరించారు. ప్రజారోగ్య పరిరక్షణ, పారిశుధ్య నిర్వహణను మరింత సమర్థవంతంగా నిర్వహించేందుకు ఈ-ఆటోల వినియోగం, వాటి ద్వారా ఇంటింటికీ చెత్త సేకరణ, శుభ్రత కార్యక్రమాల అమలు, పర్యావరణ హిత సాంకేతికతలకు ప్రాధాన్యం ఇస్తూ రిజర్వాయర్ల వద్ద ఈ-ఆటోలకు ఛార్జింగ్ కేంద్రాలు ఏర్పాటు చేసిన విధానాన్ని వివరించారు.

అనంతరం బృందం ఐపీడీ కాలనీలో డోర్-టు-డోర్ చెత్త సేకరణ విధానాన్ని పరిశీలించింది. తడి, పొడి చెత్తను వేర్వేరుగా సేకరించడం, ప్రజల్లో అవగాహన కార్యక్రమాలు నిర్వహించడం, చెత్త నిర్వహణలో ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగిస్తున్న తీరును అధికారులు వివరించారు. అలాగే ఎన్ఎస్‌కేఎఫ్‌డీసీ సహకారంతో ర్యాగ్ పికర్స్‌కు అందించిన ప్రత్యేక వాహనాలను పరిశీలించిన బృందం, వారితో మాట్లాడి వారి అభిప్రాయాలను తెలుసుకుంది.

తదుపరి సంగం జాగర్లమూడి సమ్మర్ స్టోరేజ్ ట్యాంక్ వద్ద ఏర్పాటు చేసిన ఫ్లోటింగ్ సోలార్ ప్లాంట్‌ను సందర్శించింది. నీటి వనరులపై సోలార్ ప్యానెల్స్ ఏర్పాటు చేయడం ద్వారా విద్యుత్ ఉత్పత్తి పెరగడంతో పాటు నీటి ఆవిరీభవనాన్ని కూడా తగ్గించవచ్చని కమిషనర్ వివరించారు.

పర్యటన అనంతరం కేంద్ర గృహ నిర్మాణ మరియు పట్టణ వ్యవహారాల మంత్రిత్వ శాఖ డైరెక్టర్ సురభి మాలిక్ మాట్లాడుతూ గుంటూరులో పారిశుధ్య నిర్వహణ, ప్రజారోగ్య పరిరక్షణ, పర్యావరణ అనుకూల కార్యక్రమాల అమలు తీరుపై సంతృప్తి వ్యక్తం చేశారు. నగరపాలక సంస్థ అధికారులు, సిబ్బంది సమన్వయంతో చేపడుతున్న చర్యలు మంచి ఫలితాలను ఇస్తున్నాయని కొనియాడారు.

భవిష్యత్తులో కేంద్ర ప్రభుత్వం, యూనిడో సంయుక్త సహకారంతో పట్టణాభివృద్ధి, పారిశుధ్యం, పునరుత్పాదక ఇంధన రంగాల్లో మరిన్ని కార్యక్రమాలను అమలు చేసే అవకాశాలు ఉన్నాయని తెలిపారు. గుంటూరులో అమలవుతున్న ఉత్తమ విధానాలను ఇతర నగరాల్లో కూడా విస్తరించేందుకు పరిశీలిస్తామని వెల్లడించారు.

Edited, Printed and Published by D.Ajay at Express Printers and Publishers D.No. 3-28-1, Brundavan Gardens, Guntur (A.P)-522006. RNI No. 52813/1993.
Administration Office : 126-352, Between 4th & 5th lanes , Kodandarama Nagar, Gorlavaripalem Donka, Gorantla, Guntur (AP)-522034. Ph 8106539118, 7416812467